

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 33

మంగళవారం 17-10-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఆసీస్ బోణీ

వరల్డ్‌కప్ లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకపై ఐదు వికెట్ల తేడాతో విజయం - 12లో



మూడో రోజూ నష్టాలు


సెన్సెక్స్ నష్టం 115 పాయింట్లు.. 19,750 దిగువకు నిఫ్టీ - 13లో



ఒలింపిక్స్‌లో క్రికెట్

క్రికెట్, స్క్వాష్, బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, లాక్రాస్ (సిక్స్-ఎ-సైడ్), ఫ్లాగ్ ఫుట్‌బాల్‌ను 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో చేర్చారు.

వివరాలు 12లో ▸



ఊపిరి ఆపలేం

26 వారాల 5 రోజుల వయసున్న గర్భాన్ని తొలగించుకునేందుకు ఓ వివాహిత పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.


వివరాలు 6లో ▸



మోహరించిన ఇజ్రాయెల్ సేనలు

హమాస్ మిలిటెంట్ల స్థావరాలను నేలమట్టం చేయడమే లక్ష్యంగా భూతల దాడులకు ఇజ్రాయెల్ సైన్యం సన్నద్ధమవుతోంది.

వివరాలు 6లో ▸



ఆ కేసులో దోషులకు విముక్తి

2006 నాటి నిఠారి వరుస హత్యల కేసులో కింది కోర్టు దోషులుగా పేర్కొన్న ఇద్దరికి అలహాబాద్ హైకోర్టు విముక్తి కల్పించింది.

వివరాలు 6లో ▸

కొత్త విధి విధానాల ప్రకారం

విచారణ వద్దు

బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌లో ఐఏ దాఖలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

విభజన చట్టంలో నిర్దేశించిన వాటికి.. కొత్త విధి విధానాలు భిన్నంగా ఉన్నాయని వెల్లడి

ఈ నెల 18 నుంచి 20 వరకు విచారించనున్న ట్రిబ్యునల్

2లో

విశాఖలో ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఉద్యోగులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి





సాగర తీరంలో ఐటీ వెలుగులు

విశాఖలో ఆరంభమైన ఇన్ఫోసిస్ కార్యాలయం.. వెయ్యి మందికి ఐటీ ఉద్యోగాలు

డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించిన సీఎం జగన్

ఐటీ సేవల హబ్‌గా విశాఖ వేగంగా ఎదుగుతోంది

నగరంలో ఏటా 15 వేల మంది యువ ఇంజనీర్లు సిద్ధం

ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు, వర్సిటీలు, ఐఐఎం లాంటి సంస్థలు.. రెండేళ్లలో అంతర్జాతీయ విమానాశ్రయం రెడీ

సకల సౌకర్యాలకు కేంద్ర బిందువుగా విశాఖ

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో రూ.1,646 కోట్ల విలువైన ఐటీ కార్యాలయాలు, ఫార్మా యూనిట్లకు సీఎం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

రూ.15 కోట్లతో తయారైన 6 క్లీనింగ్ యంత్రాల సేవలు విశాఖ బీచ్‌లో అందుబాటులోకి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి: ఐటీ సేవల హబ్‌గా మారేందుకు విశాఖపట్నానికి అన్ని అవకాశాలు, సామర్థ్యాలు పుష్కలంగా ఉన్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విశాఖలో ఇన్ఫోసిస్ సెంటర్ ప్రారంభోత్సవంలో పాలు పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. టైర్ 1 సిటీగా విశాఖ రూపాంతరం చెందేందుకు ఇన్ఫోసిస్ రాక దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థలతోపాటు 20 వేల మంది నేవీ ఉద్యోగులతో తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంగా ఉన్న విశాఖ ఎడ్యుకేషన్ హబ్‌గా కూడా నిలిచిందని గుర్తు చేశారు. ఇక్కడ ఇప్పటికే రెండు పోర్టులున్నాయని త్వరలోనే మూడో పోర్టు సమీపంలోని

మిగతా 2వ పేజీలో ▶

పెట్టుబడుల కేంద్రం విశాఖ

- రాష్ట్రంలో ఇన్ఫోసిస్ తొలి డెవలప్‌మెంట్ సెంటర్
- 83,750 చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు.. క్లౌడ్, ఏఐ, డిజిటల్ టెక్నాలజీ సేవలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో ముచ్చటించిన ఇన్ఫోసిస్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు

2లో

షేర్ల కోసం.. తుపాకీతో రామోజీ బెదిరింపు

సంతకం పెడతావా లేదా అంటూ బరితెగింపు

మార్గదర్శి సహ వ్యవస్థాపకుడు జీజే రెడ్డి వారసులపై దౌర్జన్యం

ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో వాటాల బదలాయింపు

జీజే రెడ్డి షేర్లు శైలజా కిరణ్ పేరిట అక్రమంగా మార్పు

రూ.1,59,69,600 మూలధన విలువైన 288 షేర్ల బదిలీ

సీఐడీకి జీజే రెడ్డి కుమారుడు యూరి రెడ్డి ఫిర్యాదు

ఏ-1గా రామోజీ, ఏ-2గా శైలజా కిరణ్‌లపై కేసు నమోదు



సోదరుడు మార్టిన్ రెడ్డి, తండ్రి జీజే రెడ్డితో యూరిరెడ్డి (గళ్లచొక్కా వ్యక్తి) (ఫైల్ ఫొటో)

సాక్షి, అమరావతి: 'మీ షేర్లను బదిలీ చేస్తున్నట్లు సంతకాలు పెడతారా లేదా!?'.. ఓ గదిలో తలకు తుపాకి గురిపెట్టి మరీ ఇలా బెదిరిస్తే ఎవరైనా ఏం చేస్తారు.. ప్రాణభయంతో సంతకాలు చేసేస్తారు కదా. ఈ ఉదంతంలోనూ బాధితులు అదే పనిచేశారు. కానీ, ఇక్కడ తలకు తుపాకి పెట్టి బెదిరించింది ఎవరో కాదు.. చెరుకూరి రామోజీరావు అలియాస్ ఈనాడు రామోజీరావు. ఆ బాధితులు మరెవరో కాదు.. రామోజీరావుతో కలిసి మార్గదర్శి చిట్‌ఫండ్స్ స్థాపించిన జీజే రెడ్డి కుమారులు మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డి. ఇలా.. తుపాకితో బెదిరించి మరీ మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లోని 288 షేర్లను తన కోడలు శైలజా కిరణ్ పేరిట అక్రమంగా బదిలీ చేశారు రామోజీ. ఆ ఒక్క సంతకమే కాకుండా

మిగతా 14వ పేజీలో ▶



చీలిక దిశగా జేడీ(ఎస్)?

- ఎన్డీఏతో పొత్తుపై పొరపొచ్చాలు
- దానితో జత కట్టేందుకు వీల్లేదు
- కర్ణాటక జేడీ(ఎస్) చీఫ్ ఇబ్రహీం.. తమదే అసలు పార్టీ అని వాదన
- ఎమ్మెల్యేలూ తమతోనేనని ప్రకటన.. కుమారస్వామి పరోక్ష మద్దతు?

- వివరాలు 6లో

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ఉత్తమ పథకం

వైఎస్ జగన్ ప్రభుత్వానికి నేషనల్ హెల్త్ అథారిటీ ప్రశంసలు

ప్రజారోగ్య రంగంలో ఉత్తమ పద్ధతులు, ఆవిష్కరణలను ప్రభుత్వం అమలు చేస్తోంది.. పెద్ద శస్త్ర చికిత్సలు చేయించుకున్న పేదలకు ఆరోగ్య ఆసరా పెద్ద భరోసా

శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి సమయంలో పేద కుటుంబాలను ఆదుకుంటోంది.. ఆర్థికంగా నష్టపోకుండా కాపాడుతోంది

దేశంలో మరే రాష్ట్రంలోనూ ఇలాంటి పథకం లేదు

14లో



సీఐడీ ముందుకు 'కిలారు'..

- ఎట్టకేలకు విచారణకు హాజరైన లోకేశ్ బినామీ
- స్కిల్ నిధులు మీకెందుకు వచ్చాయి?.. ఏ హోదాలో షెల్ కంపెనీలతో లావాదేవీలు జరిపారు?
- బ్యాంకు లావాదేవీలు, కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు సంస్థ ప్రశ్నల వర్షం
- సమాధానాల దాటవేతకు యత్నం.. ఆధారాలతో సీఐడీ నిలదీయడంతో తడబాటు
- చివరకు తన ప్రమేయం లేదంటూ ప్రాథేయపడిన కిలారు రాజేశ్

- వివరాలు 13లో

కేన్సర్ రోగుల కష్టాలకు చెక్

- ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే కేన్సర్‌కు వైద్య సేవలు
- డిసెంబర్ 21 నుంచి డే కేర్ కేన్సర్ సేవలు ప్రారంభం
- రోగులకు కీమోథెరపీ, పాలియేటివ్ కేర్ సేవలు
- కేన్సర్ వైద్యానికి హబ్‌లుగా 11 బోధనాస్పత్రులు
- వీటికి 12 జిల్లా ఆస్పత్రులు మ్యాపింగ్.. తొలుత బోధనాస్పత్రుల్లో చికిత్స
- అనంతరం ఆంకాలజీ నిపుణుడి సూచనలతో జిల్లా ఆస్పత్రుల్లో చికిత్స

- వివరాలు 5లో

క్లుప్తంగా...

దేశానికే ఆదర్శంగా విద్య, వైద్యం

- పెట్టుబడుల ఆకర్షణకు సీఎం జగన్ కృషి అభినందనీయం
- లారస్ సీఈవో సత్యనారాయణ



సాక్షి, అనకాపల్లి: పరిపాలన రాజధాని విశాఖలో పెట్టుబడులను ఆకర్షించి కంపెనీల ఏర్పాటుకు సీఎం జగన్ చేస్తున్న కృషి అభినందనీయమని లారెస్ ఫార్మా కంపెనీ సీఈవో చావ సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం అచ్యుతాపురం సెజ్‌లో లారెస్ ఫార్మా యూనిట్-2 సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభమైన అనంతరం లారెస్ సీఈవో 'సాక్షి'తో మాట్లాడారు. ప్రస్తుతం తమ కంపెనీలో (పరవాడ, అచ్యుతాపురం) 4,800 మంది పర్మినెంట్ ఉద్యోగులు పని చేస్తుండగా మరో 3,500 మంది కాంట్రాక్ట్ విధానంలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్య రంగాలలో ప్రభుత్వం తెచ్చిన మార్పులు దేశానికే ఆదర్శమని ప్రశంసించారు.

'ఏపీ విజన్-2047'కి కేంద్రం సహకరించాలి

సాక్షి, అమరావతి: ఏపీ విజన్-2047కు కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందజేయాల్సిన అవసరముందని నీతి ఆయోగ్ బృందానికి సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి విన్నవించారు. భారతదేశం 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యానికి అనుగుణంగా ఏపీ విజన్-2047పై రాష్ట్ర స్ట్రాటజిక్ ప్రణాళిక రూపకల్పన కోసం సోమవారం సచివాలయంలో సీఎస్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటీ సమావేశం జరిగింది. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేందుకు చేపట్టాల్సిన చర్యలపై నీతి ఆయోగ్ బృందం ఒక ప్రజెంటేషన్ ఇచ్చింది. సీఎస్ మాట్లాడుతూ.. నీతి ఆయోగ్ బృందం ఏపీ విజన్-2047పై ముసాయిదా సిద్ధం చేసిందని.. కానీ దాని అమలుకు తగిన నిధులు సమకూర్చడమే పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. కేంద్రం తగిన సహకారం అందిస్తే ఏపీని 2047 నాటికి అన్ని రంగాల్లోనూ మరింత అభివృద్ధి పథంలోకి నడిపించవచ్చన్నారు. వివిధ సెక్టార్ల వారీగా చేపట్టాల్సిన అంశాలపై నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ఈ నెలలో రాష్ట్ర స్థాయిలో వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీతి ఆయోగ్ డైరెక్టర్ అంకుశ్ మాట్లాడుతూ.. తీర ప్రాంతంలో వాణిజ్యం, తదితర రంగాల్లో అభివృద్ధికి గల అవకాశాలను వివరించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు ఎక్కడెక్కడ అనుకూలం?

- విశాఖ జిల్లా యంత్రాంగాన్ని ఆరా తీసిన అధికారుల కమిటీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వ యంత్రాంగం విశాఖకు తరలివచ్చే ప్రక్రియ వేగవంతమవుతోంది. మునిసిపల్, ఆర్థిక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శులతో కూడిన అధికారుల బృందం వైజాగ్‌లో పర్యటిస్తోంది. సీఎం కార్యాలయంతో పాటు ఇతర కార్యాలయాలకు అవసరమైన భవనాలు, అధికారుల వసతి కోసం అనువైన స్థలాలను ఈ బృందం పరిశీలించనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా శాఖల అధికారులు ఎంపిక చేసిన స్థలాలను పరిశీలించి.. అనువుగా ఉంటే ఓకే చేసేందుకు అధికారుల కమిటీ కసరత్తు మొదలెట్టినట్టు సమాచారం. దీనికనుగుణంగా జిల్లా యంత్రాంగంతో సోమవారం సమావేశమైన కమిటీ.. ఖాళీగా ఉన్న భవనాల వివరాలు సేకరించింది.

కొత్త విధి విధానాల ప్రకారం విచారణ వద్దు

- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌లో ఐఏ దాఖలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఏపీ, తెలంగాణకు కృష్ణా జలాల పంపిణీ కోసం కేంద్ర జల్ శక్తి శాఖ కొత్తగా జారీ చేసిన విధి విధానాల ప్రకారం విచారణ చేపట్టొద్దని కోరుతూ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్(కేడబ్ల్యూడీటీ-2)లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఐఏ(ఇంటర్ లోకేటరీ అప్లికేషన్)ను దాఖలు చేసింది. విభజన చట్టంలో కృష్ణా జలాల పంపిణీ కోసం సెక్షన్-89లో ఏ, బీ క్లాజ్‌ల ప్రకారం ట్రిబ్యునల్‌కు నిర్దేశించిన మార్గదర్శకాలకు కేంద్ర జల్ శక్తి శాఖ తాజాగా జారీ చేసిన విధి విధానాలు పూర్తి భిన్నంగా ఉన్నాయని పేర్కొంది. కొత్త విధి విధానాల ప్రకారం విచారణ చేపట్టొద్దని ట్రిబ్యునల్‌ను కోరింది. విభజన నేపథ్యంలో ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాల పంపిణీకి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ గడువును కేంద్రం పొడిగిస్తూ వస్తోంది. 2 రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీపై 2016 నుంచి ట్రిబ్యునల్ విచారణ చేస్తోంది. ఈ నెల 18 నుంచి విచారణ చేపడతామని 2 రాష్ట్రాలకు సమాచారమిచ్చింది. ప్రస్తుతం విభజన చట్టంలో సెక్షన్-89లో ఏ, బీ క్లాజ్ ప్రకారం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు.. బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేయని ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయడం, ప్రాజెక్టుల వారీగా 2 రాష్ట్రాలకు చేసిన కేటాయింపుల ఆధారంగా వాటాలను తేల్చడంపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేస్తోంది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల పునఃపంపిణీ కుదరదని ఇప్పటికే తేల్చిచెప్పింది. ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన మేరకు 2 రాష్ట్రాలకు కృష్ణా జలాల పంపిణీ కోసం ఈ నెల 6న కేంద్ర జల్ శక్తి శాఖ కొత్త విధి విధానాలు జారీ చేసింది. వాటి ప్రకారం బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలను 2 రాష్ట్రాలకు పంపిణీ చేసి.. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేసి, రాష్ట్రాల వాటాలను తేల్చాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు నిర్దేశించడం గమనార్హం.



సముద్ర తీర ప్రాంత శుభ్రత కోసం ఏర్పాటు చేసిన బీచ్ క్లీనింగ్ యంత్రాల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో రూ.500 కోట్లతో నిర్మించిన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ ఇజియా స్టెరిలైస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్

పెట్టుబడుల కేంద్రం విశాఖ

రాష్ట్రంలో ఇన్ఫోసిస్ తొలి డెవలప్‌మెంట్ సెంటర్.. 83,750 చ.అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు

క్లౌడ్, ఏఐ, డిజిటల్ టెక్నాలజీ సేవలు

సీఎం జగన్‌తో ముచ్చటించిన ఇన్ఫోసిస్ ఉన్నతాధికారులు, ఉద్యోగులు

దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో మొదటి వరుసలో నిలిచిన విశాఖ నగరం పారిశ్రామికంగా, వాణిజ్య కేంద్రంగా ఎదుగుతోందని ఐటీ దిగ్గజ నిపుణులు పేర్కొన్నారు. సోమవారం విశాఖలో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించిన సందర్భంగా సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి నీలాంజన్ రాయ్, వైస్ ప్రెసిడెంట్స్ నీలాద్రి ప్రసాద్ మిశ్రా, రఘు బొడ్డుపల్లి తదితరులు ముఖ్యమంత్రి జగన్‌తో కొద్దిసేపు ముచ్చటించారు. విశాఖ కేంద్రంగా ఇన్ఫోసిస్ డేటా సెంటర్ పని తీరును వివరించారు. అనంతరం సంస్థ ఉద్యోగులను పలుకరించిన సీఎం జగన్ వారితో మాట్లాడారు.

- సాక్షి, విశాఖపట్నం

హైబ్రీడ్ వర్కింగ్ మోడల్‌లో..

ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేస్తున్న మొట్టమొదటి డెవలప్‌మెంట్ సెంటర్‌ని విశాఖలో ప్రారంభిస్తున్నందుకు సంతోషంగా ఉంది. దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ మొదటి వరసలో ఉంది. నగరానికి అన్ని మార్గాల్లోనూ ప్రపంచస్థాయి కనెక్టివిటీ ఉంది. పారిశ్రామికంగా, వాణిజ్య కేంద్రంగా వైజాగ్ అభివృద్ధి చెందింది. విశాఖ పెట్టుబడులకు గమ్యస్థానంగా నిలిచింది. ఇక్కడ మా కార్యకలాపాలను ప్రారంభించేందుకు పూర్తి సహాయ, సహకారాలు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం. వర్క్‌స్పేస్‌ను ఇన్ఫోసియన్స్‌కు దగ్గరగా తేవాలనే ఉద్దేశంతో



హైబ్రిడ్ వర్కింగ్ మోడల్‌లో ముందుకు తీసుకెళుతున్నాం. దాదాపు 83,750 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించిన వైజాగ్ కేంద్రం హైబ్రీడ్ మోడ్, ఇంటికి దగ్గరగా పని చేయడానికి ఎక్కువ సౌలభ్యాన్ని అందిస్తుంది. ఈ నూతన కేంద్రం క్లౌడ్, కృత్రిమ మేథ, డిజిటల్ లాంటి టెక్నాలజీల ద్వారా ప్రపంచవ్యాప్తంగా అవకాశాలను అందిపుచ్చుకోవడం, స్థానిక ప్రతిభను ఆకర్షించడం, రీ-స్కిల్, అప్-స్కిల్ కోసం దోహదం చేస్తుంది. సుమారు 1,000 మంది ఉద్యోగులకు తగిన సదుపాయాలు కల్పించేలా దీన్ని రూపొందించాం.

– నీలాంజన్ రాయ్, ఇన్ఫోసిస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్

నా విశాఖ.. నా ఇన్ఫోసిస్



నేను పుట్టింది, పెరిగింది, చదివింది అంతా వైజాగ్‌లోనే అయినా హైదరాబాద్, బెంగళూరులో 20 ఏళ్లుగా ఇన్ఫోసిస్‌లో పని చేస్తున్నాను. నా సొంత ఊరిలో నా సంస్థ ఎప్పుడు ప్రారంభమవుతుందా? అని కలలు కనేవాడిని. ఇన్నాళ్లకు నా కలని నిజం చేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, ఇన్ఫోసిస్ పెద్దలకు కృతజ్ఞతలు. – సతీష్ సూరి, ఇన్ఫోసిస్ ఉద్యోగి

చెప్పలేనంత సంతోషం



నమస్తే సీఎం సర్. ఇన్ఫోసిస్‌లో రెండేళ్లుగా పని చేస్తున్నా. మా ఊరిలో పని చేయాలన్నది నా డ్రీమ్. ఇన్ఫోసిస్ లాంటి పెద్ద కంపెనీ మా సొంత ఊరికి రావడం, అందులో పని చేయడం మాటల్లో చెప్పలేనంత సంతోషంగా ఉంది. ఇందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. – వనిత, ఇన్ఫోసిస్ ఉద్యోగి

నేనున్నా..

- ఇద్దరు తలసేమియా రోగులకు రూ.లక్ష చొప్పున సాయం మంజూరు చేసిన సీఎం జగన్
- అచ్యుతాపురం హెలిప్యాడ్ వద్ద సీఎంకు తమ కష్టాలు విన్నవించుకున్న బాధితులు



సీఎం వైఎస్ జగన్‌కు సమస్యను విన్నవించుకుంటున్న బాధిత మహిళ

సాక్షి, అనకాపల్లి: 'అన్నా.. మా ఇద్దరు పిల్లలూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారు. ప్రతి 15 రోజులకోసారి డయాలసిస్ చేసుకోవాల్సి వస్తోంది.. మీరే ఆదుకోవాలన్నా..' అని సీఎం వైఎస్ జగన్‌కు అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విసన్నపేటకు చెందిన తలసేమియా రోగులు లోకేష(13), గుణసాగర్(11)లతో కలిసి వారి తల్లి నడిశెట్టి లక్ష్మి గోడు వెళ్లబోసుకుంది. పరవాడలో యుజియా ఫార్మా సంస్థ ప్రారంభోత్సవం అనంతరం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బాధితులు కలుసుకున్నారు. వారి సమస్యను విని సీఎం వారిలో మనోధైర్యం నింపారు. నేనున్నా.. అంటూ భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ప్రస్తుత ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికీ లక్ష రూపాయల చొప్పున సాయం అందించాల్సిందిగా జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని ఆదేశించారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఇద్దరు పిల్లలకు రూ.లక్ష చొప్పున తక్షణం సాయం అందజేశారు. అంతేకాకుండా ప్రతీ 15 రోజులకోసారి ఉచితంగా డయాలసిస్ చేయాలని డీఎంహెచ్‌వోకు అప్పగించారు. ముఖ్యమంత్రికి ఎప్పటికీ రుణపడి ఉంటామని ఆ చిన్నారుల తల్లి కన్నీళ్లపర్యంతమైంది.



బాధితులకు చెక్ అందిస్తున్న అనకాపల్లి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ←

పాఠాలే కాదు... జీవిత పాఠాలూ నేర్పాలి

- ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంచే కార్యక్రమాలు చేపట్టాలి
- సామాజిక అంశాలపై చర్చా వేదికలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి
- ఫస్టియర్‌లో చేపట్టే ఇండక్షన్ ప్రోగ్రాం నుంచే వాటిని మొదలుపెట్టాలి
- విశ్వవిద్యాలయాలకు ఏఐసీటీఈ మార్గదర్శకాలు



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ విద్యార్థులకు మొదటి సంవత్సరంలోనే ఆత్మస్థైర్యం కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) విశ్వవిద్యాలయాలకు సూచించింది. విద్యార్థుల్లో ఆత్మన్యూనతా భావం తొలగించి మానసికంగా దృఢంగా ఉండేలా చూడాలని పేర్కొంది. తొలిదశలో నిర్వహించే అవగాహన కార్యక్రమం (ఇండక్షన్ ప్రోగ్రామ్) నుంచే ఇది మొదలవ్వాలని తెలిపింది. ఉన్నత విద్యాసంస్థల్లో ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో వివిధ అధ్యయనాలపై ఏఐసీటీఈ దృష్టి పెట్టింది. ఇంటర్ వరకూ ఎక్కువగా బట్టీ విధానంలో చదివే విద్యార్థులు ఇంజనీరింగ్‌లోని భిన్నమైన విద్యా విధానం వల్ల సొంత అవగాహన పద్ధతులపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారని కేంద్ర విద్యాసంస్థ భావించింది. ఈ సమస్యను అధిగమించడానికి వీలుగా ఇంజనీరింగ్ విద్యకు ముందుగా విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని జాతీయ విద్యావిధానం-2020లో కొన్ని సూచనలు చేసింది. వాస్తవానికి దీనికి సంబంధించిన సూచనలను ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని ఏఐసీటీఈ పేర్కొనగా ఇప్పటికే ఇంజనీరింగ్ తరగతులు మొదలైనందున వచ్చే ఏడాది నుంచి విశ్వవిద్యాలయాలు దీనిపై దృష్టి పెట్టే వీలుందని అధికారులు చెబుతున్నారు.

ఇవీ సూచనలు..

- కేవలం పుస్తకాలకే కాకుండా సామాజికంగా ఎదురయ్యే సవాళ్లపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. తరగతి పాఠాలకే పరిమితం చేయకుండా సామాజిక అంశాలపై చర్చా వేదికలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. ప్రతి యూనివర్సిటీలోనూ దీనికోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులు ఇంజనీరింగ్‌లో చేరాక ఇంటర్ వరకూ ఉన్న వాతావరణం నుంచి ఇంజనీరింగ్ అనే కొత్త ప్రపంచం అర్థమయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏ విద్యార్థి ఏ ప్రాంతం నుంచి వచ్చాడు? అతని సామర్థ్యం ఏమిటి? అందరిలో కలుస్తున్నాడా? వంటి అంశాలను అధ్యాపకులు గమనించాలి. తరగతి గదిలో అందరి మధ్య సఖ్యత పెరిగి స్నేహపూర్వక వాతావరణం నెలకొన్న తర్వాతే బోధన చేపట్టాలి.
- ఇంజనీరింగ్‌లోని వివిధ బ్రాంచీలకు చెందిన విద్యార్థుల మధ్య సమన్వయం నెలకొనేందుకు కాలేజీలు ప్రయత్నించాలి. దీనికోసం సృజనాత్మకత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపకల్పనకు వర్సిటీలు కృషి చేయాలి.
- అకడమిక్ నాలెడ్జ్‌తోపాటు అనుభవపూర్వకంగా విద్యను నేర్చుకోవడం వల్ల విద్యార్థి మానసిక వికాసం పెరుగుతుందని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అభిప్రాయపడింది. దీన్ని కాలేజీలు విధిగా అనుసరించాలి.

సాగర తీరంలో ఐటీ వెలుగులు



అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో లారస్ సంస్థ రూ.440 కోట్లతో నిర్మించిన ఫార్ములేషన్ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ప్రారంభోత్సవాలు (■ పెట్టుబడి (రూ.కోట్లలో) ■ ఉద్యోగుల సంఖ్య)

	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉద్యోగుల సంఖ్య
ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్	35	1,000
యూజియా స్టెరిల్స్ ప్రై.లిమిటెడ్	500	750
లారస్ సింథసిస్ ల్యాబ్	191	300
లారస్ ల్యాబ్	440	500

భూమి పూజలు

	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉద్యోగుల సంఖ్య
లారస్ సింథసిస్ ల్యాబ్	240	450
లారస్ ల్యాబ్	240	450

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీకాకుళంలో రానుందని తెలిపారు. మరో రెండేళ్లల్లో పూర్తిస్థాయి అంతర్జాతీయ పౌర విమానాశ్రయం కూడా సిద్ధం కానుందని చెప్పారు. పరిశ్రమలకు ఏ సహాయం కావాలన్నా ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటామని పారిశ్రామికవేత్తలకు హామీ ఇచ్చారు. సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటన సందర్భంగా విశాఖలో ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సీఎం జగన్ ప్రారంభించారు. ఫార్మా కంపెనీల నాలుగు యూనిట్లకు ప్రారంభోత్సవాలు, 2 యూనిట్లకు శంకుస్థాపనలు నిర్వహించారు. మొత్తం రూ.1,646 కోట్ల విలువైన ఐటీ కార్యాలయాలు, ఫార్మా యూనిట్ల ఏర్పాటుతో 3,450 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. విశాఖలో సముద్ర తీరం శుభ్రత కోసం జీవీఎంసీ సిద్ధం చేసిన 6 బీచ్ క్లీనింగ్ యంత్రాలను కూడా ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సీఎం జగన్ ఏమన్నారంటే..

విశాఖకు విశేష సామర్థ్యం..

విశాఖకి విశేషమైన సామర్థ్యం ఉంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తరహాలో విశాఖపట్నం కూడా ఐటీ హబ్‌గా మారబోతోంది. ఆ స్థాయిలో ఈ నగరానికి సహకారాన్ని అందిస్తున్నాం. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ తరహా మెట్రో నగరం ఆంధ్రప్రదేశ్‌లో లేదు. ఐటీ, ఐటీ సేవలకు సంబంధించిన పరిశ్రమలు గతంలో విశాఖలో ఏర్పాటు కాలేదు. వాస్తవానికి ఆ కంపెనీల ఏర్పాటుకు కావాల్సిన అన్ని అర్హతలు, సామర్థ్యం నగరానికి ఉన్నప్పటికీ అవన్నీ అప్పటి రాజధాని హైదరాబాద్‌లోనే ఏర్పాటయ్యాయి. ఏపీలో విశాఖ అతిపెద్ద నగరం. టైర్ 1 సిటీగా ఎదగడానికి కావాల్సిన అన్ని అర్హతలు, సామర్థ్యం ఈ నగరానికి ఉన్నాయి. ప్రథమ శ్రేణి నగరంగా ఎదగడానికి అవసరమైన తోడ్పాటును ఇన్ఫోసిస్ అందించగలదని నేను బలంగా నమ్ముతున్నా. 3.28 లక్షల మంది ఉద్యోగులు, 18.5 బిలియన్ డాలర్ల రెవెన్యూ సామర్థ్యం కలిగిన ఇన్ఫోసిస్‌తో పాటు టీసీఎస్, విప్రో లాంటి సంస్థలు నగర ఐటీ స్వరూపాన్ని, ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చి వేస్తాయి. విశాఖకు ఇప్పుడు ఇన్ఫోసిస్ వచ్చింది. రానున్న రోజుల్లో మిగిలిన ఐటీ కంపెనీలు కూడా ఆ జాబితాలో చేరనున్నాయి. విశాఖలో అదానీ డేటాసెంటర్ కూడా రాబోతుంది. సబ్‌మెరైన్ ఇంటర్నెట్ కేబుల్ మనకు ప్రత్యేకంగా సింగపూర్ నుంచి వస్తుంది. రాబోయే రెండేళ్లలో డేటా సెంటర్ రానుంది. క్లౌడింగ్‌తో పాటు ఐటీ రంగంలో చాలా మార్పులు రానున్నాయి. ఇవన్నీ సాకారం కానున్నాయి. నీలాంజన్, నీలాద్రిప్రసాద్, సురేష్, రఘు లాంటి ఐటీ నిపుణులతో మాట్లాడిన తర్వాత వీరంతా విశాఖ ఐటీలో కచ్చితంగా ఒక రోజు అద్భుతాలు సృష్టిస్తారని బలంగా విశ్వసిస్తున్నా. నాకు ఆ నమ్మకం ఉంది. ఇవాళ 1,000 మందితో ఇక్కడ ప్రారంభమైన ఇన్ఫోసిస్ రానున్న రోజుల్లో మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, ఇన్ఫోసిస్‌తో కలసి ఐటీ రంగంలో విశాఖ బహుముఖ ప్రగతిని సాధిస్తుందన్న విశ్వాసం నాకుంది. రానున్న రోజుల్లో విశాఖలో పెట్టుబడులకు అనేక మంది ముందుకొచ్చే అవకాశాలున్నాయి. అందుకు అనుగుణంగా పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాం.

ఇప్పటికే ఎడ్యుకేషన్ హబ్



బీచ్ క్లీనింగ్ మిషన్ వాహనాన్ని నడుపుతోన్న సీఎం వైఎస్ జగన్

విశాఖలో ఇప్పటికే అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలు ఏర్పాటయ్యాయి. 14 ఇంజనీరింగ్ కాలేజీలు, 8 యూనివర్సిటీలు, 4 మెడికల్ కాలేజీలు, 12 డిగ్రీ కాలేజీలతో విశాఖ ఎడ్యుకేషన్ హబ్‌గా ఉంది. ఇక్కడి నుంచి ఏటా దాదాపు 12 వేల నుంచి 15 వేల మంది ఇంజనీర్లు డిగ్రీ పూర్తి చేసుకుని వస్తున్నారు. వీటితో పాటు ఐఐఎం, నేషనల్ లా యూనివర్సిటీ లాంటి అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలు కూడా విశాఖలో ఉన్నాయి. ఇదీ విశాఖ సామర్థ్యం. ఇక్కడే ఐవోసీతోపాటు తూర్పు నౌకా దళం ప్రధాన కేంద్రం కూడా ఉంది. విశాఖ, గంగవరం లాంటి రెండు బలమైన పోర్టులు కూడా ఉన్నాయి. వీటితో పాటు శ్రీకాకుళంలో మూడో పోర్టు వస్తోంది.

మధురవాడ ఐటీ హిల్స్‌లో ఇన్ఫోసిస్

గన్నవరం నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న సీఎం జగన్ తొలుత మధురవాడ ఐటీ హిల్స్‌లో రూ.35 కోట్లతో ఏర్పాటైన ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్‌ని ప్రారంభించారు. సంస్థ ప్రాంగణమంతా పరిశీలించారు. జీవీఎంసీ సముద్రతీర ప్రాంత శుభ్రత కోసం రూ.15 కోట్లతో ఏర్పాటు చేసిన 6 బీచ్ క్లీనింగ్ యంత్రాలను ప్రారంభించారు. క్లీనింగ్ యంత్రాలపైకి ఎక్కి అవి ఎలా పని చేస్తాయన్న వివరాలను సీఎం ఆరా తీశారు. పరవాడ చేరుకుని రూ.500 కోట్లతో ఫార్మాసిటీలో 19.34 ఎకరాల్లో ఏర్పాటైన అరబిందో ఫార్మా అను బంధ సంస్థ యూజియా స్టెరిలైజ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సంస్థ ఏటా 420 మిలియన్ సామర్థ్యం కలిగిన జనరల్ ఇంజెక్టబుల్స్‌ను తయారు చేయనుంది. అనంతరం అచ్యుతాపురంలో లారస్ సంస్థ రూ. 440 కోట్లతో నిర్మించిన ఫార్ములేషన్ బ్లాక్‌ను, రూ. 191 కోట్లతో ఏర్పాటైన యూనిట్-2ను సీఎం ప్రారంభించారు. లారస్ రూ.240 కోట్లతో 450 మందికి ఉపాధి కల్పించేలా నిర్మించనున్న యూనిట్ -3తో పాటు మరో రూ.240 కోట్లతో ఇదే సంస్థ పరవాడ వద్ద నిర్మించనున్న యూనిట్-7కు సీఎం శంకుస్థాపన చేశారు. ఫార్మా ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు. పరిపాలన రాజధానిగా శరవేగంగా ముస్తాబవుతున్న విశాఖకు అక్టోబర్‌కే తరలి వెళ్లాల్సి ఉన్నా కార్యాలయాలు ఇంకా పూర్తి స్థాయిలో సిద్ధం కాకపోవడం, విస్తృత భద్రతా కారణాల దృష్ట్యా అధికారుల సూచనల మేరకు డిసెంబర్‌లో వెళ్లే అవకాశం ఉందని సీఎం సమావేశంలో చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఇన్ఫోసిస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ నీలాంజన్ రాయ్, వైస్ ప్రెసిడెంట్ నీలాద్రి ప్రసాద్ మిశ్రా, లారస్ సీఈవో సత్యనారాయణ, డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు, మంత్రులు బొత్స, గుడివాడ, ఆదిమూలపు, రజని, మేయర్ హరివెంకటకుమారి, ఎంపీలు ఎంవీవీ, సత్యవతి, మాధవి, ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పాల్గొన్నారు.

40% మహిళా ఉద్యోగులే

1981లో ఏర్పాటైన ఇన్ఫోసిస్ భవిష్యత్తు డిజిటల్ సేవలు, కన్సల్టింగ్‌లో ప్రపంచవ్యాప్తంగా అగ్రగామిగా ఉంది. 56 దేశాలలో 274 చోట్ల సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సెక్యూరిటీస్ డీలర్స్ ఆటోమేటెడ్ కొటేషన్స్ (నాస్‌డాక్) జాబితాలో భారత తొలి ఐటీ కంపెనీగా ఇన్ఫోసిస్ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు 71.01 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇన్ఫోసిస్‌లో ప్రపంచవ్యాప్తంగా 3,50,000 మంది ఉద్యోగులు పని చేస్తుండగా వీరిలో 40 శాతం మంది మహిళా ఉద్యోగులే కావడం గమనార్హం. 2023లో ప్రపంచంలో అత్యంత నైతికత (ఎథికల్) సంస్థలలో ఒకటిగా ఇన్ఫోసిస్ గుర్తింపు పొందింది. టైమ్ మ్యాగజైన్ టాప్ 100 ప్రపంచ అత్యుత్తమ సంస్థలు 2023 జాబితాలో ఉన్న ఏకైక భారతీయ సంస్థగా ఇన్ఫోసిస్ నిలిచింది. గ్లోబల్ టాప్ ఎంప్లాయర్ 2023 సర్టిఫికేషన్‌ను సొంతం చేసుకుంది.

అలల ప్రేరణతో కార్యాలయం

టాలెంట్ స్ట్రాటజీలో భాగంగా ప్రతిభా కేంద్రాలకు దగ్గరగా డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఇన్ఫోసిస్ నిర్దేశించుకుంది. మంగుళూరు, మైసూర్, త్రివేండ్రం, నాగ్‌పూర్, ఇండోర్, జైపూర్, హుబ్లీ, చండీగఢ్, భువనేశ్వర్, కోయంబత్తూర్ లాంటి టైర్ 2 నగరాల్లో డెలివరీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తాజాగా విశాఖలో సేవలను ప్రారంభించింది. మధురవాడలోని ఐటీ హిల్ నం.2లో ఉన్న సిగ్నిటివ్ టవర్స్‌లో లీజుకు తీసుకున్న బిల్ట్ అప్ స్థలంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. విశాఖకు సహజ అందాలను తీసుకొచ్చిన సముద్రపు అలల ప్రేరణతో కార్యాలయంలోని ఇంటీరియర్ డిజైన్ రూపొందించారు. జావా, జే2ఈఈ, శాప్, డేటాసైన్స్, డేటా అనలిటిక్స్ లాంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎనర్జీ - యుటిలిటీ, రిటైల్ సహా బహుళ పరిశ్రమలకు ప్రపంచవ్యాప్తంగా క్లైయింట్స్ సేవలను ఈ కేంద్రం నుంచి అందిస్తారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులలో సింహభాగం విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం పరిసర ప్రాంతాలకు చెందినవారే ఉన్నారు. మరింత మంది నియామకం కోసం విశాఖలోని వివిధ కళాశాలలతో ఇన్ఫోసిస్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇన్ఫోసిస్ రాక విశాఖలో ఐటీ పరిశ్రమ వృద్ధిపై ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. ఇప్పటికే ఉన్న బీపీవో/కేపీవో పరిశ్రమలతో పాటు కోర్ ఐటీ కంపెనీలతో కలసి ఎమర్జింగ్ టెక్నాలజీ హబ్‌గా విశాఖ అడుగులు వేసేందుకు దోహదం చేయనుంది.

నాణ్యమైన విద్యతోనే సుస్థిరాభివృద్ధి

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్



సాక్షి, అమరావతి: విద్యార్థులు సాధించిన అభ్యసన ఫలితాలు రాష్ట్ర విద్యా సాధన సర్వేలో కనిపిస్తాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ అన్నారు. సోమవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర విద్యాసాధన సర్వే–2023 మాస్టర్ ట్రైనర్స్ శిక్షణకు హాజరై ఆయన మాట్లాడారు. కేంద్రం నిర్వహిస్తోన్న ఈ సర్వే ద్వారా విద్యారంగ పరిస్థితులను అంచనా వేసి, అందుకనుగుణంగా విద్యా పథకాలను ప్రవేశపెడతారని తెలిపారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) నాణ్యమైన విద్య ముఖ్యమైన అంశమని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు, ఎంఈవోలు, డీఈవోలు కృషి చేయాలని సూచించారు. 3, 6, 9 తరగతుల విద్యార్థుల అభ్యసన ఫలితాలను అంచనా వేసేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో ఉండే ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల శిక్షణ కార్యక్రమాలను మాస్టర్ ట్రైనర్స్ సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో ప్రాథమిక అక్షరాస్యత కూడా పరీక్షిస్తారని, విద్యార్థుల పరిజ్ఞానంతో పాటు వారి అభిప్రాయాలు, ఉపాధ్యాయుల అభిప్రాయాలను కూడా ఈ సర్వే ద్వారా సేకరించనున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 27 వేల పైచిలుకు పాఠశాలల్లో 7 లక్షల మందికి పైగా విద్యార్థులను ఈ సర్వే ద్వారా పరీక్షిస్తారని, తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ, కన్నడ, తమిళం, ఒడియా మాధ్యమాల్లో సర్వే ఉంటుందని తెలిపారు.

3,282 వర్సిటీ పోస్టులకు 20న నోటిఫికేషన్

రాతపరీక్ష ఆధారంగా ఎంపిక

- బోధనేతర పోస్టుల భర్తీకి రేషనలైజేషన్ జరుగుతోంది
- యూనివర్సిటీలను పటిష్టం చేయడానికి అన్ని చర్యలు
- విద్యార్థులను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వైపు నడిపిస్తాం
- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి



రాజానగరం: యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 3,282 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 20న నోటిఫికేషన్ ఇస్తామని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. వీటితో పాటు డిప్యుటేషన్‌పై మరో 70 పోస్టులు భర్తీ చేస్తామన్నారు. వర్సిటీల్లో అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ తదితర ప్రతి పోస్టునూ భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వర్సిటీల్లో ఇంత భారీ ఎత్తున ఖాళీల భర్తీ గతంలో ఎప్పుడూ జరగలేదని గుర్తు చేశారు. యూనివర్సిటీలను పటిష్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీకి సోమవారం వచ్చిన హేమచంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 18 వర్సిటీల్లో చదువుతున్న 12 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో వారిని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వైపు నడిపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అడ్‌హాక్ అధ్యాపకులకు 10 శాతం వెయిటేజీ

వర్సిటీల అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం పనిచేస్తున్న అడ్‌హాక్ అధ్యాపకులకు 10 శాతం వెయిటేజీ మార్కులు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారని హేమచంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని వర్సిటీల్లో సుమారు 2,600 మంది కాంట్రాక్టు పద్ధతిలో బోధిస్తోన్నరన్నారు. వీరిలో సుమారు వెయ్యి మంది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రోగ్రామ్ (విద్యార్థులు చెల్లించే ట్యూషన్ ఫీజుల నుంచి జీతాలు పొందేవారు) కింద పని చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం చేపట్టే పోస్టుల భర్తీ ప్రక్రియలోకి వీరు రారని, వారి విధులకు ఎటువంటి ఆటంకం ఉండదని స్పష్టం చేశారు. మిగిలిన వారు ఓపెన్ రిక్రూట్‌మెంట్‌లో ఇతరులతో పాటే దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందన్నారు. వారి సర్వీసును పరిగణనలోకి తీసుకుని ఇచ్చే 10 శాతం వెయిటేజీ మార్కులను ఏడాదికి ఒకటి చొప్పున లెక్కిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించి, ఒక్కో పోస్టుకు 12 మందిని ఎంపిక చేస్తారన్నారు. వారి నుంచి అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఒక పోస్టుకు నలుగురిని ఎంపిక చేస్తారని చెప్పారు. వర్సిటీల్లోని బోధనేతర సిబ్బంది ఖాళీల భర్తీకి ప్రస్తుతం రేషనలైజేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. దీని కోసం ఉర్దూ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ రెహమాన్ అధ్యక్షతన కమిటీని నియమించామన్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా భర్తీ ప్రక్రియను ప్రకటిస్తామని తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి కోసమే ఇంటర్న్‌షిప్

డిగ్రీలు పూర్తి చేసినప్పటికీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం విద్యార్థుల్లో కొరవడుతోందనే ఉద్దేశంతోనే చదువుకునే సమయంలోనే ఇంటర్న్‌షిప్ చేయాలనే నిబంధన పెట్టామని ఆచార్య హేమచంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు కలెక్టర్ చైర్మన్‌గా కమిటీలుంటాయన్నారు. వారు ఇచ్చిన నివేదిక మేరకు ఎక్కడెక్కడ అవకాశాలున్నాయనే సమాచారాన్ని ఐఐసీ పోర్టల్‌లో ఉంచుతున్నామని వివరించారు. ఇవి కాకుండా కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు వర్చువల్ విధానంలో ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే వెసులుబాటు కల్పిస్తోన్నమని చెప్పారు. ఏడాదికి 3.50 లక్షల మంది ఇంటర్న్‌షిప్ చేయాల్సి వస్తుండగా సుమారు 5 లక్షల అవకాశాలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

ఉత్సాహంగా తిరంగా వెల్ఫేర్ బతుకమ్మ ఉత్సవాలు



ముంబైలో బతుకమ్మ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వర్లీ, లోయర్‌పరేల్, బాంద్రా, అంధేరి, బోరివలి తదితర ప్రాంతాల్లో బతుకమ్మ పాటలతో పరిసరాలు మారుమోగుతున్నాయి. దసరానవరాత్రి ఉత్సవాల్లో దేవిమాతను అలంకరించే చీరల రంగుల ప్రకారం చీరలు ధరించి బతుకమ్మలు ఆడుతూ కన్పిస్తున్నారు. బాంద్రాలోని తిరంగా వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం కూడా బతుకమ్మ పండుగ ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. తూర్పు బాంద్రా జ్ఞానేశ్వర్‌నగర్‌లో శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో ఈ ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆదివారం దేవీమాతను ప్రతిష్ఠించిన తొలిరోజు ఆరెంజ్ రంగు కావడంతో మహిళలు ఆ రంగు చీరలు ధరించి, సోమవారం తెలుపు రంగు కావడంతో తెల్ల చీరలు ధరించి బతుకమ్మ ఆడారు.

– సాక్షి ,ముంబై



ఓటర్ల హక్కు

తాము ఎన్నుకోబోయే అభ్యర్థికి సంబంధించిన అన్ని వివరాలను తెలుసుకోవడం ఓటర్ల హక్కుగా ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అందువల్లే పోటీ చేసే అభ్యర్థులు తమ ఆస్తులు, అప్పులు, ఉన్న కేసులు, జైలు జీవితం అనుభవిస్తే ఆ వివరాలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలు, కుటుంబ సభ్యుల వివరాలన్నీ నామినేషన్ సందర్భంగా లిఖితపూర్వకంగా ఎన్నికల అధికారికి తెలపాలని పేర్కొంది. అయితే కొందరు అభ్యర్థులు అఫిడవిట్‌లో అన్ని వివరాలు తెలపడంలో అవలంబిస్తున్న నిర్లక్ష్యంపై సుప్రీం కోర్టులో కేసు దాఖలైంది. దీనిపై 2013లో న్యాయస్థానం తీర్పును వెలువరించింది. దాని ప్రకారం అఫిడవిట్‌లో ఏ ఒక్క కాలమ్‌ను నింప కుండా ఖాళీగా ఉంచవద్దంటూ పేర్కొంది. ఎవరైనా అభ్యర్థి పొరపాటున ఎక్కడైనా ఖాళీగా వదిలేస్తే దాన్ని పూర్తిగా నింపాలంటూ తేల్చి చెప్పింది.



అఫిడవిట్‌లో అలసత్వం వద్దు

నామినేషన్ దాఖలులో జాగ్రత్తలు తప్పనిసరి • ముగ్గురు ఎమ్మెల్యేలకు అఫిడవిట్ తిప్పలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సతీమణి వనమా పద్మావతి పేరిట ఉన్న ఇన్నోవా వాహనంపై హైదరాబాద్‌లోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.135 ట్రాఫిక్ చలాన్ పెండింగ్‌లో ఉంది. ఆయన కుటుంబం పాల్వంచ మున్సిపాలిటీకి రూ.3,120 వాటర్ బిల్లు బకాయి ఉంది. వీటితో పాటు వివిధ ఆస్తులు, తనపై నమోదైన పోలీసు కేసుల వివరాలను 2018 ఎన్నికల్లో నామినేషన్ దాఖలు సందర్భంగా వనమా అఫిడవిట్‌లో పేర్కొనలేదు. పారదర్శకత పాటించడంలో విఫలమైనందున వనమా ఎన్నికను రద్దు చేయాలంటూ ఆయన ప్రత్యర్థి జలగం వెంకట్రావు హైకోర్టును ఆశ్రయించి చుక్కలు చూపించారు. చిన్న ట్రాఫిక్ చలానాయే కదా అనే నిర్లక్ష్యం, ప్రజాజీవితంలో ఉన్నోళ్లపై పోలీసు కేసులు సహజమే అనే ఏమరుపాటు ఇబ్బంది తెచ్చిపెట్టగా కేసు ఇంకా సుప్రీంలో కొనసాగుతోంది. ప్రజా జీవితంలో ఉన్నోళ్లు ప్రతీ అంశాన్ని ప్రజలకు తెలియజేయాల్సిందే. ఆస్తులు, అప్పులు, కేసుల వివరాల వెల్లడిలో అలసత్వముంటే ఇబ్బందులు ఎదురవుతాయనేందుకు వనమా ఉదంతం ఉదాహరణగా నిలుస్తోంది. వనమా తరహాలోనే నామినేషన్ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో వివరాలను టాంపరింగ్ చేశారనే ఆరోపణలతో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సైతం న్యాయపరమైన చిక్కుల్లో పడిన సంగతి తెలిసిందే.

పత్రికా ప్రకటనలు

అభ్యర్థులు తమపై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను ప్రజలకు బహిరంగా తెలపాలనే నిబంధన సైతం 2013 నుంచి అమల్లోకి తెచ్చారు. నామినేషన్ దాఖలు చేసిన తర్వాత పోలింగ్‌కు రెండు రోజుల ముందులోపు స్థానికంగా ఉన్న పేపర్లు/టీవీల్లో ప్రకటనల ద్వారా క్రిమినల్ కేసుల వివరాలను ప్రజలకు తెలపాల్సి ఉంటుంది. అది కూడా ఏ మూలనో కాకుండా ప్రముఖంగా కనిపించేలా మూడు సార్లు ప్రకటనలు ఇవ్వాలి. ఇలా ప్రజలకు అన్ని వివరాలను తెలియజేయకుండా ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టినట్టయితే ప్రజా ప్రాతినిధ్య చట్టం –1951 ప్రకారం అనర్హతకు గురవుతారు.

బీ ఫామ్ అందుకోగానే

బీ ఫామ్ అందుకోవడమే ఆలస్యం నామినేషన్ దాఖలు చేయడం, ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించడమే తరువాయి అనుకుంటే పొరపాటే. నామినేషన్ సందర్భంగా అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్ (లిఖిత వాంగ్మూలం) విషయంలో జాగ్రత్త పడకపోతే చిక్కులు తప్పవు. అక్కడ రాసే ప్రతీ అక్షరం, పొందు పరిచే ప్రతీ విషయం ఆ అభ్యర్థిని నీడలా వెంటాడుతాయి. ఏమైనా పొరపాట్లు జరిగితే ఎన్నిక రద్దవ్వడమే కాదు తదుపరి ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా వీలుండదు.

26న ఫార్మర్ కోటాలో స్పాట్ కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీటెక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ ఫార్మర్ కోటాలో ప్రవేశాలకు ఈ నెల 26వ తేదీన స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కంప్యూటర్ టెస్ట్‌కు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: పలు ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తోన్న ఉద్యోగుల కంప్యూటర్ నైపుణ్య పరీక్ష రాసేందుకు వీలుగా ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయా ఉద్యోగులు నేటి నుంచి ఈ నెల 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ సోమవారం కోరారు. ఇందులో గ్రామ/వార్డు సెక్రటేరియట్ ఉద్యోగులు, గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్ 1, 2 వీఆర్వోలు, 2014 మే 12 తర్వాత కారుణ్య నియామకంలో పలు డైరెక్టరేట్లు, హెచ్‌వోడీలు, సచివాలయ విభాగాల్లో చేరిన ఉద్యోగులు, వీఆర్వోల నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందినవారు, కారుణ్య నియామకాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలుగా సేవలు అందిస్తున్నవారు సీపీటీకి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన దసరా సెలవులను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు తప్పనిసరిగా పాటించాలని, అలా కాకుండా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ హెచ్చరించింది. మంగళగిరిలోని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు మీడియాతో మాట్లాడుతూ కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ ఆదేశాలను కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు పాటించడం లేదనే ఫిర్యాదులు వచ్చాయన్నారు. కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయని, మరికొన్ని విద్యా సంస్థలు మొబైల్ ఫోన్ ద్వారా హోమ్ వర్కులు చేయమని బాలలపై ఒత్తిడి పెంచుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైన దసరా సెలవుల్లో ప్రత్యేక తరగతులు, ఆన్‌లైన్ తరగతులు, ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తే రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెయిల్ apscpcr-2018@gmail.comకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండల, జిల్లా స్థాయిల్లోని విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలను గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బ్రహ్మచారిణిగా జోగుళాంబ



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారు సోమవారం బ్రహ్మచారిణిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 'స్వాధిష్టాన చక్రనిలయాం బ్రహ్మచారిణ్యాముత్తమాం' అంటూ శరన్నవ రాత్రులలో భాగంగా అమ్మవారిని బ్రహ్మచారిణిగా అలంకరించి ఆరాధించారు.

సంతానలక్ష్మిగా లక్ష్మీతాయారమ్మవారు




భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీతాయారు అమ్మవారు సోమవారం సంతానలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.

అన్నపూర్ణ అలంకరణలో భద్రకాళి



హన్మకొండ కల్చరల్: వరంగల్ శ్రీభద్రకాళి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవీశరన్నవ రాత్రి మహోత్సవాలలో రెండోరోజు ఆశ్వ యుజశుద్ధ విదియ సోమవారం శ్రీభద్రకాళి అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించారు. బ్రహ్మచారిణి రూపంలో పూజలు జరిపారు.

బ్రహ్మచారిణిగా సరస్వతీ అమ్మవారు



భైంసా: నిర్మల్ జిల్లా బాసరలో దేవీనవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు సోమవారం సరస్వతీ అమ్మవారు కుడిచేతిలో జపమాల, ఎడమ చేతిలో కమండలంతో బ్రహ్మచారిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

తెలంగాణ

రూ.5.79 కోట్ల నగదు.. 16.6 కేజీల పసిడి

వాహనాల తనిఖీల్లో భారీగా పట్టుబడుతున్న సొమ్ము

మియాపూర్/బన్సీలాల్ పేట్/కరీంనగర్ క్రైం/మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు జరుపుతున్న వాహనాల తనిఖీల్లో భారీగా బంగారం, నగదు పట్టుబడుతోంది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జరిపిన సోదాల్లో సుమారు రూ.5.79 కోట్ల నగదు, 16.646 కేజీల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంజీరా రోడ్డులో ఉన్న మై హోమ్ జ్యువెల్ ఎదురుగా అనుమానాస్పదంగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆపి పోలీసులు తనిఖీ చేశారు. ఆ వాహనంలో బషీర్‌బాగ్‌కు చెందిన కిలుముళ్ల అనిరుధ్ (23), బాలిరాం అక్కే మారుతి, మూసాపేట్‌కు చెందిన శంకర్‌దుబే ఆరు బాక్సుల్లో బంగారం, వెండి ఆభరణాలను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వారి వద్ద సంబంధిత పత్రాలు లేకపోవడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వాహనంలో ఉన్న 16.64 కేజీల బంగారు ఆభరణాలు, 23.58 కేజీల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు మియాపూర్ సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మరో ఘటనలో మియాపూర్‌లోని ఆల్విన్ ఎక్స్ రోడ్డు వద్ద బాచుపల్లికి చెందిన రాజుకుమార్ ద్విచక్రవాహనాన్ని తనిఖీచేయగా అతని వద్ద రూ.14,93,100 నగదు ఉన్నట్లు గుర్తించారు. సరైన పత్రాలు అతని వద్ద లేకపోవడంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు.

కవాడిగూడ, కరీంనగర్‌లో..

కవాడిగూడలో గాంధీనగర్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన వాహనాల తనిఖీల్లో 2.09 కోట్ల నగదు పట్టుబడింది. గాంధీనగర్ పోలీ సు స్టేషన్ పరిధిలోని కవాడిగూడ ఎన్‌టీపీసీ వద్ద కియా సెల్టోస్ కారు, సుజుకీ యాక్సెస్ ద్విచక్రవాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఈ నగదును సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రవి చెప్పారు. కరీంనగర్ టూ టౌన్ స్టేషన్ పరిధిలో తనిఖీలు చేస్తుండగా రైటర్ సేఫ్ గార్డ్ కంపెనీకి చెందిన వాహనంలో రూ.2,36, 48,494 అక్రమ నగదును జప్తు చేసినట్లు కరీంనగర్ సీపీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిపిన తనిఖీల్లో పోలీ సులు రూ.1.19 కోట్ల నగదును సీజ్ చేశారు.



తనిఖీల్లో పట్టుబడ్డ బంగారం



సీజ్ చేసిన నగదు వివరాలు వెల్లడిస్తున్న కరీంనగర్ సీపీ సుబ్బారాయుడు



ముంబై-గోవా హైవేపై కుప్పకూలిన బ్రిడ్జి

ముంబై: మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా, చిప్లూన్ నగరంలో ముంబై–గోవా హైవేపై ఒక భాగంలో నిర్మిస్తున్న ఓవర్‌బ్రిడ్జి గిర్డర్ సోమవారం కుప్పకూలింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. తెల్లవారుజామున ఎత్తైన ప్రదేశంలో ఉంచినప్పుడే గిర్డర్ పగుళ్లు ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతంల పోలీసులను మోహరించారు. మధ్యాహ్నం 2:45 గంటల ప్రాంతంలో గిర్డర్ శిథిలావస్థకు చేరుకుని 30 మీటర్ల మేర కింద పడిపోయింది.

ఈతకు వెళ్లి ఇద్దరు పిల్లలు మృతి

భివండీ: ఈతకు వెళ్లిన ఇద్దరు మైనర్లు మృతి చెందిన ఘటన థాణే జిల్లా భివండీలో జరిగింది. అందిన వివరాల మేరకు భివండీ దామన్‌గావ్‌లోని జలాశయంలో ఆదివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. భోజనం తర్వాత కొందరు పిల్లలు ఈతకు వెళ్లారు. వారిలో 12 ఏళ్ల బాలికతోపాటు మరో ఏడేళ్ల బాలుడు నీటిలో మునిగిపోయారు. తోటి పిల్లలు కేకలు వేయడంతో అక్కడి నుంచి వెళ్లే కొందరు పిల్లలను బయటికి తీశారు. వారిని ఆసుపత్రికి తరలించగా ఇద్దరు మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు.

భివండీలో ఘనంగా పూలపండుగ..



చందన్‌బాగ్ లో బతుకమ్మ సంబరాలు



పద్మనగర్‌లోని అఖిల పద్మశాలి సమాజం హాల్లో బతుకమ్మ సంబరాలు

షోలాపూర్‌లో అగ్నిప్రమాదం



షోలాపూర్: పట్టణంలోని రంగు భవన్ చర్చి ఎదురుగా ఉన్న షాపుల్లో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పలు షాపులు దగ్ధం అయ్యాయి. రంగు భవన్ నుంచి సాతువస్తా వైపు వెళ్లే రహదారి కుడివైపున ఫర్నిచర్ షాపులు, ద్విచక్ర వాహనాల సర్వీసింగ్ సెంటర్, రిపేర్ షాపులు ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్క షాపులో అంటుకున్న మంటలు వెనువెంటనే పక్కనే ఉన్న నగల షాపులకు సైతం విస్తరించాయి. మంటలు ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మూడు ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను ఆర్పివేశాయి. మంటల కారణంగా ఐదు దుకాణదారులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది.

ఈసీఐఎల్ డైరెక్టర్ పర్సనల్‌గా అనురాగ్ మాల్వీయా

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) డైరెక్టర్ పర్సనల్‌గా అనురాగ్ మాల్వీయా బాధ్యతలు స్వీకరించినట్లు సంస్థ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. హెచ్‌ఆర్ ప్రొఫెషనల్‌గా 31 సంవత్సరాల అనుభవం కలిగిన మాల్వీయా.. పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో సేవలందించినట్లు వెల్లడించారు. భోపాల్ యూనివర్సిటీలో ఎంబీఏలో గోల్డ్ మెడల్ సాధించి అక్కడే తన పీజీ పూర్తి చేశారు. ఈసీఐఎల్ బోర్డు సభ్యుడిగా కొనసాగనున్న మాల్వీయా సిబ్బంది విధి, విధానాలు నిర్వహణ బాధ్యతలను చూసుకోనున్నట్లు తెలిపారు.



ప్యాసింజర్ రైలుకు మంటలు

ప్రయాణికులు సురక్షితం.. అహ్మద్‌నగర్ జిల్లాలో ఘటన

ముంబై: అహ్మద్‌నగర్ జిల్లాలోని నారాయణదో స్టేషన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో డీజిల్–ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (డీఈఎంయూ) ప్యాసింజర్ రైలులోని ఐదు కోచ్‌లు దగ్ధమయ్యాయి. రైలు బీడ్ జిల్లాలోని అష్టి స్టేషన్ నుంచి అహ్మద్‌నగర్‌కు వెళుతుండగా అగ్ని ప్రమాదం సంభవించింది. మధ్యాహ్నం 3 గంటలకు మంటలు ప్రారంభమయ్యాయని, మంటలు వ్యాపించకముందే ప్రయాణికులంతా రైలు నుంచి సురక్షితంగా దిగిపోయారని సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సీపీఆర్వో) డాక్టర్ శివరాజ్ మనస్పురే తెలిపారు. మంటలు గార్డ్ సైడ్ బ్రేక్ వ్యాన్‌తోపాటు దాని పక్కనే ఉన్న నాలుగు కోచ్‌లను చుట్టుముట్టాయని వెల్లడించారు. అహ్మద్‌నగర్ నుంచి అగ్నిమాపక వాహనాలను వెంటనే పిలిపించామని, సాయంత్రం 4.10 గంటలకు మంటలను ఆర్పివేశామని శివరాజ్ తెలిపారు.



ఆనందంగా జీవించడం అనేది
ఆత్మ యొక్క అంతర్గత శక్తి.
– మార్కస్ అరీలియస్

సాక్షి
మంగళవారం, 17 అక్టోబర్ 2023

మానవత్వం మరిస్తే...

పది రోజులైంది. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై పాలస్తీనా ప్రాంత తీవ్రవాద గ్రూపు హమాస్ జరిపిన దాడి తాలూకు ప్రకంపనలు ఆగేలా లేవు. హమాస్‌ను తుదముట్టిస్తామంటూ గాజాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడి అంతకంతకూ తీవ్రతరమవుతోంది. భూతల దాడులకు దిగడానికి సర్వసన్నద్ధమైంది. ఇప్పటికే గాజాను ఈ యూదు దేశం అష్టదిగ్బంధనం చేయడంతో అక్కడి పాలెస్తీనియన్లకు తినడానికి తిండి కాదు కదా తాగడానికి నీళ్ళయినా లేని పరిస్థితి. ఆగని యుద్ధంలో ఇప్పటికి 2600 మందికి పైగా పాలస్తీనియన్లు, ఇరువైపులా కలిపి 4 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పది వేల మందికి పైగా గాయపడ్డారు. పిల్లలు, స్త్రీలు, వృద్ధులనే తేడా లేకుండా, బాధితుల కనీసపాటి అవసరాలకు కూడా అక్కర లేకుండా అంతర్జాతీయ మానవతావాద చట్టానికి (ఐహెచ్ఎల్)కి నీళ్ళొది లేస్తున్న ఇజ్రాయెల్ – హమాస్ మధ్య యుద్ధం చివరికి మానవ సంక్షోభంగా మారిపోయే సూచనలున్నాయి. మానవతా దృక్పథం అవసరమనే అంతర్జాతీయ సమాజంలో ఇది ఆందోళన రేపుతోంది.

పాలస్తీనా జనాభా 23 లక్షలైతే, 11 లక్షల మంది పైగా పౌరులు ఇజ్రాయెల్ హెచ్చరికలతో ఇప్పటికే ఉత్తర గాజా విడిచివెళ్ళారు. అంటే సగం మంది నిరాశ్రయులయ్యారు. గాజా నుంచి ఈజిప్టులోకి వెళ్ళేందుకు రాఫా మార్గం తెరిచేందుకు దౌత్య యత్నాలు జరుగుతుండడంతో మరింతమంది అటూ వెళ్ళవచ్చు. యుద్ధం సృష్టించిన ఈ బీభత్సంలో సొంత గడ్డ విడిచివెళ్ళాల్సిన దైన్యంలో పడిన వీరి జీవితకాలపు దుఃఖాన్ని ఎవరు తీర్చగలరు? ఇజ్రాయెల్ భూతల దాడులు చేస్తే, ఇప్పటికే తిండి, నీళ్ళు, విద్యుత్తు, ఇంధనం లేక అల్లాడుతున్న ప్రాంతంపై అది అమానుష దాడి. హమాస్ మాటేమో కానీ, అన్నెం పున్నెం ఎరుగనివారు బలైపోతారు. ఐరాస ప్రతినిధి అన్నట్టు అది సామూహిక ఉరిశిక్ష వేయడమే! 'ఆరుబయలు కారాగారం'గా పేరుబడ్డ గాజా 'ఆరు బయలు శవాగారం' అవుతుంది.

ఇజ్రాయెల్‌పై హమాస్ దాడినీ, వందలమంది మరణానికి కారణమైన తీరునూ, అమాయకులను బందీలుగా తీసుకెళ్ళిన వైనాన్నీ మానవతావాదులు ఎవరూ సమర్థించరు. కానీ, ఇప్పుడు ఇజ్రాయెల్ చేస్తున్నదేమిటి? ఆత్మరక్షణ ధోరణిని అతిక్రమించి, గాజాను తుడిచిపెట్టేయాలనీ, పాలస్తీనాను ఉనికిలో లేకుండా చేయాలనీ తెగబడుతున్న తీరును ఏమనాలి? ఒకప్పుడు సురక్షితంగా బతకడానికి తమకంటూ ఓ దేశం కావాలని మొదలైన యూదులు నాటి సువిశాల ఒట్టోమన్ సామ్రాజ్యంలో పాలస్తీనా ప్రావిన్స్‌లో భూములు కొనడంతో ఆరంభించారు. మొదటి ప్రపంచ యుద్ధానంతర పరిణామాల్లో చివరకు పాలస్తీనా విభజనకూ, 1948లో స్వతంత్ర ఇజ్రాయెల్ ఏర్పాటుకూ కారణమయ్యారు. ఆనాడు పాలస్తీనాకు యూదులు వలసొస్తే, ఈనాడు పాలస్తీనియన్లు వలస పోతున్న పరిస్థితి. రావణకాష్ఠంలా సాగుతున్న పాలస్తీనా అంశంలో ఇరుపక్షాల తప్పులూ కొల్లలు.

ఇజ్రాయెల్ – పాలస్తీనా అంశాన్ని ముస్లిమ్ – యూదు సమస్యగా చిత్రీకరించి, అగ్నికి ఆజ్యం పోస్తున్న ఇరుపక్షాల దేశాలకూ చివరకు స్వప్రయోజనాలే కీలకం. పెదవులపై సానుభూతి, ఆయుధాలు అందించి యుద్ధాన్ని పెద్దది చేయడంతో పెరిగే మంటలు ప్రజలకు పనికిరావు. గాజా కేవలం 41 కి.మీ.ల పొడవాటి చిన్న భూభాగమే కావచ్చు. దాన్ని కైవసం చేసుకోవాలన్న ఇజ్రాయెల్ ఆకాంక్ష నెరవేరడం సులభమేమీ కాదు. గతంలో 2009లో 15 రోజులు, 2014లో 19 రోజులు గాజాపై ఇజ్రాయెల్ దండయాత్ర చేయకపోలేదు. అన్నిటికీ యుద్ధం పరిష్కారమైతే అనేక సమస్యలు ఏనాడో పరిష్కరమయ్యేవి. పాలస్తీనియన్లలో 44 శాతం మంది 2006లో తీవ్రవాద హమాస్‌కు ఓటు వేసి తప్పు చేశారు. దానికి ఇప్పుడు మూల్యం చెల్లిస్తున్నారు. అన్నీ కోల్పోయి, భవితపై ఆశ లేని దుఃస్థితికి వచ్చారు. ప్రాణాలు అరచేత పెట్టుకొని పారిపోదామన్నా అభ్యంతరం చెబుతూ, అమాయకులైన వారినే హమాస్ అడ్డం పెట్టుకొంటున్న వార్తలు విచారకరం.

ఈ పరిస్థితుల్లో ఈ యుద్ధం తక్షణం ఆగేందుకు ప్రపంచ దేశాలన్నీ ప్రయత్నించాలి. బాధితులకు తక్షణ సాయం, శాంతిస్థాపన తక్షణ కర్తవ్యం కావాలి. దురదృష్టవశాత్తూ ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా చీలిపోయి మాట్లాడుతున్నాయి. అయితే, హమాస్ దాడితో వచ్చిన సానుభూతి క్షీణిస్తూ, విమర్శలు పెరగడాన్ని ఇజ్రాయెల్ సైతం గమనిస్తోంది. గాజాకు అత్యవసర సాయం అందేందుకు దోవ ఇస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతెన్యాహూ అన్నట్టు తాజా వార్త. అలాగే, దాడులు ఆపేస్తే ఇజ్రాయెలీ బందీలను హమాస్ విడిచిపెడతానందని ఇరాన్ మాట. హమాస్ నుంచి ఆ మేరకు అధికారిక ప్రకటన రాలేదు కానీ, యుద్ధాన్ని ఆపే అలాంటి కనీస ప్రయత్నాలు అత్యవసరం.

మన సంగతికొస్తే, మునుపటితో పోలిస్తే భారత ఆర్థిక సౌభాగ్యానికీ, జాతీయ భద్రతకూ ఇటీవల అతి కీలకమైన మధ్యప్రాచ్యంపై దేశంలో అధికార, ప్రతిపక్షాలు దేశీయంగా హిందూ, ముస్లిమ్ ఓటు బ్యాంక్ రాజకీయాలు చేయడం మానాలి. ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకొని, క్రమం తప్పకుండా సమావేశమై, మారుతున్న పరిస్థితుల్నీ, మన దేశం అనుసరిస్తున్న వ్యూహాన్నీ ఎరుకపరచాలి. సంక్షోభం ముదురుతున్న వేళ సమతూకమే భారత మంత్రం. యుద్ధంలో మానవీయ చట్టాలను గౌరవించాల్సిందిగా ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేయాలి. హమాస్ దుశ్చర్యకు గాజాలో అమాయకులపై ప్రతీకారం అర్థరహితమని నచ్చజెప్పాలి. అలాగే, హమాస్ వద్ద బందీలైన ఇజ్రాయెలీలను వెంటనే విడిపించేందుకు అరబ్ మిత్ర దేశాలు పాటుపడేలా కృషి చేయాలి. అటు ఇజ్రాయెల్‌తోనూ, ఇటు ఇరాన్, ఖతార్ మొదలు సౌదీ అరేబియా, ఈజిప్ట్ దాకా మధ్యప్రాచ్యంలోని కీలక దేశాలతోనూ ఉన్న సత్సంబంధాల రీత్యా భారత్ ఈ యుద్ధానికి తెరపడేలా చూడాలి. మధ్యప్రాచ్యాన్ని కమ్ముకొస్తున్న మానవ సంక్షోభాన్ని నివారించాలి.

నైతిక సందిగ్ధతల అంతస్సంఘర్షణ

కామెంట్



కరణ్ థాపర్

సరైన ఫలితాన్ని సాధించడానికి సరైనవి కాని మార్గాలను అనుసరించడం ఆమోదయోగ్యమేనా? ''అర్థవంతమైన దానిని సాధించడం కోసం మనం నమ్మిన సిద్ధాంతాలు, మనం పాటించే విలువలు, మనం అనుసరించే ప్రమాణాలలో కొన్నింటిని త్యాగం చెయ్యడం కూడా గౌరవనీయమే'' అనే వాదన రాజకీయాలలో ఉంది. ఒక శక్తిమంతమైన నిర్ణయం తీసుకోడానికి ప్రధాని తన కార్యాలయానికి ఉన్న అపారమైన అధికారాలను ఎలాంటి నైతికపరమైన సంకోచాలూ లేకుండా ఉపయోగించడం ఆత్మ సమ్మతం అవుతుందా? కాలమిస్ట్ ఆకార్ పటేల్ తొలి నవల 'ఆఫ్టర్ మెస్సయ'... గొప్ప ఉద్విగ్నతకు లోను చేసే సాంప్రదాయిక రాజకీయ రచనల మాదిరిగా కాకుండా... రాజకీయాల సహజ స్వభావాన్ని, గొప్ప విజయాలు తరచు సిగ్గుచేటు సర్దుబాట్ల నుంచి సంప్రాప్తించడంలోని వైరుధ్యాన్ని ప్రతిబింబిస్తోంది.

నిజం చెప్పొద్దూ... తనొక నవల రాశానని ఆకార్ పటేల్ నాతో అన్నప్పుడు నేను ఆశ్చర్యచకితుణ్ణే అయ్యాను. పటేల్‌ను ఒక దృష్టికోణం గల పత్రికా రచయితగా, మోదీ ప్రభుత్వాన్ని తూర్పారబట్టే ఒక గట్టి రాజకీయ వ్యాసకర్తగా, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు ధీశాలి అయిన ఛైర్మన్‌గానే నేను ఎరుగుదును. అంతే తప్ప, కాల్పనికత అయన అజ్ఞాత బలం అయి ఉంటుందని నేను ఏ కోశానా అనుకోలేదు.

ఇంతేనా నాకు పటేల్ గురించి తెలిసింది! కథనానికి లోతైన నైతిక కోణాన్ని అందించే అంతస్సంఘర్షణతో పాత్రలను సృష్టించగల సామర్థ్యంతో పాటుగా ఆయన ఊహాశక్తిలోని ప్రతిభను, కదలనివ్వని కథన పటిమను ఆయన తాజా రచన 'ఆఫ్టర్ మెస్సయ' బహిర్గతం చేస్తోంది. గొప్ప ఉద్విగ్నతకు లోను చేసే సాంప్రదాయిక రాజకీయ రచనల మాదిరిగా కాకుండా ఈ పుస్తకం రాజకీయాల సహజ స్వభావాన్ని, గొప్ప విజయాలు తరచు సిగ్గుచేటు సర్దుబాట్ల నుంచి సంప్రాప్తించడంలోని వైరుధ్యాన్ని ప్రతిబింబిస్తోంది.

ఈ నవలొక వాస్తవ ఘటనల అల్లికగా ప్రారంభం అవుతుంది. నిజమైన వ్యక్తులు ఉంటారు. అయితే వారికి పెట్టుడు పేర్లు ఉంటాయి. ప్రధాన మంత్రిని 'ది బిగ్ మ్యాన్' అంటారు పటేల్. పుస్తకంలో ఎక్కడా ప్రధాని పేరు కనిపించదు. కానీ ఆ బిగ్ మ్యాన్ మాట్లాడేటప్పుడు ''ప్రజాస్వామ్యం యొక్క భాష, చిహ్నాలు... పాలకుడు తన గురించి తను మూడో వ్యక్తిగా వ్యక్తం చేసుకుంటున్న ప్రస్తావనలతో కలిసి ఉంటాయి.'' అది మొదటి గుర్తు.

ఆ బిగ్ మ్యాన్ ప్రారంభోత్సవాలను కూడా ఇష్టపడతారు కనుక, ''బిగ్ మ్యాన్ అధ్యక్షత వహించేందుకు వీలైనంతగా అత్యుత్తమమైన ఒక కార్యక్రమాన్ని లేదా వేడుకను అందించడంపై మంత్రిత్వ శాఖలు దృష్టి పెడతాయి.'' అది రెండవ గుర్తు. ఇక మూడోది... ''రాజకీయ వ్యతిరేకత. అదేదో అంతర్గత శత్రువైనట్లుగా దానిపై హింసాత్మక దాడులు జరుగుతుంటాయి. ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు ఆ శత్రువును చావనివ్వని, బతకనివ్వని వాస్తవ రాజకీయాలకు అతీతమైన ఒక నిరంతర స్థితిలో ఉంచడంలో పూర్తిగా నిమగ్నం అయి ఉంటాయి''.

ఇప్పుడీ పుస్తకంలోని అబ్బుర పరుస్తూ చదివించే సంతోషదాయకమైన సృజనాత్మక ముగింపు గురించి తప్ప మరింకేదీ బహిర్గతం చేయడం నాకు ఇష్టం లేదు. బదులుగా ఇందులో పటేల్ కథనానికి పునాదిగా జరిగిన శక్తిమంతమైన రాజకీయ... నిజానికి నైతికపరమైన చర్చ గురించి మీకు చెబుతాను.



'మహారాణి' వెబ్ సిరీస్‌లో హ్యూమా ఖురేషీ: ప్రతీకాత్మక చిత్రం



పటేల్ పుస్తకంలో బిగ్ మ్యాన్ చాలా త్వరగా చనిపోతాడు. ఆయన తర్వాత మీరా అనే మహిళ అధికారంలోకి వస్తారు. 'లాయర్స్ కలెక్టివ్' అనే ఎన్జీవోకు పని చేస్తుంటారు మీరా. ఆమె అవివాహిత. ఒంటరి తల్లి. ఆమె కుమార్తె జైల్లో ఉంటుంది. బిగ్ మ్యాన్, ఆయన పార్టీ అనుసరించిన రాజకీయ విధానాలపై మీరాకు తృణీకారభావం ఉంటుంది. అనిష్టంగానే ప్రధాని అవుతారు. అయ్యాక మాత్రం గతంలోని క్రూరమైన చట్టాలను రద్దు చేయడం కోసం అపారమైన తన కార్యాలయ అధికారాలను ఉపయోగించు కోవాలనుకుంటారు. పేదల ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించే ప్రయత్నంగా ప్రభుత్వాన్ని బాధ్యతాయుతంగా, జవాబుదారీగా మార్చేయబోతారు.

అయితే సమస్య ఎక్కడొస్తుందంటే ఆమె తన కార్యాలయ అపరిమిత అధికారాలను అభ్యంతరం, అనైతికం అయిన మార్గాలలో ఉపయోగించవలసి రావడం. ఇక్కడ జనించే ప్రశ్న: సరైన ఫలితాన్ని సాధించడానికి సరైనవి కాని మార్గాలను అనుసరించడం ఆమోదయోగ్యమేనా? అన్నది.

ఆమె ముఖ్య సలహాదారు... ఆ సలహాదారుకు పేరేం ఉండదు... 'హౌస్ మేనేజర్' అంతే. ఆ మేనేజర్‌కు ఇది ఆమోదయోగ్యమే అనిపిస్తుంది. ''అర్థవంతమైన దానిని సాధించడం కోసం మీరు నమ్మిన సిద్ధాంతాలు, మీరు పాటించే విలువలు, మీరు అనుసరించే ప్రమాణాలలో కొన్నింటిని త్యాగం చెయ్యడం గౌరవనీయం, ప్రశంసనీయం అయిన సంగతే'' అంటారు హౌస్ మేనేజర్. కానీ అందువల్ల ప్రయోజనం పొందగలిగిన సగటు ప్రజలు దానిని అంగీకరించరు. మీరా వారిని సంప్రదించినప్పుడు ఒక వృద్ధురాలు... తరచు నిరాకరణకు గురవుతుండే, అదే సమయంలో సర్వకాలాలకు ఆమోదయోగ్యమైనదిగా ఉండే యుగాల వివేకాన్ని వ్యక్తపరుస్తుంది. ''చేయవలసిన సరైనది ఒకే ఒకటి ఉంటుంది. అదే సరైనది'' అని అంటుంది.

ఈ విధంగా పటేల్ పుస్తకం ముగింపునకు చేరుకుంటున్న కొద్దీ భారత రాజకీయాల స్వభావం గురించి; ఒకవైపు ఎత్తుగడలూ వ్యూహాలకూ, మరోవైపు సిద్ధాంతాలూ నైతికతలకూ మధ్య జరుగుతుండే ఘర్షణలతో ఒక శక్తిమంతమైన కథగా అభివృద్ధి చెందుతుంది. ప్రధాని కార్యాలయానికి ఉండే అపారమైన అధికారాలను నైతికపరమైన సంకోచాలు లేకుండా, అనుకున్న దానిని సాధించేందుకు మీరా ఏకచిత్తంతో దృష్టి సారించినందున పుస్తకంలోని ఈ భాగం కేవలం చదివించేలా మాత్రమే కాదు, ఒక వెల్లడింపుగానూ ఉంటుంది. మీరా తనలోని సందేహాలను అణిచివేస్తారు. అయితే ఆశించిన ఫలితాన్ని సాధించడానికి ఇదే ఏకైకమార్గం అని హౌస్ మేనేజర్ తనకు నచ్చజెప్పేందుకు ఆమె అనుమతిస్తారు. అందువల్లనే ముగింపులో ఫలితం అనేది ఫలితం కోసం అనుసరించిన మార్గాలపై విజయం సాధించడం కనిపిస్తుంది. అయితే చర్చ మాత్రం ముగింపు దశకు చేరకనే ఉండిపోతుంది. అది ఆమె మనస్సాక్షిని కృంగదీస్తూ ఉంటుంది.

నిజంగా రాజకీయాల్లో తరచు ఇలా జరుగుతుంటుందన్నది వాస్తవం. పటేల్ 'బిగ్ మ్యాన్'పై ఇదేమీ ప్రభావం చూపకపోవచ్చు కానీ ఇతర రాజకీయ నాయకులు తరచుగా ఇబ్బంది పడుతుంటారు. కొన్నిసార్లయితే దానివల్ల నలిగిపోతుంటారు కూడా. భారతదేశంలోనే కాదు, చాలా ప్రజాస్వామ్య దేశాలలో ఇలాగే జరుగుతుంటుంది.

అందుకే రాజకీయాల సారాంశం అన్నది రాజకీయపరమైన దాని కన్నా చాలా ఎక్కువైనది. ఎందుకంటే అది నిర్ణయాలకు, ఎంపికలకు, అంతిమంగా సైద్ధాంతికతల్ని మించిన అంశాలకు సైతం సంబంధించినది. అలాగే నైతికపరమైన వాటికి కూడా. పటేల్ ఆ సంగతిని స్పష్టంగా అర్థం చేసుకున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వియన్నాకు సీబీఐ



నూరేళ్ల 'ఇంటర్‌పోల్'... వచ్చే నెలలో వియన్నాలో తన 91వ సాధారణ సభను నిర్వహించబోతోంది. ఆ సందర్భంగా మన సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్... మెహుల్ చోక్సీ రెడ్ నోటీస్‌ను రద్దు చేయడాన్ని ప్రశ్నించబోతున్నారు. అలాగే విదేశీ గడ్డపై నుంచి భారత్‌లో కల్లోలం రేపాలని ప్రయత్నిస్తున్న ఖలిస్థానీల ప్రస్తావన కూడా తేబోతున్నారు.

– నీరజ్ చౌహాన్, పత్రికా రచయిత

దోష విముక్తి!



2006 నిఠారీ కేసులో దోషులైన సురేంద్ర కోలీ, మోనీందర్ సింగ్ పంథేర్‌ల మరణశిక్షను అలహాబాద్ హైకోర్టు రద్దు చేయడం దిగ్భ్రమను కలిగించింది. చిన్నారులను అపహరించి, లైంగికంగా వేధించి, హత్య చేసి, వారి నిశ్చలన శరీరాలతో అమానుషంగా ప్రవర్తించారన్న అభియోగాన్ని వారే స్వయంగా ఒప్పుకున్నప్పటికీ వారిని నిర్దోషులుగా బయట పడేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

– రేణు. కె., సోషల్ యాక్టివిస్ట్

సంకీర్ణం ముప్పు!



పోలండ్‌కు చెడ్డ రోజు. అధికార కన్జర్వేటివ్ పార్టీ అత్యధిక ఓట్లను సాధించినట్లు కనిపిస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చని ఎగ్జిట్ పోల్స్ సూచిస్తున్నాయి. అదే జరిగితే ఇప్పటి వరకు శాంతియుతంగా ఉన్న దేశానికి వామపక్ష ఉగ్రవాద భావజాలం ఉన్న వ్యక్తుల వల్ల ముప్పు పొంచి ఉన్నట్లే!

– నచిన్ జోస్, పొలిటికల్ ఎనలిస్ట్

జీవాహారం



'ప్రపంచ ఆహార దినం' (16 అక్టోబర్) మన జీవితాల్లో నీటి ప్రాముఖ్యాన్ని మనకు గుర్తు చేయాలి. 'నీరు జీవం.. నీరు ఆహారం' ఈ ఏడాది థీమ్ కనుక జీవం, ఆహారం లేకుండా మన ఒక్కర్ని కూడా వదిలిపెట్టి పోకూడదని సంకల్పం చెప్పుకుందాం. ఆకలి లేని ప్రపంచం కోసం కలిసి పని చేద్దాం.

– విశ్వజిత్ రాణే, గోవా ఆరోగ్య మంత్రి

కడుపు కోత



ఇజ్రాయిల్ వైమానిక దాడిలో తన కొడుకును కోల్పోయిన ఒక తల్లి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని తన కొడుకును చూడాలని రెండు చేతులు జోడించి అక్కడి వారిని అభ్యర్థించినప్పుడు ఆసుపత్రి నర్సు దూరం నుంచి ఆమెకు ఇచ్చిన సంకేతం ఏమిటంటే... ఆమె కుమారుడి కుడి సగాన్ని మాత్రమే చూపించగలం అని!

– కరిష్మా కౌర్, పొలిటికల్ థింకర్



యుద్ధం

ఇద్దరు
ఇద్దరి చేతుల్లోనూ మారణాయుధాలు

ఆయుధం పేలనంతవరకు
ఇద్దరూ ఇద్దరుగానే వున్నారు

ఒక చేతిలోని ఆయుధం పేలగానే
మరో చేయి బదులిచ్చింది

తుపాకులు బాంబులు అనేమిటి
వినాశనానికి వేయి రూపాలు

ఇరువైపులా హాహాకారాలు ఆర్తనాదాలు
ఏరులై పారిన కన్నీళ్లు
రక్తపు టేరులు శవాల కుప్పలు

విజయం నాదంటే నాదన్నారు
చేతులెత్తి విర్రవీగారు
కాళ్ళకింది భూమి
కదిలిపోయిన సోయి లేదు

దూరంగా ఆయుధాల వ్యాపారి
హర్షామోదాలతో చప్పట్లు కొడుతున్నాడు
మాటల బేహారి శాంతి ప్రవచనం చెబుతున్నాడు

సామాన్య జనమే
నెర్రెలు బారిన నేలకేసీ ఆకాశంకేసీ చూస్తూ
ప్రార్థనలు చేస్తున్నారు

– వారాల ఆనంద్

ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటారు?

విశ్లేషణ



దానీ

హైదరాబాద్‌లో గ్రూప్–2 విద్యార్థిని ప్రవల్లిక మరణం ఆత్మహత్యల అంశాన్ని మరోసారి చర్చకు తెచ్చింది. పరీక్షల్ని ప్రభుత్వం వాయిదా వేయడం వల్లనే ఆమె నిరాశకు గురై చనిపోయిందని కొన్ని విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ఆమె ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణం అని సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు మీడియాకు వివరించారు. పోలీసుల కథనం ప్రకారం శివరామ్ అనే మిత్రునితో ప్రవల్లిక కొన్నాళ్ళుగా ప్రేమలో వుంది. అతను మరో అమ్మాయితో పెళ్ళికి సిద్ధమయ్యి, నిశ్చితార్థం చేసుకున్నాడు. అది ఆమె మనసును గాయపరిచింది.

మనుషులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటారూ? అనే ప్రశ్న ఇలాంటి సందర్భాల్లో ముందుకు వస్తుంటుంది. ప్రతి ఆత్మహత్యకూ ఏదో ఒక కారణం వుంటుంది. అలా అనుకుంటే ప్రతి ఆత్మహత్య ప్రత్యేక మైనదే అవుతుంది. వ్యక్తిగతం అవుతుంది. అప్పుడు ఆత్మహత్యలను సూత్రీకరించడం కుదరదు. చర్చించడమూ కుదరదు. ఆత్మహత్యలకు సమాజమే కారణం అని నిర్ధారించినవాడు ఫ్రెంచ్ సమాజ శాస్త్రవేత్త ఎమిలి డర్ఖేమ్ (1858 – 1917). సామాజిక సంక్షోభం కారణంగానే మనుషులు ఆత్మహత్యలు చేసుకుంటారని నిర్ధారిస్తూ 1897లో ఆయన 'లా సూసైడ్' శీర్షికతో ఓ ఉద్గ్రంథాన్ని రాశాడు.

మనుషులు ఏం కోరుకుంటారూ? అని అడిగితే ఒక్కొక్కరూ ఒక్కో సమాధానం చెపుతారు. భారీ ఆదాయం వచ్చే ఉద్యోగం, విలాసవంతమైన ఇల్లు, అందమైన భార్య, మొనగాడైన భర్త, రాజ్యసభ సీటు, కేబినెట్లో స్థానం... ఇలా సాగుతుంది కోరికల జాబితా. వీటన్నింటినీ డర్ఖేమ్ కొట్టి పడేస్తాడు. ఈ కోరికలన్నీ పైకి కనిపించే అంశాలు; సారాంశంలో ప్రతి మనిషీ సంఘీభావాన్ని కోరుకుంటాడని చెబుతాడు. అదే మనిషి ప్రాథమిక కోరిక. సమాజంలో సంఘీభావం ఏ స్థాయిలో వుందో కొలవడానికి డర్ఖేమ్ ఒక పరికరాన్ని కనిపెట్టాడు. దానిపేరే 'ఆత్మహత్య'. సంఘీభావానికీ ఆత్మహత్యలకూ విలోమానుపాత సంబంధం వుంటుందని ఆయన తేల్చాడు. ఒక సమాజంలో ఆత్మహత్యల రేటు ఎక్కువగా వుంటే అక్కడ సంఘీభావం తక్కువగా వున్నట్టు. ఒక సమాజంలో ఆత్మహత్యల రేటు తక్కువగా వుంటే ఆ సమాజంలో సంఘీభావం ఎక్కువగా వున్నట్టు భావించాలన్నాడు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాదీ దేశాల వారీగా ఆత్మహత్యల నివేదికను ప్రకటిస్తూ వుంటుంది. వివిధ దేశాల్లో ఏడాదికి లక్ష మందికి 10 నుండి 40 మంది వరకు ఆత్మహత్యలు చేసుకుంటారు. అయితే ఈ గణాంకాలను కచ్చితమైనవని అనుకోలేము. అనేక కుటుంబాలు ఆత్మహత్యను సామాజిక అవమానంగా భావిస్తాయి. జీవిత బీమా తదితర టెక్నికల్ కారణాల వల్లనూ కొందరు ఆత్మహత్యల్ని దాచిపెడతారు. కొన్ని దేశాల్లో ఆత్మహత్య అనేది శిక్షించదగ్గ నేరం. ఇన్ని కారణాల వల్ల ఆత్మహత్యల గురించి కచ్చితమైన నివేదికలు రావు.



అయితే, కొన్ని నిర్ధారణలు చేయడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు పనికి వస్తాయి. మహిళల్లో ఎక్కువ శాతం ఆత్మహత్య చేసుకోవాలని అనుకుంటారు; కానీ పురుషులు ఎక్కువ శాతం ఆత్మహత్యలు చేసుకుంటారు. చదువుకోనివారికన్నా చదువుకున్నవారు, కుటుంబ వ్యవస్థలో వున్నవారికన్నా కుటుంబ వ్యవస్థలో లేనివారు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటారట!

జంతువులు ఒంటరిగా జీవించగలవుగానీ మనుషులు ఒంటరిగా జీవించలేరు. యుద్ధ సమయాల్లో, ఉద్యమాల సందర్భాల్లో మనుషుల మధ్య సంఘీభావం వున్నత స్థాయిలో వుంటుంది. అప్పుడు ఆ సమాజాల్లో ఆత్మహత్యల రేటు చాలా తక్కువగా వుంటుంది. ఆ దశ దాటిపోగానే ఆ స్థాయి సంఘీభావాన్ని పొందలేక గొప్ప నైరాశ్యానికి గురయ్యి చనిపోవాలనుకుంటారు.

ఎమిలి డర్ఖేమ్ దృష్టిలో ఆత్మహత్యలకు రెండే కారణాలుంటాయి. మొదటిది అనుబంధాలు; రెండోది ఆంక్షలు. అనుబంధాల వల్ల రెండు రకాలు ఆత్మహత్యలు, ఆంక్షల వల్ల మరో రెండు రకాల ఆత్మహత్యలు జరుగుతాయంటాడు. మొత్తం ఆత్మహత్యలు నాలుగు రకాలని ఆయన వర్గీకరించాడు. మనుషుల మీద ప్రేమాభిమానాలు చాలా ఎక్కువయినపుడు వారి కోసం కొందరు స్వచ్ఛందంగా చనిపోవడానికి సిద్ధపడతారు. చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, అల్లూరి శ్రీరామరాజు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చనిపోయినవారూ, నక్సలైట్ ఉద్యమ అమరులూ ఈ కోవలోనికి వస్తారు. మనం ఇలాంటి చావుల్ని బలిదానాలు(ఆల్ట్రూయిస్టిక్ సూసైడ్) అంటాము. మనుషుల మీద ప్రేమాభిమానాలు బొత్తిగా లేనప్పుడూ ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుంది. మనుషుల మీద ప్రేమాభిమానాలు లేని మనిషి ఒక అహంతో బతుకుతుంటాడు. బయటి నుండి సంఘీభావం అందక చనిపోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇలాంటి చావును అహంభావ ఆత్మహత్య (ఈగోయిస్టిక్ సూసైడ్) అంటారు.

కొందరి మీద ఇంటాబయట ఆక్షలుంటాయి. బట్టలు ఎలా వేసుకోవాలి, తల ఎలా దువ్వుకోవాలి, ఎలా నడవాలి, ఏం చదవాలి, ఎవర్ని పెళ్ళి చేసుకోవాలి వరకు తల్లిదండ్రులే శాసిస్తుంటారు. కొందరిని ఆఫీసులో పైఅధికారులు వేధిస్తుంటారు. వీటిని తట్టుకోలేక కొందరు మరణానికి సిద్ధపడతారు. వీటిని నిర్బంధ మరణం (ఫాటలిస్టిక్ సూసైడ్) అంటారు. కొన్ని సందర్భాల్లో 'ప్రభుత్వం చేసిన హత్య' అంటుంటాం. ఇలాంటివి ఈ కోవలోనికే వస్తాయి. ఆంక్షల్ని, నియమ నిబంధనల్ని అస్సలు పట్టించుకోని వారు కొందరుంటారు. వీరిలోనూ ఆత్మహత్యల రేటు ఎక్కువగా వుంటుంది. వీటిని క్రమశిక్షణ రహిత ఆత్మహత్యలు (అనామిక్ సూసైడ్) అనవచ్చు.

ఆత్మహత్యల్ని నివారించడానికి కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు పనిచేస్తున్నాయి. వీటికి కొన్ని యాప్‌లు కూడా వున్నాయి. ఆత్మహత్యల్ని నివారించడానికి అన్నింటికన్నా ముఖ్యమైనది సంఘీభావం. అది వర్తమాన సమాజంలో క్రమంగా కనుమరుగైపోతున్నది. ఇది అమానవీయమైన పరిణామం. మనుషుల మధ్య సంఘీభావాన్ని నెలకొల్పడానికి అందరూ పూనుకోవాల్సిన సందర్భం ఇది.

వ్యాసకర్త సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు
మొబైల్: 90107 57776

విజయానికి సంకేతం

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి ఆశ్వయుజ నవమి వరకూ దేవీ నవరాత్రులను జరుపుకొంటాం. పదవ రోజు... అంటే ఆశ్వయుజ దశమిరోజు విజయదశమి పర్వదినం. ఇది శరదృతువు గనుక ఈ పండుగ దినాలను శరన్నవరాత్రులు అంటారు. దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారిని మొదటిరోజు శైలపుత్రి, రెండోరోజు బ్రహ్మచారిణి, మూడో రోజు చంద్రఘంటాదేవి, నాలుగో రోజు కూష్మాండాదేవి, ఐదోరోజు స్కందమాత, ఆరో రోజు కాత్యాయని, ఏడోరోజు కాళీ మాత, ఎనిమిదోరోజు మహాగౌరి, తొమ్మిదో రోజు సిద్ధిదాత్రీ దేవి – రూపాల్లో ఆరాధిస్తారు. పదవ రోజు రాజరాజేశ్వరీదేవి రూపాలతో అమ్మవారిని అలంకరిస్తారు. దేవి రూపానికి తగినట్లు ఆ వేళ నైవేద్యం సమర్పిస్తారు. శరన్నవరాత్రుల్లో అమ్మ వారికి వరుసగా కేసరి, పొంగలి, అల్లం గారెలు, దద్ధోజనం, అప్పాలు–పులిహోర, పెసర పప్పు పాయసం, వడపప్పు–చలిమిడి, చక్రపొంగలి, కేసరి, పూర్ణాలు, లడ్డూలు నైవేద్యంగా సమర్పిస్తారు.

నవరాత్రి చెడును, విశృంఖలత్వాన్ని నిర్మూలించడానికి, అలాగే జీవితంలో అన్ని అంశాల పట్ల, అంటే మన శ్రేయస్సుకి దోహదపడే వస్తువులు, విషయాల పట్ల కూడా కృతజ్ఞతా భావంతో ఉండటానికి సంబంధించినది. నవరాత్రుల తొమ్మిది రోజులు మూడు ప్రాథమిక లక్షణాలైన తామస, రజస, సత్వ గుణాలకు అనుగుణంగా వర్గీకరించబడ్డాయి. మొదటి మూడు రోజులు తామసికమైనవి, వాటికి ప్రతీకలు తీవ్రమైన దుర్గ, కాళి దేవతలు. తరువాతి మూడు రోజులు లక్ష్మికి సంబంధించినవి – కోమలమైనదే కానీ ధన, వస్తు, కనక, వాహనాలకు ఆధారమైన దేవి. ఆఖరి మూడు రోజులు సరస్వతి కోసం ఉద్దేశించబడినవి. అదే సత్వ గుణం. అది జ్ఞానం, జ్ఞానోదయానికి సంబంధించినది. నవ రాత్రుల తరువాత పదవది, అంటే ఆఖరుది విజయ దశమి – అంటే ఈ మూడు గుణాలను జయించారని అర్థం.

దేవదానవులు పాలసముద్రాన్ని మథించినప్పుడు అమృతం జనించిన శుభముహూర్తదినం ఈ విజయదశమి రోజే. 'శ్రవణా' నక్షత్రంతో కలసిన ఆశ్వయుజ దశమికి 'విజయ' అనే సంకేతముంది. అందుకనే దీనికి 'విజయదశమి' అని పేరు వచ్చింది.


'శమీపూజ' – శమీ వృక్షమంటే జమ్మిచెట్టు. శమీవృక్షం పాపాన్ని పరిహరిస్తుంది, శత్రువులను నాశనం చేస్తుందని అర్థం. ఇది ఆనాడు అర్జునుని ధనువును కాపాడింది, శ్రీరాముడికి ప్రియాన్ని కల్గించింది. జమ్మి ఆకును బంగారంగా భావించి, పెద్దల చేతిలో ఆకును ఉంచి ఆశీర్వాదాలు తీసుకుంటారు. విజయదశమి రోజున జమ్మిచెట్టు వద్దకు వెళ్ళి పార్వేట జరుపుకొంటారు.

– నందిరాజు రాధాకృష్ణ

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, ఆశ్వయుజమాసం, **తిథి:** శు.తదియ రా.11.56 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** విశాఖ రా.8.11 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.12.15 నుండి 1.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.03 వరకు, తదుపరి రా.10.32 నుండి 11.21 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.08 నుండి 12.46 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.35.

యూరప్‌లో వైభవంగా వేంకటేశ్వర కల్యాణాలు



సాక్షి, అమరావతి: టీటీడీ ఆధ్వర్యంలో యూరప్‌లో శ్రీ శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా జరిగాయి. అక్టోబర్ 10న బెల్ ఫాస్ట్, 12న బేసింగ్ స్టోక్, 14న మిల్టన్ కీన్స్, 15న గ్లూస్టర్ నగరాల్లో శ్రీదేవి, భూదేవి సమేతుడై శ్రీ మలయప్ప స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక తెలుగు, భారతీయ ధార్మిక సంస్థల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ఏపీఎన్ఆర్టీఎస్ అధ్యక్షులు వెంకట్ మేడపాటి ఆయా నగరాల కార్యనిర్వాహక వర్గాలతో సమన్వయం చేస్తూ కల్యాణం సజావుగా సాగేలా ఏర్పాట్లు చేశారు. టీటీడీ నుంచి వెళ్లిన అర్చకులు, వేదపండితులు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం కల్యాణోత్సవాలను నిర్వహించినట్లు వెంకట్ మేడపాటి తెలిపారు. కల్యాణానికి హాజరైన వారికి తిరుమల లడ్డూలను ప్రసాదంగా అందించినట్లు తెలిపారు. ఈ కల్యాణోత్సవాల్లో 2 లక్షలకు పైగా భక్తులు పాల్గొన్నారని చెప్పారు.



శ్రీ గాయత్రీదేవి అలంకారంలో విజయవాడ కనకదుర్గమ్మ



అమ్మవారిని దర్శించుకోవడానికి క్యూలైన్లలో తరలి వస్తున్న భక్తులు

గాయత్రీదేవిగా దుర్గమ్మ

పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ • నేడు శ్రీ అన్నపూర్ణాదేవిగా దర్శనమివ్వనున్న అమ్మవారు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. టీటీడీ తరఫున బోర్డు సభ్యులు మేకా శేషుబాబు, గడిరాజు వెంకట సుబ్బరాజు తదితరులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. సాయంత్రం ఆది దంపతుల నగరోత్సవం నేత్రపర్వంగా సాగింది. గంగాసమేత దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో మల్లేశ్వరాలయం దిగువన ఉన్న మహామండపం నుంచి ప్రారంభమైన నగరోత్సవంలో అర్చకులు, పండితులు, కళాకారులు, అధికారులు పాల్గొన్నారు. కళావేదికపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా, దసరా ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు.

సాఫీగా క్యూలైన్లు: దుర్గమ్మ ఆలయంలో క్యూలైన్లు సాఫీగా సాగాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో సామాన్యులకు త్వరితగతిన అమ్మవారి దర్శనమైంది. దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా అదనపు సౌకర్యాలు కల్పించారు. కొండపైకి ప్రొటోకాల్, డిజిగ్నేటెడ్ వీఐపీల వాహనాలు తప్ప, ఇతరుల వాహనాలు రాకుండా కట్టడి చేశారు. దీంతో కొండపై ట్రాఫిక్, భక్తుల రద్దీ కనిపించలేదు. అనధికార దర్శనాలకు ఊతం ఇస్తే సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగుతుందని, ఆ మార్గాలన్నింటికీ కలెక్టర్ ఢిల్లీరావు తాళాలు వేయించారు. అక్కడ తాళాలు తీస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు, దుర్గగుడి సిబ్బందిని హెచ్చరించారు. స్వయంగా ఆయన ఘాట్ రోడ్డు నుంచి కాలినడకన క్యూలైన్లలో పరిశీలిస్తూ కొండపైకి చేరుకొని ఆలయ ప్రాంగణంలో తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరోవైపు స్నాన ఘాట్‌ల వద్ద జల్లు స్నానం, కేశఖండనశాలలో ఏర్పాట్లపైన భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


దుర్గమ్మను దర్శించుకున్న న్యాయమూర్తులు

శ్రీ గాయత్రీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వీరిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు, హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ బి.శివశంకరరావు ఉన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆలయంలో జస్టిస్ టి.మల్లికార్జునరావు

చిన్న శేష, హంస వాహనాలపై వేంకటేశుడు





చిన్న శేష వాహనం, హంసవాహనంపై విహరిస్తున్న ఆపదమొక్కులవాడు

తిరుమల/చంద్రగిరి: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం ఉదయం శ్రీమలయప్పస్వామివారు శంఖచక్రాలతో యోగముద్రలో బద్రీనారాయణ అలంకారంలో ఐదు తలల చిన్న శేషవాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి శ్రీ మలయప్ప స్వామి వారు హంస వాహనంపై వీణ ధరించి సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మాడ వీధుల్లో అంగరంగ వైభవంగా జరిగిన వాహనసేవలో వివిధ కళాబృందాల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ వాహన సేవల్లో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గోపాలకృష్ణారావు, జస్టిస్ రవీంద్రబాబు, తెలంగాణ మంత్రి శ్రీనివాస్ గౌడ్, సినీ నటులు వసంత రవి దర్శించుకున్నారు. అలాగే, జస్టిస్ గోపాలకృష్ణారావు తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.





కుటుంబ సభ్యులతో జస్టిస్ గోపాలకృష్ణారావు, జస్టిస్ రవీంద్రబాబు

బ్రహ్మచారిణిగా శ్రీశైల భ్రమరాంబాదేవి



గ్రామోత్సవంలో భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో దసరా నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు సోమవారం శ్రీశైల భ్రమరాంబాదేవి బ్రహ్మచారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారు మయూర వాహనంపై వీధుల్లో విహరించారు. బ్రహ్మచారిణి స్వరూపంలోని అమ్మవారిని, మయూర వాహనంపై అధిష్ఠించిన స్వామి, అమ్మవార్లను ఆలయ రాజగోపురం గుండా వెలుపలికి తోడ్కొని వచ్చి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

కమ్యూనిటీ రిజర్వ్ ప్రాంతాలుగా 3 పక్షుల కేంద్రాలు

- ఉప్పలపాడు, తేలినీలాపురం, కొండకర్ల ఆవకు గుర్తింపు
- స్థానికుల ద్వారా సంరక్షణకు అటవీ శాఖ ప్రయత్నాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మూడు పక్షుల సంరక్షణ కేంద్రాలను కమ్యూనిటీ రిజర్వ్ ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు అటవీ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. గుంటూరు జిల్లాలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రం, అనకాపల్లి జిల్లాలోని కొండకర్ల ఆవ సరస్సు, శ్రీకాకుళం జిల్లాలోని తేలినీలాపురం పక్షుల కేంద్రాలను కమ్యూనిటీ రిజర్వ్‌లుగా గుర్తించి స్థానికుల భాగస్వామ్యంతో మరింత అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. మూడు ప్రాంతాల్లో జీవవైవిధ్యాన్ని సంరక్షించడం, స్థానికుల జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ ప్రతిపాదనలు తయారు చేసి అమలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని తేలినీలాపురం పక్షుల విడిది కేంద్రం. గూడుకట్టే పక్షుల శీతాకాల విడిది కేంద్రంగా ఇది గుర్తింపు పొందింది. పెలికాన్‌లు, పెయింటెడ్ స్టార్క్ వంటి 200 రకాల పక్షి జాతులు శీతాకాలం సైబీరియా తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఇక్కడికి వస్తాయి. ఈ పక్షుల కేంద్రం 30 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. బర్డ్ వాచింగ్, ప్రకృతి నడకలు, బోట్ షికారు కోసం సందర్శకులు ఈ ప్రాంతానికి భారీగా తరలివస్తారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సమీపంలోని కొండకర్ల ఆవ అనేది ఒక సరస్సు. సుదూర ప్రాంతాల నుంచి పక్షులు ఇక్కడికి వస్తాయి. సరస్సు చుట్టూ ఉన్న ప్రాంతం పచ్చని చెట్లు, పొదలతో నిండిపోయి సుందరంగా కనిపిస్తుంది. చిలుకలు, పెలికాన్‌లు, స్టార్క్ వంటి వందల పక్షి జాతులు ఇక్కడికి వస్తాయి. అనేక పక్షి జాతులకు ఇది శీతాకాల విడిది కేంద్రం. గుంటూరు జిల్లాలోని ఉప్పలపాడు గ్రామంలో అదే పేరుతో ఉన్న పక్షుల కేంద్రం సందర్శకులను ఆకర్షిస్తోంది. 10 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఒక మంచినీటి చెరువులోకి పక్షులు భారీగా తరలివస్తాయి. ఆహారం, ఆశ్రయం కోసం సుదూర ప్రాంతాల నుంచి 32కు పైగా పక్షి జాతులు ఇక్కడికి వస్తాయి. పక్షుల సంరక్షణ కేంద్రాలుగా ఉన్న వీటిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది సందర్శకులను ఆకట్టుకునేందుకు కమ్యూనిటీ రిజర్వ్‌లుగా గుర్తించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు త్వరలో ఆమోదం లభించే అవకాశం ఉందని అటవీ శాఖ అదనపు పీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే తెలిపారు.

పలు రైళ్లు పునరుద్ధరణ

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వేలో నిర్వహణ పనుల కారణంగా ఇటీవల రద్దు చేసిన కొన్ని రైళ్లను పనులు పూర్తి కావటంతో పునరుద్ధరించినట్లు రైల్వే అధికారులు సోమవారం ప్రకటించారు. లింగంపల్లి–విశాఖపట్నం (12806) రైలును ఈ నెల 18వ తేదీ నుంచి పునరుద్ధరించారు. అలాగే ఈ నెల 17 నుంచి విశాఖపట్నం–లింగంపల్లి (12805), మచిలీపట్నం–విశాఖపట్నం (17219) రైళ్లను, ఈ నెల 18 నుంచి విశాఖపట్నం–మచిలీపట్నం (17220) రైళ్లను కూడా పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు.



మహేశ్వరిగా రాజశ్యామల దర్శనం



అమ్మవారి సన్నిధిలో స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

సింహాచలం/అన్నవరం: విశాఖ శ్రీశారదాపీఠంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజు సోమవారం రాజశ్యామల అమ్మవారు మహేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. తమిళనాడుకు చెందిన అలంకార భట్టర్లు అమ్మవారికి చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారికి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి హారతులు ఇచ్చారు. అలాగే రాజశ్యామల అమ్మవారి నిజరూపానికి ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రామాయణ వైశిష్ట్యాన్ని టీటీడీ పండితులు డాక్టర్ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తి ప్రవచనం ద్వారా భక్తులకు వివరించారు. కాగా, పదో తరగతిలో సంస్కృతం భాషను ప్రత్యేక బోధనాంశంగా గుర్తించేలా కృషి చేయాలని సంస్కృతం పండితులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్రలను కోరారు. సంస్కృత భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పలువురు పండితులు సోమవారం శ్రీశారదాపీఠానికి వెళ్లి పీఠాధిపతులను కలిశారు. సంస్కృతం పండితుల విజ్ఞాపనపై సానుకూలంగా స్పందించిన పీఠాధిపతులు ప్రభుత్వంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

'ముత్తంగి' సేవలో సత్యదేవుని దర్శించుకున్న స్వామీజీ

కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారితో పాటు శంకరునికి సోమవారం నిర్వహించిన 'ముత్తంగి' సేవలో విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పాల్గొని తొలి దర్శనం చేసుకున్నారు. స్వామీజీకి ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ గర్భాలయంలో ముత్యాల వస్త్రాలు అలంకరించిన సత్యదేవుడిని, అమ్మవారిని, శంకరుని దర్శించి పూజలు చేశారు. అన్నవరం దేవస్థానంలో ఇకపై ప్రతి సోమవారం ముత్తంగి సేవ నిర్వహిస్తామని ఈవో ఆజాద్ తెలిపారు. ప్రతి గురువారం స్వామివారి నిజరూప దర్శనం కల్పిస్తామని చెప్పారు.

టీడీపీలో దళితులకు అవమానాలపై నోరు మెదపవేం?

- నక్కా ఆనందబాబుపై వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కైలే మండిపాటు
- దళితులను అవమానించిన బాబుకు ఎన్నాళ్లు ఊడిగం చేస్తావని ధ్వజం



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీలో దళితులకు జరుగుతున్న అవమానాల గురించి ఎందుకు నోరు మెదపడంలేదని మాజీ మంత్రి నక్కా ఆనందబాబుపై వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కైలే అనిల్‌కుమార్ మండిపడ్డారు. దళితులను దారుణంగా అవమానించిన చంద్రబాబుకు ఇంకెన్నాళ్లు ఊడిగం చేస్తావని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని పెత్తందారీ మనస్తత్వంతో చంద్రబాబు దారుణంగా వ్యాఖ్యలు చేసినప్పుడు మీకెందుకు నోరు పెగల్లేదని అనిల్‌కుమార్ ప్రశ్నించారు. 'గత ప్రభుత్వ హయాంలో ఎస్సీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, వ్యవసాయపరంగా తీవ్ర నిరాదరణకు గురయ్యారు. అమరావతి ప్రాంతంలో దళితులను భయపెట్టి వారికి ప్రభుత్వం ఇచ్చిన భూములను తక్కువకే లాక్కొని దెబ్బతీశారు. దళితుల వ్యవసాయ భూములకు కనీసం మోటారు కనెక్షను కూడా ఇవ్వలేదు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల పేరుతో అక్రమాలకు పాల్పడిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదే. ఎస్సీలను వాడుకొని, మోసం చేసిన చంద్రబాబుకు, ఎస్సీలకు అగ్రపీఠం వేసిన సీఎం వైఎస్ జగన్‌కు తేడాను పచ్చ పొరలు కమ్మేసిన ఆనందబాబు గమనించలేకపోతున్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనానికి ఎక్కడో మారుమూల స్థలం కేటాయించి, విగ్రహం ఏర్పాటును చంద్రబాబు పట్టించుకోలేదు. విజయవాడ నగర నడిబొడ్డున వేల కోట్ల రూపాయల విలువైన స్థలంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్ నెలకొల్పుతున్నా నక్కాకు కన్పించడం లేదు. టీడీపీ ప్రభుత్వంలో ఒకరిద్దరు ఎస్సీలకే మంత్రి పదవులిచ్చారు. సీఎం వైఎస్ జగన్ అత్యధిక మందికి మంత్రి పదవులివ్వడమే కాకుండా, ఉప ముఖ్యమంత్రి పదవి కూడా ఇచ్చారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎస్సీ జనోద్ధరణకు పాటుపడుతున్న సీఎం జగన్‌ను అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదు' అని కైలే అనిల్‌కుమార్ హితవు పలికారు.

దసరా సందర్భంగా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: దసరా సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నర్సాపూర్–వికారాబాద్ (07453/07454) స్పెషల్ ట్రైన్ ఈనెల 18న సాయంత్రం 6 గంటలకు నర్సాపూర్ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు వికారాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 19వ తేదీ సాయంత్రం 5.15 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5.10 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుంది. సికింద్రాబాద్–తిరుపతి (07489/07490) ప్రత్యేక రైలు ఈనెల 21న రాత్రి సికింద్రాబాద్ నుంచి 10.05 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 22వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 4.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. గోరఖ్‌పూర్–మహబూబ్‌నగర్ (05303/05304) స్పెషల్ ట్రైన్ ఈనెల 21 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి శనివారం ఉదయం 8.30 గంటలకు గోరఖ్‌పూర్ నుంచి బయల్దేరి ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుంది. అలాగే తిరుగు ప్రయాణంలో ఈనెల 23 నుంచి నవంబర్ 27 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 6 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బయల్దేరి బుధవారం ఉదయం 9 గంటలకు గోరఖ్‌పూర్‌కు చేరుకుంటుంది.

కేన్సర్ రోగుల కష్టాలకు చెక్

ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే కేన్సర్‌కు వైద్య సేవలు




సాక్షి, అమరావతి: కేన్సర్ రోగుల కష్టాలకు చెక్ పెడుతూ రాష్ట్రంలోని జిల్లా ఆస్పత్రుల్లోనే చికిత్స అందించడానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటివరకు కేన్సర్ రోగులు చికిత్స కోసం ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఇతర రాష్ట్రాలకు వెళ్లే వారు. ఇకపై వారికి రాష్ట్రంలోనే ఆధునిక చికిత్సను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. డిసెంబరు 21 నుంచి రాష్ట్రంలోని 12 జిల్లా ఆస్పత్రుల్లో డే-కేర్ కేన్సర్ సేవలు ప్రారంభిస్తోంది. రోగులు ఈ ఆస్పత్రుల్లో హబ్ అండ్ స్పోక్ విధానంలో కీమోథెరపీ, పాలియేటివ్ కేర్ సేవలు పొందవచ్చు. తిరుపతిలోని స్విమ్స్‌తో పాటు మిగిలిన ఉమ్మడి జిల్లాల్లోని పాత 10 బోధనాస్పత్రులు హబ్స్‌గా వ్యవహరిస్తాయి. వీటికి సమీపంలోని జిల్లా ఆస్పత్రులను మ్యాపింగ్ చేశారు. రోగులకు తొలుత హబ్స్‌లో చికిత్స అందిస్తారు. ఆ తర్వాత కేన్సర్ వైద్య నిపుణుల సూచనలతో జిల్లా ఆస్పత్రుల్లోనే చికిత్స అందిస్తారు. ఇందుకోసం ప్రతి జిల్లా ఆస్పత్రిలో నాలుగు పడకలతో ప్రత్యేకంగా ఒక యూనిట్ ఏర్పాటు చేస్తారు. వైద్య సేవలందించడానికి ప్రతి యూనిట్‌లో ఇద్దరు వైద్యులు, నలుగురు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మాసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. మందులు, ఇంట్రావీనస్, ఇంట్రాపెరిటోనియల్, ఇంట్రాథేకల్ ఇలా వివిధ కేన్సర్ వ్యాధులకు కీమోథెరపీ చేస్తారు. సాధారణంగా బ్రెస్ట్, తల, గొంతు కేన్సర్ రోగులకు వ్యాధి తీవ్రత, రోగి పరిస్థితి ఆధారంగా ఆరు అంతకంటే ఎక్కువ సైకిల్స్ కీమోథెరపీ ఇవ్వాల్సి ఉంటుందని రాష్ట్ర కేన్సర్ కేర్ ప్రత్యేకాధికారి డాక్టర్ రమేశ్ తెలిపారు. గర్భాశయ కేన్సర్‌తో బాధపడేవారికి ఐదు సైకిల్స్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు తొలుత రెండు సైకిల్స్ కీమోథెరపీని బోధనాస్పత్రుల్లో (హబ్స్‌లో) ఇస్తారు. అనంతరం రోగి ఉంటున్న ప్రాంతానికి దగ్గరలోని జిల్లా ఆస్పత్రికి మ్యాప్ చేస్తారు. ఇలా మ్యాప్ చేసిన రోగికి హబ్‌లోని అంకాలజీ నిపుణుడి సూచనల మేరకు మిగిలిన అన్ని సైకిల్స్ కీమోథెరపీ జిల్లా ఆస్పత్రుల్లోనే చేస్తారు. భరించలేని నొప్పితో బాధపడుతున్న రోగులకు నొప్పి నుంచి నివారణ కల్పించేలా పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ సేవలు అందిస్తారు.

కేన్సర్ రోగుల వైద్యానికి ఇప్పటికే రూ.1,800 కోట్లు ఖర్చు

కేన్సర్ రోగులకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు చేపట్టింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేద, మధ్యతరగతి వర్గాల్లోని అన్ని రకాల కేన్సర్ రోగులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యాన్ని అందిస్తోంది. 2019–20 నుంచి ఇప్పటివరకు 2.70 లక్షల మందికిపైగా రోగులు ఉచిత వైద్య సేవలు అందుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1,800 కోట్లను ఖర్చు చేసింది. అంతేకాకుండా ప్రభుత్వ రంగంలోనే మెరుగైన కేన్సర్ వైద్య సదుపాయాలను కల్పిస్తోంది. ఈ క్రమంలో కేన్సర్ రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలందించడానికి గుంటూరు బోధనాస్పత్రిని లెవెల్–1, కర్నూలు, విశాఖ ఆస్పత్రులను లెవెల్–2 సెంటర్స్‌గా అభివృద్ధి చేస్తోంది.

డిసెంబర్ 21 నుంచి ప్రారంభం



డిసెంబర్ 21 నుంచి 12 జిల్లా ఆస్పత్రుల్లో డే-కేర్ కేన్సర్ సేవల ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. కీమోథెరపీ, పాలియేటివ్ కేర్‌కు అవసరమైన మందులు, ఇతర సదుపాయాలను ఏపీఎంఎస్ఐడీసీ సమకూరుస్తోంది. ఇక మీదట కేన్సర్ రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. రాష్ట్రంలోనే వారు చికిత్స పొందవచ్చు.

– డాక్టర్ వెంకటేశ్వర్, డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్

తెలంగాణ

పాలేరు కోసం సీపీఎం.. మునుగోడు కోసం సీపీఐ

- ఆ రెండు సీట్ల కోసం కమ్యూనిస్టుల పట్టు
- ఇంకా కొలిక్కి రాని కాంగ్రెస్, వామపక్షాల పొత్తు
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీటు ఇవ్వకుంటే ప్రయోజనం లేదంటున్న సీపీఎం
- కాంగ్రెస్ అధిష్టానం కోర్టులో లెఫ్ట్ సీట్ల వ్యవహారం... వేచిచూస్తున్న కామ్రేడ్లు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, వామపక్షాల పొత్తు వ్యవహారం ఇంకా ఒక కొలిక్కి రాలేదు. ఆయా పార్టీల మధ్య రాజకీయ అవగాహన కుదిరినా, సీట్లపై ఇంకా అస్పష్టత కొనసాగుతూనే ఉంది. వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వాలు ఇప్పటికీ సీట్లపై కసరత్తు చేస్తూనే ఉన్నాయి. సీపీఐ, సీపీఎంలకు చెరి రెండేసి అసెంబ్లీ స్థానాలు, చెరో ఎమ్మెల్సీ ఇచ్చేలా అంగీకారం కుదిరింది. సీపీఐ కొత్తగూడెం, మునుగోడు కోరుతుండగా, సీపీఎం మాత్రం మిర్యాలగూడతో పాటు భద్రాచలం లేదా పాలేరు స్థానాలను ప్రతిపాదించింది. సీపీఐకి కొత్తగూడెం స్థానం ఇచ్చేందుకు అంగీకారం తెలిపిన కాంగ్రెస్, మునుగోడుకు బదులు చెన్నూరు స్థానాన్ని ఇస్తామని తేల్చి చెప్పింది. అయితే చెన్నూరు తమకు వద్దని, మునుగోడు ఇవ్వాల్సిందేనని సీపీఐ పట్టుబడుతోంది.

ఒకటి మీరడిగేది.. రెండు మేమిచ్చేది తీసుకోండి

కాంగ్రెస్ మాత్రం ×మీరడుగుతున్న రెండు స్థానాల్లో ఒకటి మీరు కోరుకున్న సీటు ఇస్తాం. మరోటి మేం ఇచ్చే సీటు తీసుకోవాలని× చెబుతోంది. దీంతో సీపీఐ కంగుతింది. ఇక సీపీఎం విషయంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఇదే సూత్రాన్ని అమలు చేయనుంది. దీంతో కాంగ్రెస్ చెప్పిన ఏదో ఒక స్థానంలో పోటీ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మిర్యాలగూడ స్థానాన్ని సీపీఎంకు ఇచ్చేందుకు అంగీకరించిన కాంగ్రెస్, మరో స్థానం విషయంలో మాత్రం స్పష్టత ఇవ్వడంలేదు.

భద్రాచలం ఇచ్చినా బాగుండేదంటున్న సీపీఎం...

సీపీఎం మాత్రం పాలేరు లేదా భద్రాచలం కోరింది. అయితే భద్రాచలంలో తమ అభ్యర్థిని ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించింది. తమ సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని ఎలా ఇస్తామని కాంగ్రెస్ చెబుతోంది. దీంతో ఇప్పుడు పాలేరు స్థానంపై సీపీఎం పట్టుబడుతోంది. కానీ కాంగ్రెస్ పార్టీ దీనికి అంగీకరించే పరిస్థితులు కనిపించడంలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో మూడు మాత్రమే జనరల్ స్థానాలు ఉండగా, మిగిలినవన్నీ రిజర్వుడు స్థానాలు. ఈ నేపథ్యంలో జనరల్ స్థానాల్లో కొత్తగూడెంను సీపీఐకి కాంగ్రెస్ కేటాయించింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి మరో రెండు జనరల్ స్థానాలే మిగిలాయి. వాటిల్లో సీపీఎంకు పాలేరు ఇస్తే జనరల్ స్థానం ఖమ్మం ఒకటే మిగులుతుంది. కానీ ఆ జిల్లాలో కాంగ్రెస్‌కు కీలకమైన నేతలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావులకు టిక్కెట్ ఇవ్వాల్సి ఉంది.

పాలేరు నుంచి పొంగులేటి?

పొంగులేటి, తుమ్మల ఇప్పుడు కాంగ్రెస్‌లో రాష్ట్రస్థాయిలో ప్రముఖులుగా ఉన్నారు. దీంతో పొంగులేటికి పాలేరు, తుమ్మలకు ఖమ్మం స్థానాలు ఇచ్చే యోచనలో కాంగ్రెస్ ఉంది. ఈ నేపథ్యంలో పాలేరు స్థానాన్ని సీపీఎంకు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ స్థానంలో సీపీఎం తరఫున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అభ్యర్థిగా ఉండాలని భావిస్తున్నారు. ఆ స్థానం ఇవ్వకుంటే పొత్తుకు సీపీఎం అంగీకరించే పరిస్థితి కనిపించడం లేదు. విచిత్రమేంటంటే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం కోరే సీట్లన్నీ కీలకమైనవే. గతంలో మధిర స్థానాన్ని కూడా సీపీఎం ప్రతిపాదించింది. ఆ స్థానంలో భట్టి విక్రమార్క అనేకసార్లు విజయం సాధించారు. ఇలా కాంగ్రెస్‌కు పట్టున్న స్థానాలను సీపీఎం కోరుతుండటంతో కాంగ్రెస్ పార్టీ చిక్కుల్లో పడింది. ఏదిఏమైనా ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానం కోర్టులో లెఫ్ట్ సీట్ల వ్యవహారం ఉంది. పొత్తు అంశం త్వరగా కొలిక్కి రావాలని కామ్రేడ్లు వేచి చూస్తున్నారు.

మరో 29మందికి బీఆర్ఎస్ బీ ఫారాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫారాలు అందించే కార్యక్రమం సోమవారం కూడా కొనసాగింది. ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా మరో 29 మంది బీఫారాలు అందుకున్నారు. దీనితో మొత్తంగా బీఫారాలు తీసుకున్న అభ్యర్థుల సంఖ్య 98కి చేరింది. మరో 21 మందికి బీఫారాలు అందజేయాల్సి ఉంది. అయితే మూడు నియోజకవర్గాల్లో మాత్రం అభ్యర్థుల ఎంపిక ఇంకా కొలిక్కి రాలేదు. కేసీఆర్ అభ్యర్థుల జాబితా విడుదల సమయంలో నాలుగు సెగ్మెంట్లను పక్కనపెట్టగా, మైనంపల్లి పార్టీని వీడటంతో ఆ సీటు ఖాళీ అయింది. ఈ సీట్లకుగాను జనగామకు సంబంధించి పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఫారం అందుకున్నారు. మల్కాజిగిరిలో మర్రి రాజశేఖర్‌రెడ్డికి ఖరారు చేయడంతో ఆయన ప్రచారంలో నిమగ్నమయ్యారు. నర్సాపూర్, నాంపల్లి, గోషామహల్ స్థానాలపై స్పష్టత రాలేదు. నర్సాపూర్ టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి పోటీపడుతున్నారు. మదన్‌రెడ్డి ఇప్పటికే పలు మార్లు ప్రగతిభవన్‌కు వచ్చి తనకు టికెట్ ఇవ్వాలని కోరారు. సోమవారం అలా ప్రగతిభవన్‌కు వచ్చిన మదన్‌రెడ్డిని కేసీఆర్ హెలికాప్టర్‌లో వెంటబెట్టుకుని జనగామ సభకు తీసుకెళ్లడం గమనార్హం. అయితే నర్సాపూర్ టికెట్ ఎవరికనే స్పష్టత అయితే రాలేదు. ఇక నాంపల్లిలో ఆనంద్‌గౌడ్‌ను ప్రచారం చేసుకోవాల్సిందిగా కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. గోషామహల్‌పై ఎలాంటి సంకేతాలు అందడం లేదని ఆశావహులు చెప్తున్నారు.

బాసరలో మాజీ సీజేఐ ఎన్వీ రమణ పూజలు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని మాజీ సీజేఐ ఎన్వీ రమణ సోమవారం దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా బాసర వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. తన మనవరాలు శ్రీనిత్యకు అమ్మవారి సన్నిధిలో మాజీ సీజేఐ అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అమ్మవారి పూజలో పాల్గొన్నారు. దేవస్థాన వ్యవస్థాపకుడు శరత్ పాఠక్, ఆలయ ఈవో విజయరామారావు, ప్రధాన అర్చకుడు మాజీ జస్టిస్ ఎన్వీ రమణకు జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందించారు.


గాజా స్ట్రిప్ దిశగా సాయుధ శకటంపై వెళ్తూ విక్టరీ సింబల్ చూపుతున్న ఇజ్రాయెల్ సైనికుడు

మోహరించిన ఇజ్రాయెల్ సేనలు

గాజాపై భూతల దాడులకు సన్నాహాలు

- సరిహద్దుల్లో యుద్ధ ట్యాంకులు, రిజర్వ్ సైనికులు
- పదో రోజుకు చేరిన ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ
- గాజాలో 2,750 మంది, ఇజ్రాయెల్‌లో 1,400 మందికి పైగా మృతి
- గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఖండించిన ఇరాన్

జెరూసలేం/గాజా స్ట్రిప్/రఫా: గాజాలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హమాస్ మిలిటెంట్ల అంతు చూడడంతోపాటు వారి స్థావరాలను నేలమట్టం చేయడమే లక్ష్యంగా భూతల దాడులకు ఇజ్రాయెల్ సైన్యం సన్నద్ధమవుతోంది. సరిహద్దుల్లో భారీ సంఖ్యలో యుద్ధ ట్యాంకులను మోహరించింది. పదాతి దళాలు పూర్తిస్థాయి యుద్ధ సన్నాహాల్లో మునిగిపోయాయి. 3 లక్షలకుపైగా ఇజ్రాయెల్ రిజర్వ్ సైనికులు గాజా సరిహద్దుకు చేరుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆదేశాల కోసం వారు ఎదురుచూస్తున్నారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం సోమవారం పదో రోజుకు చేరుకుంది. ఈ పోరులో ఇప్పటిదాకా గాజాలో 2,750 మంది పాలస్తీనియన్లు మృతి చెందారని, 9,700 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికి పైగా మరణించినట్లు తెలిసింది. అతిత్వరలోనే ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ సేనలు భూతల దాడులు ప్రారంభిస్తాయని ప్రచారం సాగుతోంది. ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేయడంతో ఉత్తర గాజా నుంచి జనం దక్షిణ గాజాకు వలస బాట పట్టారు. ఇప్పటిదాకా 6 లక్షల మందికిపైగా జనం వెళ్లిపోయినట్లు అంచనా. ఇజ్రాయెల్‌కు సాయంగా మిత్రదేశం అమెరికా పంపించిన అత్యాధునిక యుద్ధవిమాన వాహక నౌకలు మధ్యధరా సముద్రంలో గాజా తీరంలో మోహరించాయి. గాజాను గుప్పిట్లో పెట్టుకొని తమ భద్రతకు ముప్పుగా పరిణమించిన హమాస్ మిలిటెంట్ గ్రూప్‌ను నామరూపాల్లేకుండా చేయడమే తమ ముందున్న కర్తవ్యమని ఇజ్రాయెల్ సైన్యం తేల్చిచెబుతోంది. గాజాలో ప్రజల కష్టాలకు తెరపడడం లేదు. ఆహారం, నీరు, ఇంధనం కొరత తీవ్రరూపం దాలుస్తోంది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో గాయపడిన వేలాది మంది ఆసుపత్రుల్లో చేరారు. ఆసుపత్రుల్లో వారి పరిస్థితి మరింత హృదయవిదారకంగా మారింది. చికిత్సలు ఆగిపోవడంతో బాధితులు ప్రాణాలు కోల్పోతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. మృతదేహాలను భద్రపర్చడానికి ప్లాస్టిక్ బ్యాగ్‌లు కూడా లేవని వాపోతున్నారు.

హమాస్ చేతిలో బందీలు 199 మంది

గాజాలో హమాస్ మిలిటెంట్ల చేతిలో ప్రస్తుతం 199 మంది బందీలు ఉన్నారని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారీ సోమవారం వెల్లడించారు. దాదాపు 150 మంది బందీలు ఉన్నట్లు ఇప్పటిదాకా భావించామని, కానీ, 199 మంది ఉన్నట్లు తేలిందని చెప్పారు. బందీల్లో చాలామంది ఇజ్రాయెల్ సైనికులు, మహిళలు, చిన్నారులు ఉన్నారని పేర్కొన్నారు. అయితే, బందీల్లో విదేశీయులు ఉన్నారో లేదో ఆయన

వైమానిక దాడులు నిలిపివేస్తే బందీలు విడుదల

గాజా స్ట్రిప్‌పై వైమానిక దాడులను ఇజ్రాయెల్ నిలిపివేస్తే బందీలను విడుదల చేయడానికి హమాస్ సిద్ధంగా ఉందని ఇరాన్ విదేశాంగ శాఖ సోమవారం తెలియజేసింది. కానీ, దీనిపై హమాస్ స్పందించలేదు. తమపై దాడులు ఆపడంతోపాటు ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న వేలాది మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేస్తే, అందుకు బదులుగా తమ వద్ద నున్న బందీలను విడుదల చేయాలన్న ఆలోచనలో హమాస్ ఉన్నట్లు సమాచారం.

ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో....

లెబనాన్ సరిహద్దుల్లో నివసిస్తున్న యూదులంతా వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. లెబనాన్ సరిహద్దుల సమీపంలో 28 యూదు కాలనీలు ఉన్నాయి. ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లోనూ యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం, లెబనాన్ ప్రభుత్వ మద్దతున్న షియా తీవ్రవాద సంస్థ హెజ్బొల్లా సభ్యుల మధ్య పరస్పరం కాల్పులు జరుగుతున్నాయి. సరిహద్దుల్లో ఇజ్రాయెల్ సైనిక స్థావరాల్లోని నిఘా కెమెరాలను హెజ్బొల్లా సభ్యులు ధ్వంసం చేయడం ప్రారంభించారు. తమ కదలికలను ఇజ్రాయెల్ గుర్తించకుండా ఉండేందుకు వారు ఈ పని చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య జరిగిన తాజా ఘర్షణలో ఒక ఇజ్రాయెల్ సైనికుడు, ఒక పౌరుడు మరణించారు. లెబనాన్‌లో ఒక జర్నలిస్టు సహా ముగ్గురు పౌరులు మృతిచెందారు.

నన్ను తీసుకోండి.. బందీలను వదిలేయండి

హమాస్‌కు జెరూసలేం చర్చి కార్డినల్ పియర్‌బటిస్టా వినతి

జెరూసలేం: హమాస్ మిలిటెంట్ల చేతిలో వందలాది మంది ఇజ్రాయెల్ పౌరులు బందీలుగా ఉండడంపై జెరూసలేంలోని రోమన్ క్యాథలిక్ చర్చి మతపెద్ద కార్డినల్ పియర్‌బటిస్టా పిజ్జాబల్లా ఆందోళన వ్యక్తం చేశారు. వారిని క్షేమంగా విడిపించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. తాను బందీగా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తనను అధీనంలోకి తీసుకొని, బందీలందరినీ విడుదల చేయాలని హమాస్‌కు విజ్ఞప్తి చేశారు. బందీల మార్పిడికి తాను ఉపయోగపడితే సంతోషిస్తానని వివరించారు. చిన్నారులు త్వరగా వారి ఇళ్లకు చేరాలని కోరుకుంటున్నానని తెలిపారు. బందీలకు స్వేచ్ఛా స్వాతంత్య్రాలు లభిస్తే అంతకన్నా తనకు కావాల్సింది ఏమీ లేదని పియర్‌బటిస్టా పిజ్జాబల్లా స్పష్టం చేశారు. ఆయన వినతి పట్ల హమాస్ సానుకూలంగా స్పందిస్తుందా? అంటే అనుమానమేనని ఇజ్రాయెల్ అధికారులు చెబుతున్నారు.


ఇజ్రాయెల్ దాడుల్లో కుప్పకూలిన భవన శిథిలాల మధ్య దిగాలుగా ఓ పాలస్తీనా బాలుడు


గాజా స్ట్రిప్‌లోని నుసైరత్ క్యాంప్ ప్రాంతంలో ఇజ్రాయెల్ వైమానిక దాడిలో దెబ్బతిన్న భవనాన్ని పరిశీలిస్తున్న పాలస్తీనియన్లు

వచ్చేవారం ఇజ్రాయెల్‌కు జో బైడెన్!

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వచ్చేవారం ఇజ్రాయెల్‌లో పర్యటించబోతున్నారని తెలిసింది. ఈ పర్యటన ఇంకా అధికారికంగా ఖరారు కాలేదు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ అరబ్ దేశాల పర్యటన ముగించుకొని సోమవారం ఇజ్రాయెల్‌కు తిరిగివచ్చారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతోపాటు అధికారులతో సమావేశమయ్యారు. తాజా పరిణామాలపై చర్చలు జరిపారు.

గాజాపై ఆధిపత్యం పొరపాటే అవుతుంది: బైడెన్

ఇజ్రాయెల్ సేనలు గాజాలో సుదీర్ఘకాలంపాటు ఉండడం పెద్ద పొరపాటుగా పరిణమించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అభిప్రాయపడ్డారు. గాజాపై యుద్ధం వద్దంటూ ఇజ్రాయెల్‌కు పరోక్షంగా సూచించారు. యుద్ధాల్లో పాటించాల్సిన నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. గాజా ప్రజలకు ఆహారం, నీరు, ఔషధాలు, నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు హితవు పలికారు. గాజాలో పాలస్తీనియన్ల ఆధ్వర్యంలోనే పాలన కొనసాగాలని తాను ఆశిస్తున్నట్లు బైడెన్ తాజాగా స్పష్టం చేశారు. మొత్తం పాలస్తీనియన్లకు హమాస్ మిలిటెంట్లు ప్రతినిధులు కాదని తేల్చిచెప్పారు. గాజాను ఇజ్రాయెల్ ఎక్కువ కాలం అధీనంలో ఉంచుకుంటుందని తాను భావించడం లేదన్నారు.

మమ్మల్ని పరీక్షించొద్దు: నెతన్యాహూ

తమ దేశ ఉత్తర సరిహద్దుల్లో తమను పరీక్షించవద్దని ఇరాన్, హెజ్బొల్లా సంస్థను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ హెచ్చరించారు. ఆయన సోమవారం ఇజ్రాయెల్ చట్టసభ 'నెస్సెట్'లో ప్రసంగించారు. హమాస్‌ను ఓడించడానికి ప్రపంచ దేశాలు చేతులు కలపాల్సిన అవసరం ఉందని చెప్పారు. 'ఈ యుద్ధం మీ యుద్ధం' అని అన్నారు. హమాస్ మిలిటెంట్లు నాజీ ముష్కరుల్లాంటివారేనని నెతన్యాహూ తేల్చిచెప్పారు.

దాడులు ఆపకపోతే అన్ని చేతులూ ట్రిగ్గర్‌పైనే: ఇరాన్

గాజాపై కొనసాగుతున్న ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. పాలస్తీనియన్లపై దురాక్రమణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. దురాక్రమణ సాగిస్తున్న ఇజ్రాయెల్‌పై కఠిన చర్యలు తీసుకునేందుకు తమ ప్రాంతంలో అందరూ సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమీరబ్దొల్లాహియాన్ స్పష్టం చేశారు. గాజాపై దాడులు ఆపకపోతే అన్ని చేతులూ ట్రిగ్గర్‌పైనే ఉంటాయని, ఇజ్రాయెల్‌కు గుణపాఠం తప్పదని తేల్చిచెప్పారు. గాజాలో సాధారణ పౌరులపై జరుగుతున్న అనాగరిక దాడులను వెంటనే ఆపాలని అమెరికాకు ఇరాన్ సూచించింది. గాజాపై వైమానిక దాడులు ఆపకపోతే తాము ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగాల్సి వస్తుందని ఇజ్రాయెల్‌కు ఇరాన్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.

బందీలను వెంటనే విడుదల చేయాలి: ఐరాస

బందీలందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని హమాస్ మిలిటెంట్లకు ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటేరస్ హితవు పలికారు. అలాగే గాజా స్ట్రిప్‌కు ఆహారం, నీరు, ఔషధాల సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని సోమవారం ఇజ్రాయెల్‌కు సూచించారు. ప్రపంచ దేశాల నుంచి పాలస్తీనియన్లకు మానవతా సాయం అందేలా ఆంక్షలు తొలగించాలని, సరిహద్దులు తెరవాలని అన్నారు. సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడం హర్షించదగ్గ పరిణామం కాదని చెప్పారు. ఈజిప్టు, జోర్డాన్, వెస్ట్‌బ్యాంకు నుంచి నిత్యావసరాలు పాలస్తీనియన్లకు అందేలా ఇజ్రాయెల్ చొరవ తీసుకోవాలని కోరారు.

ఘర్షణ ఆగిపోవాలి: రిషి సునాక్

ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ మరింత విస్తరించవద్దని కోరుకుంటున్నానని బ్రిటిష్ ప్రధానమంత్రి రిషి సునాక్ చెప్పారు. ఘర్షణ ఆగిపోవాలని, ఇందుకోసం తన వంతు కృషి చేస్తానని, ఈ దిశగా ప్రపంచ దేశాల అధినేతలతో కలిసి పని చేస్తానని వివరించారు. రిషి సునాక్ తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో ఫోన్‌లో మాట్లాడారు. జోర్డాన్ రాజు అబ్దుల్లాతో లండన్‌లో సమావేశమయ్యారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంపై వారితో చర్చించారు. సామాన్య ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు రిషి సునాక్ సూచించారు.

ఢిల్లీ మద్యం కేసు.. నిందితుల జాబితాలో ఆప్!

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అక్కడి పాలక పార్టీ ఆప్‌ను మరిన్ని సమస్యలు చుట్టుముట్టేలా కన్పిస్తున్నాయి. దీనికి సంబంధించిన అవినీతి, మనీ లాండరింగ్ కేసుల్లో ఆప్‌ను కూడా నిందితుల జాబితాలో చేర్చే విషయమై ఆలోచన చేస్తున్నట్టు సీబీఐ, ఈడీ పేర్కొన్నాయి. వాటి తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు సోమవారం సుప్రీంకోర్టుకు ఈ మేరకు నివేదించారు. అవినీతి వ్యతిరేక చట్టం, నగదు అక్రమ తరలింపు (నిరోధక) చట్టంలోని సెక్షన్ 70 ప్రకారం ఈ చర్య తీసుకోదలచినట్టు వివరించారు. అయితే సీబీఐ, ఈడీ దర్యాప్తు చేస్తున్న కేసుల్లో ఆప్‌పై ప్రత్యేక అభియోగాలు మోపుతారా అన్న విషయమై మంగళవారం స్పష్టత ఇవ్వాల్సిందిగా ఆయనకు ధర్మాసనం సూచించింది. మద్యం విధానం కేసులో అరెస్టై జైల్లో ఉన్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్లపై వాదనల సందర్భంగా ఏఎస్‌జీ ఈ మేరకు ప్రకటన చేశారు.

సిసోడియాను నిరవధికంగా జైల్లో ఉంచలేం

న్యూఢిల్లీ: ఎక్సైజ్ పాలసీ కేసులను ఎదుర్కొంటున్న ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాను నిరవధికంగా జైల్లో ఉంచలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. మనీష్ సిసోడియా పెట్టుకున్న బెయిల్ పిటిషన్లపై జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం..సిసోడియాపై మోపిన అభియోగాలపై దిగువ కోర్టులో వాదనలు ఎప్పుడు ప్రారంభమవుతాయంటూ సీబీఐ, ఈడీల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజును ప్రశ్నించింది. 'సిసోడియాను ఈ విధంగా మీరు సుదీర్ఘ కాలం కటకటాల వెనుక ఉంచలేరు. ఒక కేసులో చార్జిషీటు వేశాక ఆ వెంటనే వాదనలు మొదలవ్వాలి. ఇప్పటిదాకా మీరు వాదనలను ఎందుకు ప్రారంభించలేదు? ఎప్పుడు మొదలవుతాయి? మాకు ఈ విషయం రేపటి(మంగళవారం) కల్లా చెప్పండి'అని ధర్మాసనం ఎస్‌వీ రాజును ఆదేశించింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ కింద సిసోడియాను ప్రాసిక్యూట్ చేయడానికి ముందుగా అనుమతి తీసుకున్నారా అని ధర్మాసనం ప్రశ్నించగా, రాజు అవునని బదులిచ్చారు. ఈ కేసులో మంగళవారం కూడా వాదనలు కొనసాగనున్నాయి. మార్చి 9వ తేదీన సిసోడియాను ఈడీ అధికారులు అరెస్ట్ చేసి, తీహార్ జైలులో ఉంచిన విషయం తెలిసిందే.

ఎంబీబీఎస్ విద్యార్థులకు స్టైపెండ్ చెల్లించండి

న్యూఢిల్లీ: దేశంలో 70 శాతం వైద్య కళాశాలలు ఎంబీబీఎస్ విద్యార్థులకు సక్రమంగా స్టైపెండ్ చెల్లించకపోవడంతో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంత జరుగుతున్నా జాతీయ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) ఏం చేస్తోందని నిలదీసింది. స్టైపెండ్ చెల్లించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రైవేట్ మెడికల్ కాలేజీ విద్యార్థుల నుంచి భారీగా డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేస్తుంటాయని పేర్కొంది. ఎంబీబీఎస్ విద్యార్థులు నిర్బంధ కార్మికులు కాదని తేల్చిచెప్పింది. వారికి తక్షణమే స్టైపెండ్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎంసీని ఆదేశించింది.


సురేంద్ర కోలీ


మణీందర్ సింగ్ పంథేర్

నిఠారి వరుస హత్యల కేసులో దోషులకు విముక్తి

అలహాబాద్ హైకోర్టు తీర్పు ● సరైన సాక్ష్యాధారాలు లేవని వ్యాఖ్య

ప్రయాగ్‌రాజ్/న్యూఢిల్లీ: 2006 నాటి నిఠారి వరుస హత్యల కేసులో నిందితులుగా మణీందర్ సింగ్ పంథేర్, పని మనిషి సురేంద్ర కోలీలకు అలహాబాద్ హైకోర్టు విముక్తి కల్పించింది. వారికి వ్యతిరేకంగా సరైన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. నోయిడాలోని ఓ బంగ్లా వెనుక 8 మంది చిన్నారుల ఎముకలు కనిపించడం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఇద్దరూ కలిసి పలువురు బాలికలపై లైంగికదాడికి, దారుణ హత్యలకు పాల్పడటంతోపాటు నరమాంస భక్షకులుగా మారినట్లు కూడా ఆరోపణలొచ్చాయి. అత్యాచారం, హత్య నేరాలకు పాల్పడిన వీరిద్దరికీ ఘజియాబాద్‌లోని సీబీఐ కోర్టు ఉరిశిక్ష విధించింది. దీనిని సవాల్ చేస్తూ పంథేర్, కోలీలు వేసిన పిటిషన్‌ను జస్టిస్ అశ్వనీ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్‌హెచ్‌ఏ రిజ్విల ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఎటువంటి సందేహాలకు తావు లేకుండా వీరిద్దరికీ వ్యతిరేకంగా కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైనట్లు ధర్మాసనం పేర్కొంది. అలహాబాద్ హైకోర్టు తాజా తీర్పుతో పంథేర్ జైలు నుంచి విడుదలయ్యేందుకు మార్గం సుగమమైందని ఆయన లాయర్ మనీషా భండారి చెప్పారు. అయితే, మరో కేసులో జీవిత ఖైదు శిక్షపడిన కోలీ మాత్రం జైలులోనే ఉంటాడని అన్నారు. తీర్పు ప్రతి అందాక తదుపరి చర్యపై నిర్ణయం తీసుకుంటామని సీబీఐ అధికారి ఒకరు తెలిపారు.2007లో పంథేర్, కోలీలపై 19 కేసులు నమోదయ్యాయి. అయితే, సాక్ష్యాలు దొరకలేదంటూ మూడు కేసుల్లో మాత్రమే సీబీఐ అభియోగ పత్రాలు నమోదు చేయగలిగింది. మిగతా 16 కేసులకుగాను మూడు కేసుల నుంచి కోలీ బయటపడ్డాడు. ఒక కేసులో విధించిన మరణశిక్షను కోర్టు జీవిత ఖైదుగా మార్చింది. కోలీకి విధించిన మరణశిక్షను జీవితఖైదుగా మార్చడాన్ని సవాల్ చేస్తూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం వేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. తాజాగా అలహాబాద్ కోర్టు తీర్పుతో 12 కేసుల నుంచి అతడికి విముక్తి లభించింది. అదే సమయంలో, పంథేర్‌పై ఉన్న ఆరు కేసుల్లో, ఒకటి సీబీఐ వేసింది కాగా, మరో అయిదు బాధితుల కుటుంబాలవి. గతంలో సెషన్స్ కోర్టు అతడిపై ఉన్న మూడు కేసులను కొట్టివేసింది. మిగతా మూడింటిలో 2009లో ఒకటి, తాజాగా అలహాబాద్ కోర్టు తీర్పుతో రెండు కేసుల నుంచి పంథేర్ బయటపడినట్లయిందని అతడి లాయర్ చెప్పారు. కోలీ ఘజియాబాద్ కారాగారంలో, అతడి మాజీ యజమాని పంథేర్ నోయిడా జైల్లో ఉన్నారు.

చీలిక దిశగా జేడీ(ఎస్)?

- ఎన్డీఏతో పొత్తుపై పొరపొచ్చాలు
- దానితో జత కట్టేందుకు వీల్లేదు
- కర్ణాటక జేడీ(ఎస్) చీఫ్ ఇబ్రహీం
- తమదే అసలు పార్టీ అని వాదన

బెంగళూరు: మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని జనతాదళ్ (సెక్యులర్) చీలిక దిశగా సాగుతున్నట్టు కన్పిస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకోవాలన్న ఆయన నిర్ణయాన్ని పార్టీ కర్ణాటక విభాగం అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి సి.ఎం.ఇబ్రహీం బాహాటంగా వ్యతిరేకించారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిలో తాను చేరబోయేది లేదని ఆయన సోమవారం కుండబద్దలు కొట్టారు. పైగా తమ వర్గమే సిసలైన జేడీ(ఎస్) అని ఆయన చెప్పుకొచ్చారు! "దేవెగౌడ, ఆయన తనయుడు, మాజీ సీఎం కుమారస్వామి బీజేపీతో జట్టు కట్టాలనుకుంటే అది వారిష్టం. మేం మాత్రం అందుకు మద్దతిచ్చేదే లేదు" అని స్పష్టం చేశారు. తద్వారా పార్టీలో చీలిక తప్పదని సంకేతాలిచ్చారు. రాష్ట్ర అధ్యక్షుని హోదాలో కర్ణాటక విభాగం విషయమై ఏ నిర్ణయమైనా తీసుకునేందుకు తనకు సర్వాధికారాలూ ఉన్నాయని తేల్చి చెప్పారు. బీజేపీతో పొత్తులను వ్యతిరేకిస్తూ పొరుగు రాష్ట్రాల్లో ఎందరో నేతలు పార్టీని వీడారని దేవెగౌడకు ఆయన గుర్తు చేశారు. కనుక బీజేపీతో పొత్తు యోచన మానుకోవాలని సూచించారు. "జేడీ(ఎస్) ఎప్పటికీ ఎన్డీఏతో కలవరాదనేదే మా తొలి నిర్ణయం. ఇక ఈ పొత్తుకు దేవెగౌడ అస్సలు అనుమతించరాదన్నది మా రెండో నిర్ణయం" అని పార్టీ నేతలతో భేటీ అనంతరం ఇబ్రహీం మీడియాకు తెలిపారు.


ఇబ్రహీం

ఆ ఊపిరి ఆపలేం!

- 26 వారాల గర్భాన్ని తొలగించడం కుదరదు
- గర్భిణి పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: 26 వారాల ఐదు రోజుల వయసున్న గర్భాన్ని తొలగించుకునేందుకు ఓ వివాహిత పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. "ఆమె ప్రసవానంతర కుంగుబాటుతో బాధపడుతుండటం వాస్తవమేనని ఎయిమ్స్ మెడికల్ బోర్డు తేల్చింది. అయితే గర్భస్థ శిశువు బాగానే ఉందని, ఆరోగ్యపరంగా అసాధారణ పరిస్థితులేమీ లేవని బోర్డు స్పష్టం చేసింది. ఆమె వాడుతున్న మందులు కూడా పిండం ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపేవేమీ కావని వెల్లడించింది. అంతేగాక పిండం వయసు వైద్యపరంగా అబార్షన్ (ఎంటీపీ)కి అనుమతించిన 24 వారాల గరిష్ట గడువును కూడా దాటేసింది. కనుక ఈ మేరకు నిర్ణయం తీసుకుంటున్నాం" అని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం ఈ మేరకు సోమవారం తీర్పు వెలువరించింది. "ఇప్పుడు అబార్షన్‌కు అనుమతించడం భ్రూణ హత్యతో సమానం. ఎంటీపీ చట్టంలోని 3, 5 సెక్షన్లను ఉల్లంఘించడమే. సదరు మహిళ ఆస్పత్రి ఖర్చులన్నింటినీ ఎయిమ్స్ భరిస్తుంది. చిన్నారిని పెంచుకోవడమా, దత్తతకివ్వడమా అనేది ప్రసవానంతరం తల్లిదండ్రులు నిర్ణయించుకోవచ్చు" అని స్పష్టం చేసింది. ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్డీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా కూడా ఉన్నారు. ఇప్పటికే తనకిద్దరు పిల్లలని, 2022 సెప్టెంబర్‌లో రెండో కాన్పు అనంతరం కుంగుబాటుకు గురయ్యానని పేర్కొంటూ ఓ 27 ఏళ్ల గర్భిణి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మూడో బిడ్డను కని పెంచే శారీరక, ఆర్థిక, భావోద్వేగపరమైన స్తోమత లేనందున అబార్షన్‌కు అనుమతించాలని కోరింది. ఆమెను పరీక్షించిన ఎయిమ్స్ బృందం నివేదిక ఆధారంగా ఆమె 26 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు అక్టోబర్ 9న సుప్రీంకోర్టు అనుమతించడం తెలిసిందే. ఈ తీర్పును వెనక్కు తీసుకోవాలంటూ కేంద్రం పిటిషన్ వేసింది. పిండం బాగానే ఉందని, చక్కగా ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొంటూ ఎయిమ్స్ బృందంలోని ఒక వైద్యుడు సుప్రీంకోర్టుకు అక్టోబర్ 6న పంపిన ఈ మెయిల్‌ను ఉటంకించింది. ఈ నేపథ్యంలో దీనిపై పునర్విచారణ జరిపిన జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ బి.వి. నాగరత్న ద్విసభ్య ధర్మాసనం తొలుత అబార్షన్‌కు అనుమతించినా, బుధవారం భిన్నమైన తీర్పు వెలువరించింది. దాంతో కేసు సీజేఐ ధర్మాసనం ముందుకొచ్చింది.

చట్టమూ అంగీకరించదు...

వివాహితలకు అబార్షన్ చేసుకునేందుకు ఎంటీపీ చట్టం ప్రకారం అనుమతించిన గరిష్ట గడువు 24 వారాలు. అత్యాచార బాధితులు, దివ్యాంగులు, మైనర్ల వంటి బాధిత మహిళలకు ఇందుకు మినహాయింపు ఉంటుంది. ఈ గడువును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విడిగా విచారిస్తామని సీజేఐ ధర్మాసనం స్పష్టం చేసింది.

లూటీకి మాత్రమే కాంగ్రెస్ గ్యారెంటీ

బీజేపీ చీఫ్ జేపీ నడ్డా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై బీజేపీ చీఫ్ జేపీ నడ్డా నిప్పులు చెరిగారు. ఆ పార్టీ లూటీకి మాత్రమే గ్యారెంటీ ఇస్తుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారానికి అవసరమైన డబ్బు వసూళ్ల కోసం కర్ణాటకను ఆ పార్టీ ఏటీఎంలా మార్చేయడం సిగ్గు చేటన్నారు. కర్ణాటకలోని కొందరు కాంట్రాక్టర్ల నివాసాలపై దర్యాప్తు సంస్థల్లో సుమారు రూ.100 కోట్ల అక్రమసొత్తును బయటపడినట్లుగా వచ్చిన వార్తలపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అవినీతి డీఎన్ఏకి ఇది ఒక చిన్న మచ్చుతునక మాత్రమేనని ఆయన సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాంగ్రెస్ మద్దతుదారులైన ఈ కాంట్రాక్టర్లే గత బీజేపీ ప్రభుత్వం కమీషన్లు వసూలు చేస్తోందంటూ ఆరోపణలు చేశారని ఆయన గుర్తు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అవినీతి పెచ్చుమీరిందని ఆరోపించారు.'కాంగ్రెస్, అవినీతి ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు. ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లను కూడా కాంగ్రెస్ అవినీతికి ఏటీఎంలుగా మార్చుకుంది. ఇప్పుడు తెలంగాణ, మధ్యప్రదేశ్‌లను కూడా ఏటీఎంలుగా మార్చి ప్రజా సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధికి ఉద్దేశించిన ధనాన్ని దోచుకోవాలని కలలుగంటోంది. కాంగ్రెస్ లూటీకి మాత్రమే గ్యారెంటీ ఇవ్వగలదు'అని నడ్డా ఆరోపించారు. హామీలు ఇవ్వడంలో ఆరితేరిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఓ అడుగు ముందుకేసి హామీలకు బదులు గ్యారెంటీలిస్తోందని ఆయన ఎద్దేవా చేశారు.

ఎలక్టోరల్ బాండ్లపై విస్తృత ధర్మాసనం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీల నిధుల సమీకరణ కోసం చేసే ఎలక్టోరల్ బాండ్ల జారీ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణకు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. దీనిపై దాఖలైన 4 ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై అక్టోబర్ 31, నవంబర్ 1 తేదీల్లో ధర్మాసనం తుది విచారణ జరపనుంది. సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం సోమవారం ఈ మేరకు పేర్కొంది. దీన్ని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారిస్తుందని తొలుత ధర్మాసనం పేర్కొనడం తెలిసిందే. "కానీ విషయ తీవ్రత, ప్రాధాన్యం దృష్ట్యా సుప్రీంకోర్టు కార్యకలాపాలను నియంత్రించే ఆర్టికల్145(4) ప్రకారం కనీసం ఐదుగురు జడ్జిల ధర్మాసనం దీనిపై వాదనలు ఆలకిస్తుంది" అని తాజాగా వివరించింది. 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలక్టోరల్ బాండ్ల పథకం మళ్లీ తెరపైకి రాకముందే ఈ కేసును తేల్చేయాలని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అక్టోబర్ 10న ధర్మాసనాన్ని అభ్యర్థించారు. బాండ్ల ద్వారా ఇలాంటి అనామక నిధుల ప్రవాహం ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరిగి దేశం అవినీతిరహితంగా మారాలన్న ఆశయానికి తూట్లు పొడుస్తోందని ఆయన ఆరోపించారు. దాంతో ఈ పిటిషన్లపై విచారణను అక్టోబర్ 31న మొదలు పెట్టి నవంబర్ 1కల్లా ముగిస్తామని ధర్మాసనం ప్రకటించింది.

2018లో తెరపైకి...

పార్టీల నిధుల సమీకరణలో పారదర్శకత కోసమని 2018 జనవరి 2న కేంద్రం ఈ ఎలక్టోరల్ బాండ్ల పథకం తెచ్చింది. దీని ప్రకారం పార్టీలు నగదుకు బదులుగా బాండ్ల రూపంలో విరాళాలు స్వీకరిస్తాయి. భారత పౌరులు, సంస్థలు బాండ్లను కొనుగోలు చేయవచ్చు. ఈ రూపంలో పార్టీలకు ఇప్పటిదాకా ఏకంగా రూ.12,000 కోట్లు అందాయని పిటిషన్‌దారుల్లో ఒకరు పేర్కొన్నారు. వీటిలో మూడింట రెండొంతుల మొత్తం ఒకే పార్టీకి చేరిందన్నారు! ఎలక్టోరల్ బాండ్ల సేకరణపై నిషేధం విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వాలన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు రెండు సార్లు తోసిపుచ్చింది.

ఐటీ సోదాల్లో రూ.102 కోట్ల సొత్తు స్వాధీనం

న్యూఢిల్లీ: కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న సోదాల్లో ఇప్పటి వరకు రూ.102 కోట్ల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం ఆదాయ పన్ను(ఐటీ)శాఖ తెలిపింది. ఈ నెల 12వ తేదీ నుంచి బెంగళూరు సహా 55 ప్రాంతాల్లో దాడులు జరిపి లెక్కల్లో చూపని రూ.94 కోట్ల నగదుతోపాటు రూ.8 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు, 30 ఖరీదైన విదేశీ తయారీ గడియారాలు కలిపి మొత్తం రూ.102 కోట్ల సొత్తును పట్టుకున్నామని వివరించింది. అక్రమ సొత్తుకు సంబంధించి డాక్యుమెంట్ల హార్డు కాపీ, డిజిటల్ డేటా తదితర సాక్ష్యాధారాలను కూడా చేజిక్కించుకున్నామని తెలిపింది. బోగస్ కొనుగోలు రసీదుల ద్వారా భారీగా పన్ను ఎగవేతకు గురైనట్లు కూడా గుర్తించామంది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
మంగళవారం । 17 । అక్టోబర్ । 2023

జాలర్ల విడుదలపై కేంద్ర మంత్రికి సీఎం లేఖ

సాక్షి, చెన్నై: రామేశ్వరం జాలర్లు 27 మందిని శ్రీలంక నావికాదళం బందీలుగా పట్టుకెళ్లిన విషయం తెలిసిందే. దీంతో వారిని విడుదల చేయాలని రామేశ్వరం జాలర్లు సోమవారం సమ్మెకు దిగారు. జాలర్ల విడుదల కోసం కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జయ శంకర్‌కు సీఎం స్టాలిన్ లేఖ రాశారు. తరచూ శ్రీలంక నావికాదళం జరుపుతున్న దాడుల వివరాలను అందులో పొందుపరిచారు. జాలర్లకు సముద్రంలో భద్రత కల్పించాలని కోరారు. తరచూ జరుగుతున్న దాడులో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బ తింటోందని ఆందోళన వ్యక్తంచేశారు. దాడులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు.

ఇస్రోకు సంపూర్ణ సహకారం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు తమిళనాడు ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. కులశేఖర పట్నంలో నిర్మిస్తున్న (వెహికల్ లాంచింగ్ స్టేషన్) ఉపగ్రహ ప్రయోగ కేంద్రానికి 2 వేల ఎకరాల స్థలాన్ని సోమవారం సీఎం కేటాయించారు. భవిష్యత్‌లో మరింతగా తోడ్పాటు అందిస్తామని వెల్లడించారు.

- సీఎం స్టాలిన్ వెల్లడి
- కుల శేఖర పట్నంలో 2 వేల ఎకరాల స్థలం అప్పగింత
- ముఖ్యమంత్రితో సమావేశమైన ఇస్రో చైర్మన్ సోమనాథ్

సాక్షి, చెన్నై: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీహరికోటకు ప్రత్యామ్నాయంగా తూత్తుకూడి జిల్లా తిరుచెందూరుకు సమీపంలోని కులశేఖరపట్నం అంతరిక్ష ప్రయోగ కేంద్రానికి ఇస్రో చర్యలు చేపట్టిన విష యం తెలిసిందే. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన 2 వేల ఎకరాల స్థలాన్ని ఇస్రోకు సోమవారం అప్పగించారు. ఇందులో భాగంగా సచివాలయంలో సీఎం స్టాలిన్‌తో ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్ భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో సోమ నాథ్ మాట్లాడుతూ, కుల శేఖర పట్నంలో రెండవ రాకెట్ ప్రయోగం కేంద్రానికి 2 వేల ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ తమిళనాడు ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఆది నుంచి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని వెల్లడించారు. కులశేఖరపట్నంలో సంపూర్ణ తోడ్పాటు అందిస్తామని సీఎం స్పష్టం చేసినట్టు ఆయన తెలిపారు. అంతరిక్ష సంబంధిత పరికరాల ఉత్పత్తిలో, పరిశ్రమల స్థాపనలో తమిళనాడు దూసుకెళ్తోందన్నారు. కులశేఖరపట్నంలో చిన్నచిన్న ఉపగ్రహాలను ప్రయోగించేందుకు అనుకూలమైన వాతావరణం ఉన్నట్లు వివరించారు. ఇక్కడ ఇతర నిర్మాణాలకు అనుమతులు, విద్యుత్ సౌకర్యం తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లామని సోమనాథ్ తెలిపారు.


ప్రత్యేక ప్రతిభావంతుల సలహా మండలి సమావేశంలో సీఎం స్టాలిన్ సమావేశం

దివ్యాంగుల హక్కులను పరిరక్షణకు కమిటీ

అనంతరం సచివాలయంలో ప్రత్యేక ప్రతిభావంతుల సలహామండలితో సీఎం స్టాలిన్ సమావేశమయ్యారు. సలహా మండలి సభ్యులు, అధికారులు, ప్రత్యేక ప్రతిభావంతుల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రూ. 1,773 కోట్లతో ప్రత్యేక పథకాలను అమలు విస్తృతం చేయనున్నామన్నారు. అలాగే, ఉద్యోగ అవకాశాల్లో 4 శాతం రిజర్వేషన్ గురించి చర్చించారు. ప్రత్యేక ప్రతిభావంతుల బోర్డు కమిషనర్‌తో పాటు 12 విభాగాల కార్యదర్శులతో, ప్రత్యేక ఆహ్వానితులుగా ముగ్గురు ఎమ్మెల్యేలతో కూడిన కమిటీని ఈ సందర్భంగా సీఎం ప్రకటించారు. ఈ కమిటీ ప్రత్యేక ప్రతిభావంతుల హక్కుల సాధణ తదితర అంశాలపై చర్చించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని సీఎం వివరించారు. ప్రత్యేక ప్రతిభావంతులకు తోడ్పాటు అందించడం, వారి సంక్షేమమే లక్ష్యంగా, హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం ముందుంటుందని సీఎం ప్రకటించారు. ఏ ఒక్క ప్రత్యేక ప్రతిభావంతుడు మనోవేదనకు గురి కాకుడదని, ప్రభుత్వ పథకాలు దరి చేరాలన్నదే తన ఆకాంక్షగా పేర్కొన్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల కోసం ఇంటిగ్రేటెడ్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటు విస్తృతం కానున్నట్టు ప్రకటించారు.

ప్రభుత్వ న్యాయవాదుల ఫీజుల పెంపు

రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదులకు ఫీజులను రెట్టింపు చేస్తూ సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారం విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మునిసిపల్, మేజిస్ట్రేట్ కోర్టుల నుంచి హైకోర్టు వరకు ప్రభుత్వం తరపున కేసులను విచారించే పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ఫీజు పెంపు విషయంగా సచివాలయంలో అధికారులతో సీఎం సమీక్షించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వ న్యాయవాదులకు సీఎం అందజేశారు. వివిధ కోర్టుల్లో ప్రభుత్వం తరపున కేసును వాదించేందుకు 700 మందికి పైగా ప్రభుత్వ న్యాయవాదులు ఉన్నట్టు గుర్తుచేశారు. వీరికి 2006లో ఫీజు పెంపు నిర్ణయాన్ని అప్పటి సీఎం కలైంజ్ఞర్ కరుణానిధి తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఎలాంటి పెంపూ చేపట్టని దృష్ట్యా, ప్రస్తుతం రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించారు. హైకోర్టు మినహా దాని పరిధిలోని సివిల్ , క్రిమినల్, తదితర కేసులలో హాజరు అవుతున్న ప్రభుత్వ న్యాయవాదులకు ఈ పెంపు ప్రయోజనకరంగా ఉంటుందని సీఎం ప్రకటించారు.


సీఎం స్టాలిన్‌తో ఇస్రో చైర్మన్ సోమనాథ్

ప్రజ్ఞానందతో భేటీ

ముందుగా చెన్నైకు వచ్చిన సోమనాథ్ చెస్ యువ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానందతో భేటీ అయ్యారు. తనను ఇస్రో చైర్మన్ కలవడం ఎంతో ఆనందంగా ఉందని ప్రజ్ఞా పేర్కొన్నాడు. తన చెస్ పయనం, శిక్షణ గురించి సోమనాథ్‌కు వివరించినట్టు తెలిపారు. తిరువనంతపురం, శ్రీహరికోటలో పరిశోధన కేంద్రాలను సందర్శించాలని తనను ఆహ్వానించినట్లు వివరించారు. సోమనాథ్ మాట్లాడుతూ, ప్రజ్ఞానంద రికార్డులను గుర్తు చేస్తూ, నింగిలో ఓ ప్రజ్ఞా, భూమి మీద మరో ప్రజ్ఞా అని వ్యాఖ్యానించారు. విజ్ఞానం, సాంకేతిక అంశాలలో యువత సహకారంతో ఇండియాను శక్తివంతంగా మార్చేందుకు ఇస్రోతో కలిసి ప్రజ్ఞానంద పనిచేయనున్నాడని ప్రకటించారు.


సీఎం స్టాలిన్‌తో ప్రభుత్వ న్యాయవాదులు

న్యూస్‌రీల్

వేడుకగా దేవి నవరాత్రి ఉత్సవాలు


పార్వతీదేవి అలంకరణలో గంగాధరేశ్వరస్వామి

తిరుత్తణి: పళ్లిపట్టు సమీపం నొచ్చిలిలోని గిరిరాజ కన్యకాపరమేశ్వరి సమేత గంగాధరేశ్వర స్వామి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గంగాధరేశ్వరస్వామికి అభిషేక పూజలు చేపట్టారు. అదే సమయంలో కన్యకాపరమేశ్వరికి పార్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రెండవ రోజైన సోమవారం శ్రీ కామాక్షి దేవి అలంకరణలో అనుగ్రహించారు. ఆలయ పారంపర్య ధర్మకర్త ఎన్.ఎమ్.గిరిరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు వేడుకలను పర్యవేక్షించారు.

15 మందితో సిరియా పాణి పయనం

సాక్షి, చెన్నై: తమిళనాడులోని నాగపట్నం నుంచి శ్రీలంకలోని కాంగేశం హార్బర్‌కు వెళ్లే ప్రయాణికుల నౌకకు స్పందన కరువైంది. సోమవారం కేవలం 15 మందితో ఈ నౌక కాంగేశానికి బయలుదేరింది. వివరాలు.. నాలుగు దశాబ్దాల అనంతరం తమిళనాడు – శ్రీలంక మధ్య ప్రయాణికుల నౌక నడిపేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవల చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. 150 మంది ప్రయాణించేందుకు వీలు ఈ నౌకలో ఏర్పాట్లు ఉన్నాయి. అయితే తొలిరోజైన శనివారం నాగపట్నం నుంచి 50 మంది ప్రయాణించారు. కాంగేశం నుంచి 30 మంది తిరుగు పయనంలో ఇక్కడికి వచ్చారు. రెండో రోజు ఏడుగురు ప్రయాణికులు మాత్రమే ఉండడంతో సేవను రద్దు చేశారు. దీంతో సోమ, బుధ, శుక్రవారానికే ఈ నౌక సేవలను పరిమితంచేశారు. ఈమేరకు సోమవారం 15 మంది ప్రయాణికులతో కాంగేశంకు నౌక బయలుదేరి వెళ్లింది. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో 20 మంది ప్రయాణించారు. డీజిల్ ఖర్చులకు తగ్గట్టుగా కూడా ప్రయాణికుల సంఖ్య లేక పోవడంతో ప్రత్యామ్నాయంపై అధికారులు దృష్టి పెడుతున్నారు. వీసా, పాస్ పోర్టు వంటి నిబంధనలే ఈ పరిస్థితికి కారణమని అధికారులు భావిస్తున్నారు.

చిరు వ్యాపారులకు సీఎం భరోసా


సీఎంతో భేటీ అయిన వర్తక సంఘాల ప్రతినిధులు

సాక్షి, చెన్నై: అసెంబ్లీ వేదికగా చిరు వర్తకులకు భరోసా ఇస్తూ సీఎం స్టాలిన్ ప్రత్యేక ప్రకటనను గత వారం చేసిన విషయం తెలిసిందే. తమిళనాడు ప్రభుత్వానికి వ్యాపారులు చెల్లించాల్సిన పన్ను బకాయిలను ఈ ప్రకటనలో ఆయన గుర్తు చేశారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న వారికి కాస్త ఊరట కల్పించడంతోపాటుగా చిరు వర్తకులకు చేయూతనిస్తామని పేర్కొన్నారు. ఈమేరకు రూ. 50 వేలలోపు పన్ను బాకాయిలు, వడ్డీ చెల్లించాల్సి ఉంటే, వాటిని రద్దు చేస్తున్నామని ప్రకటించారు. ప్రభుత్వ మార్గ దర్శకాలకు అనుగుణంగా త్వరితగతిన చెల్లించే వారికి రాయితీలు ఉంటాయని వివరించారు. దీనిని సోమవారం అమల్లోకి తీసుకొస్తూ సీఎం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు వర్తక సంఘాల ప్రతినిధులతో సమావేశమై పలు సూచనలు చేశారు.

తిరువణ్ణామలై ప్రమాద మృత దేహాలు కర్ణాటకకు తరలింపు


మృతదేహాలను తరలిస్తున్న సిబ్బంది

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా సెంగం సమీపంలోని జాతీయ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏడుగురి మృతదేహాలను అధికారులు కర్ణాటకకు తరలించారు. ఈ ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం టుముకూరుకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన శ్రీనివాసన్, మణిగండన్, హేమంత్, సతీష్‌కుమార్, సర్వేశ్వరన్, సింధు అక్కడికక్కడే మృతి చెందారు. సతీష్‌కుమార్ భార్య కావ్య(32) తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా మృతదేహాలకు సోమవారం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి నివాళులు అర్పించారు. ఆయనతో పాటు కలెక్టర్ మురుగేష్, ఎస్పీ కార్తికేయన్, ఎంపీ అన్నాదురై, ఎమ్మెల్యే గిరి, మున్సిపల్ చైర్మన్ రాజరంగన్ ఉన్నారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో ఏడుగురి మృత దేహాలను వేర్వేరు అంబులెన్స్‌లలో సొంత గ్రామానికి తరలించారు.

రెండేళ్ల అనంతరం సేలానికి విమాన సేవలు


విమానానికి జెండా ఊపుతున్న మంత్రులు

- తొలి విమానం ల్యాండింగ్
- కేక్ కట్ చేసిన మంత్రులు

సాక్షి,చెన్నై : రెండేళ్ల అనంతరం సేలానికి వివిధ ప్రాంతాల నుంచి విమాన సేవలకు సోమవారం శ్రీకారం చుట్టారు. బెంగళూరు నుంచి తొలి విమానం ఉదయం ల్యాండింగ్ అయ్యింది. ఈ సందర్భంగామంత్రులు నెహ్రూ, చక్రపాణి, ఎంపీ పార్తీబన్ కేక్ కట్‌చేసి అందరికీ పంచి పెట్టారు. వివరాలు.. సేలంలో 1993లో విమానాశ్రయం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తొలుత ఇక్కడకు విమానాలు నడిపేందుకు ఏ ఒక్క సంస్థ ముందుకు రాలేదు. నిరుపయోగంగా ఉన్న ఈ విమానాశ్రయంలో 2006లో కొంత కాలం విమానాల టేకాఫ్, ల్యాండింగ్ జరిగింది. ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండడంతో సేవలను రద్దు చేశారు. 2017లో సేలంకు చెందిన ఎడపాడి కె. పళని స్వామి సీఎం పగ్గాలు చేపట్టడంతో ఈ విమానాశ్రయం, పరిసరాలు మరింత అభివృద్ధి చెందాయి. ఆయన విమానంలోనే తన సొంత జిల్లాకు తరచూ ప్రయాణించేవారు. 2018 నుంచి 2021 వరకు ఇక్కడ విమాన సేవలు ఉడాన్ పథకం మేరకు విస్తృతంగానే జరిగాయి. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాగానే, సేలానికి విమాన సేవలు ఆగిపోయాయి. ఎట్టకేలకు ప్రభుత్వ వర్గాలు చేపట్టిన చర్యలతో సేలంకు రెండేళ్ల అనంతరం విమాన సేవలను పునరుద్ధరించారు. ఓమలూరులోని విమానాశ్రయానికి సోమవారం ఉదయం బెంగళూరు నుంచి తొలి విమానం వచ్చింది. ఇందులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. సేలంలో ల్యాండింగ్ అనంతరం ఈ విమానం కేరళ వైపుగా టేకాఫ్ తీసుకుంది. ఈ సందర్భంగా మంత్రులు, అధికారులు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ప్రయాణికులను ఆహ్వానించారు. వివిధ నగరాల నుంచి సేలానికి విమాన సేవలు క్రమంగా విస్తృతం అవుతాయని మంత్రులు ప్రకటించారు.


ప్రయాణికులకు స్వీట్ల పంపిణీ

తొమ్మిది సీట్లతో సర్దుకుందాం?

- బీజేపీ పునరాలోచన
- అన్నాడీఎంకేతో రాయబారానికి యత్నం

సాక్షి, చెన్నై: ఏకంగా 20 ఎంపీ సీట్లను ఆశించిన బీజేపీ తాజాగా 9 సీట్లతో సర్దుకునే ప్రయత్నంలో ఉన్నట్లు సంకేతాలు వెలువడ్డాయి. ఈ విషయంపై అన్నాడీఎంకేతో రాయబారానికి యత్నిస్తున్నట్లు సమాచారం. వివరాలు.. కేంద్రంలోని ఎన్‌డీఏ కూటమి నుంచి అన్నాడీఎంకే ఇటీవల బయటకు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో తమకు తప్పదని బీజేపీ సీనియర్ నేతలు పేర్కొంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక ప్రతినిధి సంతోష్ రాష్ట్ర నేతలతో గత రెండు రోజులుగా సమావేశాలు చెన్నైలో నిర్వహించారు. ఇందులో బీజేపీ నేతలు ఓ మెట్టుదిగి వచ్చినట్టు సమాచారం. 20 సీట్లను ఆశించకుండా తమకు బలం ఉన్నట్టుగా పేర్కొంటున్న దక్షిణచెన్నై, తిరుచ్చి, కోయంబత్తూరు, నీలగిరి, తిరుప్పూర్, చిదంబరం, తిరునల్వేలి, కన్యాకుమారి, రామనాథపురం వంటి 9 స్థానాలను అన్నాడీఎంకే నుంచి రాబట్టుకుంటే చాలనే నిర్ణయానికి వచ్చినట్టు సంకేతాలు వెలువడ్డాయి. కూటమిలోని మిగిలిన పార్టీలకు అన్నాడీఎంకే సీట్లను పంచి పెట్టే విధంగా కొన్ని స్థానాలను ఎంపిక చేసినట్లు ఇప్పటికే ప్రచారం సాగుతోంది. ఇందులో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామికి ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న మాజీ సీఎం పన్నీరు సెల్వం, అమ్మ మక్కల్‌మున్నేట్ర కళగం నేత దినకరన్ శిబిరం కూడా ఉండటం గమనార్హం. బీజేపీతో పాటు ఇతర మిత్రులకు మొత్తంగా 15 స్థానాలు వెళ్లినా, మిగిలిన 24 స్థానాలలో రాష్ట్రంలో అన్నాడీఎంకే పోటీ చేసుకునే అవకాశం కల్పించే విధంగా వ్యూహ రచన చేసినట్టు సమాచారం. ఇదే అంశాలతో పళనిస్వామి వద్దకు రాయబారులను పంపించే దిశగా బీజేపీ కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. అయితే బీజేపీతో పన్నీరు, దినకరన్ టచ్‌లో ఉండడంతో పళని శిబిరం ఈ ప్రతిపాదనపై ఎలా స్పందిస్తుందనే ఉత్కంఠ ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొంది.

ఓలా, ఉబర్ డ్రైవర్లు సమ్మె

– ప్రయాణికుల అవస్థలు

కొరుక్కుపేట: చెన్నై సహా ప్రధాన నగరాల్లో ఓలా, ఉబర్ యాప్ ద్వారా కార్లు, ఆటోలను బుక్ చేసుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. బస్సు, రైలు స్టేషన్‌లు , విమానాశ్రయానికి వెళ్లేవారు సకాలంలో అక్కడికి చేరుకునేందుకు ఈ యాప్‌లనే ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓలా, ఉబర్ డ్రైవర్లు సోమవారం సమ్మెకు దిగారు. అద్దె వాహనాలను నియంత్రించడం, బైక్ ట్యాక్సీలను నిషేధించడం, మీటర్ చార్జీలు విధించడం వంటి పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కోయంబేడు బస్టాండు, సెంట్రల్, ఎగ్మూర్, తాంబరం రైల్వే స్టేషన్లలో రద్దీ నెలకొంది. ఆల్ వెహికల్ డ్రైవర్స్ అసోసియేషన్ సహా 14 అసోసియేషన్లు సమ్మెలో పాల్గొన్నాయి.

హైకోర్టుకు ఇద్దరు అదనపు న్యాయమూర్తులు

సాక్షి, చెన్నై: మద్రాసు హైకోర్టుకు ఇద్దరు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. వీరితో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్వీ గంగాపూర్వాల ప్రమాణ స్వీకారం చేయించారు. వివరాలు.. హైకోర్టులో ఖాళీల భర్తీ దిశగా సుప్రీంకోర్టు కొలీజియం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఇటీవల కాలంగా అదనపు న్యాయమూర్తుల నియామకాలు జరుగుతున్నాయి. అలాగే, అదనపు న్యాయమూర్తులు పలువురు పూర్తిస్థాయి న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టుకు అదనపు న్యాయమూర్తులుగా జి. అరుల్ మురుగన్, ఎన్. సెంథిల్‌కుమార్‌ను సుప్రీంకోర్టు కొలీజియం ఎంపిక చేసింది. ఈ సిఫార్సులకు రాష్ట్రపతి భవన్ ఆమోద ముద్ర వేసింది. దీంతో కొత్త న్యాయమూర్తులతో హైకోర్టు ఆవరణలో ప్రధాన న్యాయమూర్తి ఎస్వీ గంగాపూర్వాల ప్రమాణ స్వీకారం చేయించారు. వీరికి సీనియర్ న్యాయమూర్తులు, న్యాయ వాద సంఘాల నేతలు, ప్రభుత్వ న్యాయవాదులు శుభకాంక్షలు తెలియజేశారు. అనంతరం తమకు కేటాయించిన బెంచ్‌లలో అదనపు న్యాయమూర్తులు బాధ్యతలు స్వీకరించారు.



న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం

3 జిల్లాలకు ఆరంజ్ అలర్ట్




కన్యాకుమారిలో వర్షాలు

- మరో 14 జిల్లాల్లో మోస్తరు వర్షాలు
- తిరుప్పూర్‌లో షెల్టర్ కూలి ముగ్గురి మృతి
- నేడు అరేబియా సముద్రంలో అల్పపీడన ద్రోణి?

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా కన్యాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాలకు ఆరంజ్ అలర్ట్ ప్రకటించారు. మరో 14 జిల్లాల్లో మోస్తరుగా వర్షాలు పడనున్నట్లు వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇక మంగళవారం అరేబియా సముద్రంలో అల్పపీడన ద్రోణి ఏర్పడే అవకాశం ఉంది. వివరాలు.. ఈశాన్య రుతు పవనాల సీజన్ మరో వారం రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. ఇందుకు శుభ సూచికంగా పశ్చిమ పర్వత శ్రేణులోని కన్యాకుమారి జిల్లాలను గత రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. ఫలితంగా ఇప్పటికే వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. అలాగే తేని, దిండుగల్ జిల్లాలో మోస్తరుగా వర్షం పడుతోంది. ఉపరితల ఆవర్తనంతో పాటు అరేబియా సముద్రంలో అల్పపీడన ద్రోణి ఏర్పడే అవకాశం ఉండడంతో కన్యాకుమారి, తిరునల్వేలి, తెన్‌కాశి జిల్లాలకు ఆరంజ్ అలర్ట్ ప్రకటించారు. ఇక్కడ మంగళవారం కొన్నిచోట్ల అతి భారీ వర్షం పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

మరో 14 జిల్లాలో..

కరూర్, దిండుగల్‌లలో సోమవారం అనేక చోట్ల భారీగా వర్షం కురిసింది. దీంతో ఇక్కడ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అలాగే కోయబంత్తూరు, నీలగిరి, తేని, మదురై, విరుదునగర్, తూత్తుకుడి, రామనాధపురం, శివగంగై, పుదుకోట్టై, తంజావూరు, నాగపట్నం, మైలాడుతురై, తిరువారూర్‌లో కొన్నిచోట్ల చెదురుముదురు వర్షం పడింది. మరో రెండు రోజుల పాటు ఈ జిల్లాలో కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఇక చెన్నై, శివారు జిల్లాల్లో ఆకాశం మేఘావృతంగా ఉండి, అక్కడక్కడ వర్షం పడే సూచనలు కనిపిస్తున్నాయి. గడిచిన 24 గంటల్లో తేనిజిల్లా పెరియకులంలో 14 సెం.మీ, మదురై జిల్లా పేరయూరులో 10 సె.మీ వర్షం పడింది. తెన్‌కాశి, తిరునల్వేలి, కన్యాకుమారికి ఆరంజ్ అలర్ట్ నేపథ్యంలో ఆయా జిల్లాల యంత్రాంగం ముందు జాగ్రత్తలపై దృష్టి పెట్టింది. ఇదిలా ఉండగా, మదురై జిల్లాలో సంవృద్ధి వర్షాలు పడాలని కాంక్షిస్తూ, తిరుమంగలం గోపయ్య స్వామి కొండపై వంటా వార్పు చేపట్టారు.

ముగ్గురు మృతి

తిరుప్పూర్ జిల్లా ఉడుమలై పరిసరాల్లో ఆదివారం రాత్రంతా వర్షం పడింది. ఇక్కడ రోడ్డు పక్కగా అక్కడక్కడ షెల్టర్లు ఉన్నాయి. ఇవన్నీ చాలాకాలం క్రితం నిర్మించినవి. కొలుమందై గ్రామానికి చెందిన కూలి కార్మికులు మురళీ రాజ(35), మణి కండన్(28), గౌతం(29)లు సోమవారం ఉదయాన్నే పళని రోడ్డులోని ఓ షెల్టర్‌లో దలచుకున్నారు. ఈక్రమంలో పైకప్పు కూలడంతో శిథిలాల కింద చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో ముగ్గురు కూలీలు మృతి చెందారు. ఈసమాచారంతో సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన సానుభూతిని తెలియజేస్తూ, తలా రూ. 2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

చిన్నారి కిడ్నాప్

- నాలుగు గంటల్లో రక్షించిన పోలీసులు

సాక్షి, చెన్నై: చెన్నై ఎంజీఆర్ సెంట్రల్ రైల్వే స్టేషన్ కిడ్నాప్‌కు గురైన ఏడాది బిడ్డను చెన్నై పోలీసులు నాలుగు గంటలో రక్షించారు. ఈ కేసులో సీసీ కెమెరాలు, ఆటో డ్రైవర్ సహకారం కీలకంగా మారింది. ఒడిశాకు చెందిన దంపతులు లంకేశ్వర్, నందిని తమ ఏడాది బిడ్డతో ఆదివారం అర్ధరాత్రి చెన్నైకు వచ్చారు. రైల్వే స్టేషన్‌లోనే నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో తమతో ఉన్న బిడ్డ కనిపించక పోవడంతో ఆందోళనకు గురయ్యారు. తక్షణం అక్కడున్న భద్రతా సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు సీసీ కెమెరాలను పరిశీలించారు. ఓ వ్యక్తి బిడ్డను తీసుకెళ్తుండజం గుర్తించారు. రెండున్నర గంటల సమయంలో చెన్నై పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు వేగవంతం చేశారు. బిడ్డను ఆటోలో ఎక్కించుకు వెళ్లినట్లు తేలింది. ఆటో నంబర్ ఆధారంగా డ్రైవర్ వద్ద వివరాలు సేకరించారు. తన ఆటోలో వచ్చిన వాళ్లు కుంద్రత్తూరులో ఓ ప్రాంతం వద్ద దిగి వెళ్లినట్టు ఆటో డ్రైవర్ సమాచారం ఇచ్చాడు. అంతే కాకుండా ఆ బిడ్డ కోసం పోలీసులతో కలిసి ఆటో డ్రైవర్ ఆ ప్రాంతానికి వెళ్లాడు. పోలీసులతో కలిసి ఇంటింటా తనిఖీలు చేశారు. ఓ ఇంట్లో తన ఆటోలో ప్రయాణించిన వ్యక్తి ఉండడాన్ని డ్రైవర్ గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు జార్ఖండ్‌కు చెందిన ప్రభాస్‌గా గుర్తించారు. అతడితో పాటు ఉన్న నమిత అనే మహిళను అదుపులోకి తీసుకుని విచారించారు. రెండున్నర గంటలకు కేసును తమ గుప్పెట్లోకి తీసుకున్న పోలీసులు ఉదయం ఆరున్నర గంటలకు విజయవంతంగా ముగించారు. నాలుగు గంటల్లో కేసును ఛేదించి తల్లిదండ్రులకు బిడ్డను అప్పగించారు.

క్లుప్తంగా

వినతులపై సత్వర పరిష్కారం


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కలైసెల్వి

కాంచీపురం: కాంచీపురం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. కలెక్టర్ కలైసెల్వి అర్జీలు స్వీకరించి వాటిని ఆయా శాఖాధికారులకు పంపారు. విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌డేలో మొత్తం 450 మంది వినతిపత్రాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. డీఆర్‌ఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరికరాల వితరణ


కంప్యూటర్‌ను అందజేస్తున్న అనిల్ కుమార్ రెడ్డి

కొరుక్కుపేట: తెలుగు మహాజన సమాజం అధ్యక్షుడు అనిల్ కుమార్‌రెడ్డి చెన్నైలోని రాజధాని కళాశాల తెలుగు శాఖకు కంప్యూటర్‌ను వితరణ చేశారు. ఈ మేరకు సోమవారం రాజధాని కళాశాల ప్రిన్సిపల్ ఆర్. రామన్, తెలుగు శాఖాధిపతి ఎలిజబెత్ జయకుమారికి కంప్యూటర్‌ను అనిల్‌కుమార్ రెడ్డి నేరుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో తెలుగు పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అనేక రకాలుగా సహాయపడుతున్నట్లు వెల్లడించారు.

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య

అన్నానగర్: సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య చేసుకున్న ఘటన కన్యాకుమారిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. కొట్టారం అచ్చంకుళం శంకర్ పొడగాక వీధికి చెందిన జాన్సన్ రాయ్ (52) ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సెల్వరాణి, కుమారుడు నవీస్‌రాజ్ ఉన్నారు. జాన్సన్‌రాయ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం రాత్రి ఆత్మహత్యకు యత్నించాడు. కొట్టారంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కన్యాకుమారి పోలీసులకు విచారణ చేస్తున్నారు.

'లియో' ఘన విజయం సాధించాలి

- సూపర్ స్టార్ రజనీకాంత్
- అదనపు షోల విషయంపై కోర్టును ఆశ్రయించిన చిత్ర నిర్మాత



తూత్తుకుడి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతున్న రజనీకాంత్

తమిళ సినిమా: లియోచిత్రం ఘన విజయం సాధించాలని సూపర్‌స్టార్ రజినీకాంత్ కాంక్షించారు. వివరాలు.. హీరో విజయ్ నటించిన లియో చిత్రం చుట్టూ పలు వివాదాలు నెలకొంటున్నాయి. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 7 స్క్రీన్ స్టూడియోస్ పతాకంపై ఎస్‌ఎస్ లలిత్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. కాగా ఈ చిత్ర ట్రైలర్లో అనుచిత పదాలు చోటుచేసుకున్నాయనే విమర్శలను, అదేవిధంగా చిత్రానికి సెన్సార్ బోర్డు అధిక కట్స్ ఇచ్చినట్లు వివాదం చెలరేగింది. విజయ్ చిత్రానికే ఇలాంటి సమస్యలు ఎందుకు ఎదురవుతున్నాయి అంటూ నామ్ తమిళర్ పార్టీ అధినేత సీమాన్ ప్రశ్నించడంతో లియో చిత్రం వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. అంతకు ముందు చిత్రంలో విజయ్ సిగరెట్ తాగే సన్నివేశాలను పీఎంకే నేత అన్బుమణి రామదాస్ విమర్శించారు. తాజాగా లియో చిత్రం థియేటర్లో ప్రత్యేక ప్రదర్శనలు విషయం వివాదంగా మారింది. ప్రభుత్వం ఈ చిత్రం విడుదలయ్యే 19వ తేదీన వేకువ జామున 4 గంటల ఆటతో కలిపి ఆరు షోలకు, 20వ తేదీ నుంచి 24 వరకు రోజుకు ఐదు ఆటల ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతించినట్లు తొలుత ప్రచారం జరిగింది. అయితే తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ప్రధాన కార్యదర్శి.. ఈ చిత్రానికి 5 ఆటలకే అనుమతి అంటూ పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చిత్ర నిర్మాత ఎస్‌ఎస్ లలిత్ కుమార్ చెన్నై హైకోర్టును ఆశ్రయించారు. ఈమేరకు సోమవారం అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌ను న్యాయమూర్తి అనితా సుమంత్ సమక్షంలో విచారణకు వచ్చింది. కాగా మరోపక్క లియో చిత్ర నిర్మాతకు, థియేటర్ యాజమాన్యానికి మధ్య కూడా తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. చిత్ర నిర్మాత లియో తొలివారం కలెక్షన్లలో 75 శాతం తమకు ఇవ్వాలంటూ కండిషన్ పెట్టడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా.. తన 171 చిత్రంలో నటిస్తున్న రజనీకాంత్ కన్యాకుమారి, నెల్లై జిల్లాలో షూటింగ్ పూర్తిచేసుకుని సోమవారం తూత్తుకుడి నుంచి చెన్నైకి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన తూత్తుకుడి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ.. తాను 47 ఏళ్ల క్రితం భువనా ఒరు కేళ్వికురి చిత్రం షూటింగ్ కోసం తూత్తుకుడి జిల్లాకు వచ్చానన్నారు. కాగా విజయ్ నటించిన లియో చిత్రం ఎదుర్కొంటున్న సమస్యల గురించి ప్రశ్నించగా లియో చిత్రం ఘనవిజయం సాధించిందాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువుల్లో రాణించగలరు


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొరుక్కుపేట: చదువుల్లో రాణించాలంటే ఆరోగ్యం చాలా ముఖ్యమని లయన్ సురేష్ అన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 324ఎం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చెన్నై విల్లివాక్కంలోని ఎస్‌కేడీటీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రశాంతి ఆసుపత్రి సహకారంతో వైద్య పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.శ్రీధర్, సురేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. చదువులో బాగా రాణించాలంటే ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు వరదరాజన్, ఎస్.బోస్, సెంథిల్ వేలు, ఏఎస్ ముత్తు, జీవి రమణ, జార్జ్, మహ్మద్ నవీన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం


తిరుత్తణి యూనియన్ సమితి సమావేశం

తిరుత్తణి: పట్టణంలో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తిరుత్తణి యూనియన్ చైర్‌పర్సన్ తంగధం అన్నారు. సోమవారం యూనియన్ సమితి సమావేశం నిర్వహించారు. వైస్ చైర్మన్ ఈఎస్‌కండ్రిగ రవి, బీడీఓ సంతానం, అధికారులు, యూనియన్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. యూనియన్‌లోని 27 గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను చర్చించారు. వర్షాకాలం కావడంతో ముందస్తు జాగ్రత్తలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వర్షపు నీరు నిల్వ చేరకుండా కాలువల నిర్మాణం తదితర పనులకు తీర్మానాలు చేశారు. యూనియన్ ఇంజినీర్ ధర్మేష్, యూనియన్ కౌన్సిలర్లు బాలాజీ, కలైవాణి ఏలుమలై, వేలు, జ్యోతి చిరంజీవులు, నీల గోవిందస్వామి, వల్లియమ్మాళ్, డిప్యూటీ బీడీఓ గిరిదర్‌బాబు పాల్గొన్నారు.

భారీగా అరటి చెట్లు నరికివేత



అన్నానగర్: నామక్కల్ జిల్లా జేడర్ పాళయంలో ఆదివారం రాత్రి రెండు వేలకు పైగా అరటి చెట్లను దుండగులు నరికివేశారు. జేడర్‌పాళయం సమీపంలోని కొత్తమంగళానికి చెందిన నల్లశివం (60), ఇతని సోదరుడు ధర్మలింగం (54)కు 1800లకు పైగా అరటిచెట్లు ఉన్నాయి. అదే ప్రాంతానికి చెందిన సుబ్రమణికి 200లకు పైగా అరటి, తమలపాకుల తోట, పూలావరికి చెందిన సుబ్రమణి (70)కి 20కి పైగా అరటి చెట్లు ఉన్నాయి. కాగా, ఈ అరటి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి నరికివేశారు. అనంతరం విశ్వనాథన్ (60) తాటి చెట్టు వద్దకు వెళ్లిన దుండగులు ఒక తాటి చెట్టును నరికివేశారు. దీనిపై సమాచారం అందుకున్న కలెక్టర్ ఉమ, సేలం డీఐజీ రాజేశ్వరి, నామక్కల్ ఎస్పీ రాజేష్ కన్నన్, అదనపు పోలీసు సూపరింటెండెంట్ రాజు, ఎమ్మెల్యే శేఖర్ తోటలను పరిశీలించారు. ఈ ఘటనపై జేడర్ పాళయం పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు. వేలిముద్ర నిపుణులను పిలిపించి వేలిముద్రలు సేకరించారు.

ఆలంగాయంలో అన్నాడీఎంకే నాయకుల ఆందోళన


ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేసీ వీరమణి

వేలూరు: ఆలంగాయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రక్షణ కల్పించాలని, మృతి చెందిన చిన్నారుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి కేసీ వీరమణి డిమాండ్ చేశారు. ఈమేరకు అన్నాడీఎంకే ఆధ్వర్యంలో తిరుపత్తూరు జిల్లా ఆలంగాయం బీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానియంబాడి సమీపంలోని చిక్కనాకుప్పంలో గత నెల 27న ప్రభుత్వ పాఠశాల ఎదుట నిల్వవున్న వర్షపు నీటిలో పడి విద్యార్థినులు మోనిక, రాజలక్ష్మి మృతి చెందారన్నారు. ఆ చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ ధర్నాలో ఎమ్మెల్యే సెంథిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కోవై సంపత్‌కుమార్, కేజీ రమేష్, మహిళా విభాగం కార్యదర్శి మంజుల కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టాలి


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: వర్షపు నీరు వృథా కాకుండా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ సూచించారు. తమిళనాడు వాటర్ బోర్డు ఆధ్వర్యంలో వేలూరు కోట మైదానంలోని గాంధీ విగ్రహం నుంచి విద్యార్థుల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ వేలూరు కార్పొరేషన్ పరిధిలో ప్రతి ఇంటి సమీపంలో ఇంకుడు కుంటలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అనంతరం విద్యార్థులు కరపత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, తమిళనాడు వాటర్ బోర్డు చీఫ్ ఇంజినీర్ నిత్యానందం, అసిస్టెంట్ ఇంజినీర్ కుమరవేల్, సబ్ కలెక్టర్ కవిత వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న ఆశీష్

కొరుక్కుపేట: చెన్నైలోని మ్యూజిక్ అకాడమీ వేదికగా కన్‌స్ట్రక్షన్ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి జరిగింది. తెలుగు కుటుంబానికి చెందిన పారిశ్రామికవేత్త తాడేపల్లి రాజశేఖర్ కుమారుడు, జేఆర్‌టీ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆశీష్ తాడేపల్లికి యంగ్ ఎంటర్‌ప్రెన్యూయర్ కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ రామెటీరియల్ సస్టైనబుల్ టింబర్ అవార్డు దక్కింది. కార్యక్రమంలో ఇస్రో రిటైర్డ్ డైరెక్టర్ మయిల్‌స్వామి అన్నాదురై, అన్నా వర్సిటీ మాజీ డీన్ ఏఆర్ శాంతకుమార్, వేలూరు వీఐటీకి చెందిన జీవీ సెల్వం, రెప్కో బ్యాంకు ఎండీ ఆర్‌ఎస్ ఇస్బెల్లా, జయరాజ్ గ్రూప్ సీఎండీ టి.రాజశేఖర్, కట్టుమాన తొలిస్ ఎడిటర్ సింధు భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా అవార్డుల వేడుక



అవార్డుల ప్రదానోత్సవంలో అతిథులు

తమిళ సినిమా: వెండి, బుల్లితెర కళాకారులను ప్రోత్సహించేలా మహా ఆర్ట్స్ సంస్థ అధినేత అనురాధ జయరామన్, యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా సంస్థ అధినేత కలైమామణి డాక్టర్ నెల్లై సుందరాజన్ సంయుక్తంగా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీరికి విశ్రాంత న్యాయమూర్తులు మోరల్ సపోర్ట్‌గా నిలుస్తున్నారు. తాజాగా వెండితెర, బుల్లితెరలో నటీనటులు, ఇతర శాఖలకు చెందిన కళాకారులకు ప్రోత్సాహకంగా అవార్డులను ప్రదానం చేసే కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక వడపళని, కుమరన్ కాలనీలోని శిఖరం హాల్లో నిర్వహించారు. ఈ వేదికపై దర్శకుడు ఏ వెంకటేష్, బుల్లితెర సంఘం అధ్యక్షుడు శివన్ శ్రీనివాస్ సినీసేవలను కొనియాడుతూ వారిని సత్కరించి అవార్డులను ప్రదానం చేశారు. అదేవిధంగా నటి అను కృష్ణ, నటుడు ఆదేశ్ బాల, బులితెర నటి గాయత్రి, మనీషా ప్రియదర్శన్ తదితరులు అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎస్‌కే కృష్ణన్ ముఖ్యఅతిథిగా పాల్గొని కళాకారులను అవార్డులతో సత్కరించారు. కాగా ఈ వేదికపై కళాసేవ, సామాజిక సేవలకు గాను మహా ఆర్ట్స్ అనురాధ జయరామన్, యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా సంస్థ అధినేత కలైమామణి, డాక్టర్ నెల్లై సుందర్ రాజన్, సామాజిక సేవకు గాను స్పోర్ట్స్ ఛాంపియన్ డాక్టర్ సుందర్ రాజన్, డాక్టర్ వెంకటేష్‌లను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు.

దీపావళి రేసులో విక్రమ్ ప్రభు 'రైడ్'

తమిళ సినిమా: ఇటీవల ఇరుగప్పట్రు చిత్రంతో సాలిడ్ హిట్ కొట్టాడు నటుడు విక్రమ్ ప్రభు. అంతకుముందు కూడా పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో ముఖ్య భూమిక పోషించి ఆ చిత్ర విజయంలో భాగం అయ్యారు. తాజాగా రైడ్ చిత్రంతో తెరపైకి రావడానికి సిద్ధమయ్యారు. నటి శ్రీదివ్య నాయకిగా నటించిన ఈ చిత్రంలో నటి అనంతిక, ఋషి రిత్విక్, సౌందరరాజా తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. దీనికి దర్శకుడు ముత్తయ్య మాటలు అందించడం విశేషం. కార్తీ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎస్.కె కనిష్క, జీకే మణికన్నన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్యామ్ సీఎస్ సంగీతాన్ని, కదిరవన్ ఛాయాగ్రహణం అందించారు. చిత్ర విరాలను నిర్మాతలు తెలుపుతూ ఇటీవల వరుస విజయాలతో దూసుకుపోతున్న నటుడు విక్రమ్ ప్రభు కథానాయకుడిగా చిత్రాన్ని చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంతో ఆయన విజయ పయనం కొనసాగుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇది ఉత్కంఠ భరితంగా సాగే యాక్షన్ థ్రిల్లర్ ఎంటర్‌టైనర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుందని పేర్కొన్నారు. చిత్రంలో విక్రమ్ ప్రభు స్టైలిష్‌లుక్. అదే విధంగా చిత్ర టీజర్ ప్రేక్షకుల మధ్య మంచి అటెన్షన్‌ను తీసుకొచ్చిందని చెప్పారు. కాగా రైడ్ చిత్రాన్ని దీపావళి సందర్భంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.


రైడ్ చిత్రంలో విక్రమ్ ప్రభు, శ్రీదివ్య

కోలీవుడ్ టాక్స్

హరి, విశాల్ కాంబో రిపీట్


దర్శకుడు హరి, గౌతమ్ మీనన్, విశాల్, సముద్రఖని

తమిళ సినిమా: మార్క్ ఆంటోనీ చిత్రంతో మళ్లీ విజయాల బాట పట్టిన విశాల్.. తాజాగా కొత్త చిత్రానికి కమిట్ అయ్యారు. ఇంతకు ముందు విశాల్ కథానాయకుడిగా తామిరభరణి, పూజై సినిమాలకు దర్శకత్వం వహించిన కమర్షియల్ దర్శకుడు హరి ఇప్పుడు మూడోసారి డైరెక్ట్ చేస్తున్నారు. ఇది విశాల్ నటిస్తున్న 34వ చిత్రం. ఇందులో నటి ప్రియా భవానీ శంకర్ నాయకిగా నటిస్తుండగా దర్శకుడు సముద్రఖని, యోగిబాబు తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. దీన్ని జి స్టూడియోస్ సౌత్ సంస్థతో కలిసి దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ తన స్టోన్ బెంచ్ ఫిలిమ్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. గత 20 రోజులుగా జరుగుతున్న ఈ చిత్రం ఇప్పటికే చాలా వరకు షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం తూత్తుకుడి జిల్లా విళాత్తికుళం పరిసర ప్రాంతాల్లో చిత్ర క్లైమాక్స్ సన్నివేశాలను దర్శకుడు హరి చిత్రీకరిస్తున్నారు. కాగా తాజాగా విచిత్రంలో దర్శకుడు గౌతమ్ మీనన్ ముఖ్య పాత్రను పోషిస్తున్ననట్లు నటుడు విశాల్ తన ట్విట్టర్లో పేర్కొన్నారు. ఈ చిత్రంలో ముగ్గురు దర్శకులతో పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉందని, ఈ సంఖ్య వచ్చే ఏడాది నాలుగు అవుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కిషన్ మధ్యలో ఆగిపోయిన తుప్పరివాలన్ 2 చిత్రాన్ని తనే దర్శకుడిగా హ్యాండిల్ చేయడానికి సిద్ధమవుతున్నారు. కాగా విశాల్, హరి కాంబోలో పొందుతున్న ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్రానికి దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. దర్శకుడు హరి అంటేనే మాస్ మసాలా చిత్రాలకు కేరాఫ్. మరి ఈయన విశాల్ తో తెరకెక్కిస్తున్న మూడవ చిత్రం హ్యాట్రిక్ సాధిస్తుందో లేదో చూడాలి.

ఇకపై ఆనంద క్షణాలే..!


రాశీ ఖన్నా

తమిళ సినిమా: మంచి ఫిజిక్. అంతకు మించిన యాక్టివ్ యువతను గిలిగింతలు పెట్టగల యాక్టింగ్ ఇవన్నీ నటి రాశి ఖన్నాలోని లక్షణాలు. అంతేకాకుండా తనదైన అందాలతో కనువిందు చేస్తుంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నటిస్తూ పాపులర్ అయిన రాశీ ఖన్నాకు కథానాయకిగా ఇంకా తాను ఆశించిన స్థాయి రాలేదనే చెప్పాలి. అలాంటి స్థాయికి చేరుకోవడానికి ఇంకా ప్రయత్నిస్తూనే ఉంది. ఇటీవల నటిగా కాస్త వెనుకపడిందనే చెప్పాలి. తమిళంలో ఈమె నటించిన చివరి చిత్రం సర్దార్. ఆ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం హిందీలో యోధా అనే ఒక చిత్రం, తమిళంలో అరణ్మనై 4, మేథావి చిత్రాల్లో నటిస్తోంది. కాగా తరచూ తన గ్రామ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేస్తూ నెటిజన్లను కవ్విస్తున్న రాశీ ఖన్నా ఇకపై రానున్నవన్నీ ఆనంద క్షణాలే అని పేర్కొంది. దీని గురించి ఆమె ఒక భేటీలో పేర్కొంటూ తాను ఇప్పుడు పండగల ఖుషిలో ఉన్నట్లు పేర్కొంది. నవరాత్రి వేడుకలు మొదలయ్యాయని.. ఈ తొమ్మిది రోజులు అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజిస్తానని చెప్పింది. నవరాత్రి వేడుకలు పూర్తికాగానే దీపావళి పర్వదినాన్ని జరుపుకుంటానని, తనకు దీపావళి చాలా పెద్ద పండుగ అని పేర్కొంది. ఆ సమయంలో పటాసులు కాల్చడం చాలా సరదా చెప్పింది. అదేవిధంగా నూతన దుస్తులు ధరించి తీపి పదార్థాలను తింటానని తెలిపింది. ఆ తర్వాత నవంబర్ 30వ తేదీ తన పుట్టినరోజు అని ఆ వేడుకను ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటానని చెప్పింది. ఆ తర్వాత క్రిస్మస్, ఆంగ్ల ఉగాది పర్వదినాలు వస్తాయని అలా ఈ మూడు నెలలు తనకు ఆనంద క్షణాలే అని నటి రాశి ఖన్నా సంతోషం వ్యక్తం చేసింది.

ఆ ముద్ర చెరిపేందుకే 'స్మోక్'



నటి సోనా

తమిళ సినిమా: తమిళం, తెలుగు, మలయాళం తదితర భాషల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సోనా. ముఖ్యంగా శృంగార తార అనే ముద్రను వేసుకున్నారు. ఇదే తనకు నచ్చలేదని సోమవారం చెన్నైలోని ఒక నక్షత్ర హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. నటి సోనా దర్శకురాలిగా పరిచయం అవుతూ ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్న వెబ్ సిరీస్ స్మోక్. సోనా జీవిత చరిత్రతో రూపొందుతున్న ఈ చిత్ర షూటింగ్ బుధవారం ప్రారంభం కానుంది. ఈ వివరాలను సోనా వెల్లడించారు. తాను నటిగా 2000 సంవత్సరంలో పరిచయం అయ్యానని చెప్పారు. అలా ఈ 23 ఏళ్లు ఎంతో సంతోషాన్ని కష్టాలను, అవమానాలను ఎదుర్కొన్నానన్నారు. శారీరకంగానూ మానసికంగానూ చాలా గాయపడ్డారని చెప్పారు. ఒకానొక సమయంలో సినిమాలు వద్దనుకొని ఇంట్లోనే గడిపానన్నారు. పలు భాషల్లో సుమారు 150 కి పైగా చిత్రాల్లో నటించానని చెప్పారు. తనపై శృంగార తార ముద్ర పడడంతో అందుకు గల కారణాలను వెతుకున్నానని, పుట్టుకతో ఎవరు చెడ్డవారు కాదని వారికి జీవితంలో ఎదురయ్యే సంఘటనలు, సమస్యలు కారణంగా జీవితాలు మలుపు తిరుగుతాయని పేర్కొన్నారు. ఆ విధంగా తనపై పడ్డ శృంగార తార అనే ముద్రను చెరుపుకోవడానికి చేసిన ప్రయత్నమే ఈ స్మోక్ అని చెప్పారు. తాను దర్శకురాలిగా మారడానికి ముందు ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో దర్శకత్వం, ఛాయాగ్రహణం శాఖల్లో శిక్షణ పొందినట్లు చెప్పారు. తన జీవితంలో 99.9% వాస్తవాలను ఆవిష్కరించే వెబ్ సిరీస్‌గా స్మోక్ ఉంటుందన్నారు. ఈ వెబ్ సిరీస్ ప్రచారం అయిన తర్వాత పరిహాసాలు విమర్శలు ఎదురవ్వవచ్చన్నారు. ఇది పూర్తిగా తన జీవిత చరిత్ర అని ఇందులో ఎలాంటి రాజకీయాలు ఉండవని చెప్పారు. దీనికి షార్ట్ ఫ్లిక్ ఓటీటీ సంస్థ సహకారం ఉందని చెప్పారు.

క్లుప్తంగా

చెట్టుపై నుంచి జారిపడిన కార్మికుడి మృతి

అన్నానగర్: నాగరసంబట్టి సమీపంలో ఆదివారం చెట్టు పైనుంచి జారి పడిన కార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. కృష్ణగిరి కావేరి పట్నం జిల్లా పర్కూర్ తాలూకా శివంపట్టి సమీపంలోని నాదర్ తోటమ్ ప్రాంతానికి చెందిన సెంథిల్ (38) రోజు కూలీగా జీవనం సాగిస్తున్నారు. ఇతడు ఆదివారం నాయకన్ కోటాయి గ్రామంలో చెట్టు ఎక్కి కొబ్బరి కాయలు కోస్తుండగా.. ప్రమాదవశాత్తూ జారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన సెంథిల్‌ను స్థానికులు కావేరిపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే సెంథిల్ మృతి చెందాడు. నాగరసంబట్టి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

తిరువళ్లూరు: శరీరంపై గాయాలతో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి శ్రీదేవి కళాశాల సమీపంలో సుమారు 40 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం ఉన్నట్లు తడపెరుంబాక్కం వీఏఓకు స్థానికులు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వచ్చిన వీఏఓ లోకేష్ పోలీసులకు తెలిపారు. వారి సహకారంతో మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పొన్నేరి వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడు తిరువళ్లూరు జిల్లా పెద్దపాళ్యంకు చెందిన గోపాలకృష్ణన్ కుమారుడు బాబు (35)గా గుర్తించారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

అన్నానగర్: రైలు ముందు దూకి యువకుడు ఆత్మహత్య చేసున్న ఘటన మదురైలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. తెన్‌కాశి జిల్లా సెంగోట్టై నుంచి ఆదివారం చెన్నై బయలుదేరిన పోతిగై ఎక్స్‌ప్రెస్ రైలు రాత్రి 9.30 గంటలకు మదురై రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఇంజిన్ ముందు భాగంలో ఇరుక్కుపోయిన 25 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని చూసిన ప్రయాణికులు షాక్‌కు గురయ్యారు. వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయమై రైల్వే పోలీసులు మాట్లాడుతూ.. మదురై సమీపంలోని కప్పలూరు వద్ద రైలు రాగానే.. ఓ యువకుడు ముందు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. శరీరం ఇంజిన్‌లో చిక్కుకుపోయి దాదాపు 10 కిలోమీటర్ల మేర ఈడ్చుకెళ్లి ఉండవచ్చని తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

డ్యామ్‌లో దూకి దంపతులు..

అన్నానగర్: కోయంబత్తూరు దంపతులు ఆదివారం ఉడుమలై తిరుమూర్తి డ్యామ్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. తిరుపూర్ జిల్లా ఉడుమలై సమీపంలో తిరుమూర్తి డ్యామ్ ఉంది. వర్షం కారణంగా ఈ డ్యాంలో నీటి ప్రవాహం పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో సుమారు 60 ఏళ్ల వయస్సున్న దంపతులు డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై తాలి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. డ్యాంలో నీరు ఎక్కువగా ఉండడం, అర్ధరాత్రి కావడంతో మృతదేహాలు లభ్యం కాలేదు. సోమవారం తెల్లవారుజామున అగ్నిమాపక సిబ్బంది ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. కోయంబత్తూరుకు చెందిన వారని తెలిసింది. అయితే పూర్తి వివరాలు తెలియరాలేదు.

ప్రేమ వివాహం చేసుకున్న ఆర్నెళ్లకే..

–యువతి ఆత్మహత్య

తిరువొత్తియూరు: చెన్నై ఆర్కేనగర్‌కు చెందిన వివాహిత సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సునామీ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన వడివేలుకు తిరువొత్తియూరుకు చెందిన రాజేశ్వరి (19)తో ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా రాజేశ్వరి పుట్టింటికి వచ్చేసింది. చెప్పినా వినకుండా వివాహం చేసుకుని ఇప్పుడు గుర్తుకు వచ్చామా అంటూ తల్లిదండ్రులు నిలదీశారు. దీంతో మనస్తాపం చెందిన రాజేశ్వరి రామకృష్ణనగర్‌లోని సముద్రంలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆగ్రహించిన రాజేశ్వరి సోదరుడు దీనికంతటికీ కారణం వడివేలని అతనిపై దాడి చేశాడు. ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా

– ఇద్దరు మృతి

తిరువొత్తియూరు: తూత్తుకుడి జిల్లాలో ట్రాక్టర్ బోల్తాపడి మహిళ సహా ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. ఎట్టాయపురం సమీపంలోని కోడంగి పట్టికి చెందిన చందన కుమార్ (30), అతని తల్లి రాజేశ్వరి (50), అదే ప్రాంతానికి చెందిన గోమతి అమ్మాల్ (60), సరస్వతి (60) సోమవారం ఉదయం వ్యవసాయ పనుల కోసం కీల్ వేలాయదిపురానికి బయలుదేరారు. ఆ సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పి గుంతలో బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లోని చందన కుమార్ సహా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాక్టర్ టైర్ల కింద చిక్కుకొని చందన కుమార్, గోమతి అమ్మాల్ అక్కడికక్కడే మృతి చెందారు. రాజేశ్వరి, సరస్వతికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.

అధిక వడ్డీ పేరిట రూ.9 కోట్లు కుచ్చుటోపి



ఫిర్యాదు చేయడానికి ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులు

తిరువళ్లూరు: అధిక వడ్డీ పేరుతో ఆశచూపి సుమారు రూ. 9 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన సంస్థపై చర్యలు తీసుకోవడంతో పాటు తమ నగదును తిరిగి ఇప్పించాలని కోరుతూ బాధితులు సోమవారం ఉదయం ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ్‌కు వినతిపత్రం సమర్పించారు. చెన్నై తురైపాక్కంలో ట్రేడ్‌జీ అనే ఫైనాన్స్ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ బ్రాంచ్ కార్యాలయాన్ని తిరువళ్లూరు రాజాజీపురం గణపతి నగర్‌లోనూ ప్రారంభించారు. ఈ సంస్థకు కారైకుడికి చెందిన పాన్‌శరవణన్ అధ్యక్షుడిగానూ, తూత్తుకుడికి చెందిన సుభాష్ జాయింట్ డైరెక్టర్‌గానూ, రాణిపేట జిల్లా ఆరక్కోణం ప్రాంతానికి చెందిన లోకేష్ తిరువళ్లూరు బ్రాంచ్ మేనేజర్‌గా ఉన్నారు. ఈ సంస్థలో లక్ష రూపాయలు డిపాజిట్ చేస్తే నెలకు రూ. 7 వేలు ఇస్తామని సామాజిక మాధ్యమాలు, పలు లోకల్ చానెల్‌లలో ప్రకటనలు ఇచ్చారు. డిపాజిట్‌ల సేకరణ కోసం ఏజెంట్‌లను సైతం నియమించారు. ఈ ప్రకటనలను నమ్మి కపాంగ్‌క్రాస్‌రోడ్డు, పేరంబాక్కం, ఉరియూర్ తిరువళ్లూరు, తక్కోలం, నరిసింహాపురంతో పాటు పలు గ్రామాలకు చెందిన వేలాది మంది సుమారు రూ. 2 కోట్ల మేరకు సంస్థలో పెట్టుబడి పెట్టారు. అయితే మొదట రెండు నెలలు వడ్డీని సక్రమంగా చెల్లించిన సంస్థ నిర్వాహకులు ఆ తర్వాత మెహం చాటేశారు. దీంతో అనుమానం రావడంతో సంస్థ వద్దకు వెళ్లి తమ నగదును తిరిగి చెల్లించాలని కోరారు. నిర్వాహకులు బెదిరింపులకు దిగడంతో బాధిదితులు సోమవారం ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. తమ వద్ద సేకరించిన డిపాజిట్‌లను తిరిగి ఇప్పించాలని కోరారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్ట్


అరెస్టయిన సమీర్

కొరుక్కుపేట: ఫైనాన్స్ కంపెనీ నడిపి రూ.33 కోట్లు మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కళ్లకురిచ్చి జిల్లా శంకరాపురం సమీపంలోని మూరర్‌పాళయం గ్రామంలో సమీర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ పేరుతో ఫైనాన్స్ కంపెనీ నడుస్తోంది. లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.15వేలు వడ్డీ వస్తుందని, ఏడాది తర్వాత లక్ష వస్తుందని ప్రచారం చేశారు. దీన్ని నమ్మి 500 మందికి పైగా పెట్టుబడి పెట్టారు. మొదటి సంవత్సరం డబ్బు తిరిగి ఇవ్వగా రెండో సంవత్సరం తిరిగి రాలేదు. ఈ విధంగా సమీర్ గ్రూప్ కంపెనీ యజమాని సమీర్ తమైరావు 500 మందికి పైగా వ్యక్తుల నుంచి రూ.33 కోట్లు వసూలు చేసి మోసం చేశాడు. ఈ విషయమై కల్లకురిచ్చి ఎస్పీ కార్యాలయంలో బాధితులు ఫిర్యాదు చేశారు. సమీర్ చెన్నైలో ఓ కార్ల కంపెనీలో తలదాచుకున్నట్లు తెలిందిం. మోసపోయిన వ్యక్తులు చెన్నై వెళ్లి సమీర్‌ను పట్టుకుని మురార్ పాళయం తీసుకొచ్చారు. తాము ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వాలని ఆయనతో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి సమీర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నగరాభివృద్ధికి సమష్టి కృషి


కార్పొరేషన్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శేఖర్ బాబు

కొరుక్కుపేట: చెన్నై నగరాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ పాటుపడాలని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, దేవదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. ఈ మేరకు చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 275వ గ్రూప్ మీటింగ్ మంత్రి శేఖర్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. 2023 సంవత్సరానికి ఆర్థిక నివేదికలో ప్రకటించిన 27 ప్రాజెక్టులకు టెండర్లు, ఆర్థిక ఆమోదం కోసం కోరారు. అలాగే కార్పొరేషన్‌కు సంబంధించిన భూ వినియోగ మార్పు దరఖాస్తులు, పరిపాలనా కార్యకలాపాల పరిశీలనకు సంబంధించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. నగరాన్ని అభివృద్ధి చేసేందుకు పూర్తిస్థాయిలో సహాయసహకారాలు అందించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి కోరారు. ఈ కమిటీ సమావేశంలో మేయర్ ప్రియ, తమిళనాడు హౌసింగ్ బోర్డు చైర్మన్ ఎస్. మురుగన్, మాధవరం ఎమ్మెల్యే ఎస్. సుదర్శనం, తమిళనాడు అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డ్ మేనేజింగ్ డైరెక్టర్ శంకర్, గ్రూప్ సభ్యులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

వీరపాండ్య కట్ట బ్రహ్మన్నకు ఘననివాళి


కట్టబ్రహ్మన్నకు నివాళి అర్పిస్తున్న ప్రముఖులతో ఇలయా కట్టబ్రహ్మన్న

కొరుక్కుపేట: స్వాతంత్య్ర సమరయోధుడు, తెలుగు తల్లి ముద్దుబిడ్డ వీరపాండ్య కట్ట బ్రహ్మన్న 224వ వర్ధంతిను పురస్కరించుకుని ఆయనకు పలువురు ప్రముఖులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మక్కల్ మున్నేట్ర ట్రస్ట్, వీరపాండ్య కట్టబ్రహ్మన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఇలయా కట్టబ్రహ్మన్న ఆధ్వర్యంలో చెన్నై గిండి ప్రాంతంలోని కట్టబ్రహ్మన్న విగ్రహం వద్ద సాంస్కృతిక సాహస క్రీడా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయుధాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన చూపరులను మంత్రముగ్ధులను చేసింది. కట్టబ్రహ్మన్న వారసుడు, ప్రముఖ న్యాయవాది ఇలయా కట్టబ్రహ్మన్న సారథ్యంలో పలు సినీ, రాజకీయం, వ్యాపారం, ప్రాచీన సాహస క్రీడాకారులు కట్టబ్రహ్మన్న విగ్రహానికి నివాళి అర్పించారు. ఇందులో రంగస్థల కళాకారులతోపాటు మహాత్మాగాంధీ, నెహ్రూ, సుబ్రహ్మణ్య భారతీ, నేతాజీ, పెరియార్, కరుణానిధి ,డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి నాయకుల వేషధారణలతో కనువిందు చేశారు. ఇక నటులు ఎస్వీ శేఖర్, బోండా మణి హాస్య ప్రదర్శన అలరించింది.

ఉత్సాహంగా ఫిషింగ్ ఫెస్టివల్

అన్నానగర్: దిండుక్కల్ సమీపంలోని నల్లంపట్టిలో ఆదివారం చేపల వేట ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. వివరాలు.. దిండుక్కల్ సమీపం నలంబట్టిలో అచ్చరాజకులం చెరువు ఉంది. దీని సమీపంలోని ఉత్తర మునియప్పన్ ఆలయంలో ఏటా పెరటాసి మాసంలో చేపల ఉత్సవం అత్యంత వేడుకగా సాగుతోంది. కాగా ఆదివారం నుంచి ఈ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అచరాజకులంలో చేపల పండుగ ప్రారంభమైంది. ముందుగా చెరువు వద్ద ఉన్న కన్నిమర్ల అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో జాతీయ జెండా ఊపి చేపల పండుగను ప్రారంభించారు. ఆ సమయంలో అప్పటికే ఒడ్డున సిద్ధంగా ఉన్న గ్రామస్తులు వలలు, బుట్టలు, ఉద్దాలు, కచ్చాలతో ఉత్సాహంగా చేపలుపట్టారు. తర్వాత సమీప గ్రామాల ప్రజలు మొత్తం చేపల కూరతో వేడుకలు చేసుకున్నారు.


చేపలు పడుతున్న ప్రజలు

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

తిరువళ్లూరు: అనారోగ్యంతో కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానికంగా కలకలం రేపింది. తిరువళ్లూరు జిల్లా అరికంబట్టు గ్రామానికి చెందిన ఢిల్లీబాబు(27) కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. చికిత్స కోసం లక్షలు ఖర్చు చేశాడు. సమస్య తీరకపోగా మరింత తిరగబెట్టినట్టు తెలిసింది. దీంతో ఈ నెల 13వ తేదీ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు అతన్ని చెన్నై స్టాన్లీ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి చంద్రన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసు నిందితుడి ఆత్మహత్య

అన్నానగర్: పెళ్లికి నిరాకరించిందని ఇటీవల బాలికను హత్య చేసిన మేనమామ విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపత్తూరు జిల్లా నట్రంపల్లి సమీపంలోని కె.బండారపల్లికి చెందిన పెరుమాళ్ కుమార్తె జీవిత (18) పర్కూర్‌లోని ఆర్ట్స్ కళాశాలలో చదువుతోంది. ఈమెను శనివారం మధ్యాహ్నం తన మేనమామ చరణ్ రాజ్ హత్య చేసిన విషయం తెలిసిందే. నట్రంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న చరణ్ రాజ్ కోసం గాలించారు. వెలక్కల్‌నట్టం లోని టీ దుకాణంలో చరణ్ ఉన్నట్లు ఆదివారం ఎస్పీ ఆల్బర్ట్ జాన్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేక బలగాలు వెలక్కల్‌నట్టం ప్రాంతానికి చేరుకుని చరణ్‌రాజ్‌ను అరెస్టు చేశారు. ఆ సమయంలో తాను విషం తాగానని తెలపడంతో వెంటనే నట్రంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి ఫోన్‌ను పరిశీలించగా తాను ఆత్మహత్య చేసుకోనున్నట్లు వీడియో రికార్డు చేశాడు. జీవిత మృతదేహం వద్దే పూడ్చిపెట్టాలని అందులో పేర్కొన్నాడు.

బీజేపీ నేతపై కేసు నమోదు


అరెస్టయిన కార్తికేయన్

కొరుక్కుపేట: క్రిప్టో కరెన్సీ కుంభకోణం కేసులో బీజేపీ నేత కార్తికేయన్‌ను ఆదివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఇతని స్వస్థలం తంజావూరు జిల్లా తంగతాల పంచాయతీ వివేకానందనగర్. ఆ ప్రాంతంలో శ్రీసాయి క్రిప్టో కరెన్సీ కన్సల్టెన్సీని నడుపుతున్నాడు. తిరువారూరు జిల్లా బూతమంగళానికి చెందిన షేక్ అల్లావుద్దీన్ ఈ కంపెనీలో డబ్బులు చెల్లించి మోసపోయానని నాచియార్‌కోవిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు జరిపిన విచారణలో తిరువారూరు జిల్లా అతికడైకి చెందిన 6 మంది డబ్బులు చెల్లించి మోసపోయినట్లు తేలింది. అర్జున్ కార్తీ, క్రిప్టో-కరెన్సీ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేసిన ఫ్రాన్సిస్ భార్య ఇవాంజెలిన్ అబిలాదరస్, కంపెనీ మేనేజింగ్ పార్టనర్ రాజా, అతని కుమారుడు సెల్వకు అలాగే కంపెనీ భాగస్వాములు విఘ్నేష్, బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి కార్తికేయన్(42)పై కేసు నమోదు చేశారు. కార్తికేయన్‌ను ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు 5 మందిని అరెస్ట్ చేయగా, పరారీలో ఉన్న విఘ్నేష్ కోసం గాలిస్తున్నారు.

రసాభాసగా గ్రామసభలు

–మౌలిక సదుపాయాలు కల్పించాలని నినాదాలు


సేలై గ్రామసభలో ప్రసంగిస్తున్న సర్పంచ్ గోవర్ధన్

తిరువళ్లూరు: గ్రామాల్లో తాగునీరు, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గ్రామసభలో కొందరు నినాదాలు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా గ్రామ సభలు నిర్వహించారు. అయితే ఎగువనల్లాటూరు, సేలై తదితర గ్రామాల్లో అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. వాయిదా పడిన గ్రామాల్లో సోమవారం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే సేలై పంచాయతీ అధ్యక్షుడు గోవర్ధన్, ఎగువనల్లాటూరు అధ్యక్షుడు హరిబాబు సోమవారం ఉదయం పది గంటలకు సభ నిర్వహించారు. కాగా రెండు గ్రామాల్లో సభ ప్రారంభం కాగానే గందరగోళం నెలకొంది. గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సదుపాయం, వర్షపు నీరు వెళ్లడానికి కాలువ నిర్మాణం, ఇళ్లు లేని వారికి స్థలం ఇవ్వాలని నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. సమస్యలపై నిలదీత, నిరసనతో సాగిన గ్రామసభలు దాదాపు 3 గంటల పాటు వాడివేడిగా సాగింది. సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించారు. అనంతరం పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు.

శిశువు విక్రయానికి యత్నం

– ప్రభుత్వ మహిళా డాక్టర్ సహా ఇద్దరి అరెస్టు

అన్నానగర్: తిరుచెంగోడ్‌లో తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొచ్చి బిడ్డను విక్రయించేందుకు యత్నించిన ప్రభుత్వ మహిళా డాక్టర్ సహా ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాలు.. నామక్కల్ జిల్లా తిరుచెంగోడ్ సూర్యంపాళయానికి చెందిన దినేష్ (29). ఇతని భార్య నాగజ్యోతి. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఈ నేపథ్యంలో 12న నాగజ్యోతికి మూడో ఆడబిడ్డ జన్మించింది. అనంతరం ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారిని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం తిరుచెంగోడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రభుత్వాసుపత్రిలో ప్రసూతి వైద్యురాలుగా అనురాధ పనిచేస్తున్నారు. ఈమె కరూర్ వెంగమేడు ప్రాంతానికి చెందిన లోకంపాల్ (38) ద్వారా రూ.2 లక్షలు ఇప్పిస్తానంటూ ఈమేరకు బిడ్డను అమ్మాలని బేరసారాలు సాగించినట్లు తెలుస్తుంది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు నామక్కల్ జిల్లా కలెక్టర్ ఉమ, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్‌కన్నన్‌కు ఫిర్యాదు చేశారు. తిరుచెంగోడ్ డీఎస్పీ ఇమయవరంబన్ కేసు నమోదు చేసి ఆదివారం డాక్టర్ అనురాధ, చైల్డ్ బ్రోకర్ లోకంబాల్‌ను అరెస్టు చేసి విచారణ చేపట్టారు. డాక్టర్ అనురాధ, లోకంబాల్ ఇద్దరూ గతంలో 10 మంది పిల్లలను విక్రయించి కిడ్నీ మార్పిడి చేసినట్లు విచారణలో తేలింది. దీంతో వారిని అరెస్టు చేశారు.

టీవీ విషయంలో ఘర్షణ..భర్త ఆత్మహత్య


మృతి చెందిన ఆశీర్వాదం

తిరువళ్లూరు: టీవీ చూసే విషయంలో భార్యభర్తల మధ్య ఏర్పడిన స్వల్ప వివాదం భర్త ఆత్మహత్యకు దారి తీసింది. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు ప్రాంతానికి చెందిన ఆశీర్వాదం(40), నిషా(29) దంపతులకు కుమారుడు నితీష్‌కుమార్(12), కుమార్తె తేజశ్రీ(10) ఉన్నారు. ఆదివారం ఆశీర్వాదం టీవీ చూస్తున్న సమయంలో నితీష్‌కుమార్ సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టడానికి టీవీ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో నితీష్‌కుమార్‌ను తండ్రి మందలించడంతో పాటు చేయి చేసుకున్నాడు. తరచూ పిల్లలను కొట్టడంపై నిషా అడ్డు చెప్పింది. దంపతుల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. పిల్లల ముందే భార్య తననూ తిట్టడాన్ని సహించుకోలేని ఆశీర్వాదం తిరువళ్లూరులోని తన బంధువుల ఇంటికి వెళ్లిపోయాడు. భర్త ఇంట్లో లేకపోవడంతో నిషా తన పిల్లలతో కలిసి కొండంజేరిలోని పుట్టింటికి వెళ్లింది. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చిన ఆశీర్వాదం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన బంధువులు ఆశీర్వాదంను కిందకు దింపి వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య నిషా కడంబత్తూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న వ్యాన్

–ఇద్దరి మృతి

అన్నానగర్: ఆటోను వ్యాన్ ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈ ఘటన నెల్‌లైలో ఆదివారం రాత్రి జరిగింది. తూత్తుకుడి జిల్లా శ్రీవైకుంఠం సమీపంలోని వెల్లూరుకు చెందిన రామచంద్రన్ (35) డ్రైవర్. సెకండ్ హ్యాండ్ లగేజీ ఆటోను కొనుగోలు చేసి మరమ్మతు పనుల కోసం నెల్‌లైలో వర్క్‌షాప్‌లో వదిలాడు. ఆదివారం రాత్రి వాహనం తీసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. వెల్లూరుకు చెందిన వేలుమైల్ (46) కూడా అతనితో వచ్చాడు. నెల్‌లై-తిరుచెందూర్ రహదారిలోని కులత్తుకరై వద్ద తిరుచెందూర్ నుంచి నెల్‌లై వెళ్తున్న వ్యాన్ ఢీకొట్టింది. రామచంద్రన్, వేలుమలై తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ఇద్దరిని చికిత్స నిమిత్తం పాళయంగోట్ గ్రౌండ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు.

ఆలస్యంగా కార్యాలయానికి రావడంతో..

కొరుక్కుపేట: మదురై కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేకు ఆలస్యంగా వచ్చిన అధికారికి కలెక్టర్ పనిష్మెంట్ ఇచ్చారు. అర్జీలు ఇచ్చేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఉదయం నుంచే సామాన్యులు, వృద్ధులు, దివ్యాంగులు క్యూలైన్‌లో బారులు తీరారు. అధికారులు ఉదయం 9 :30 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి రావాల్సి ఉన్నా ఆలస్యంగా వచ్చారు. దీంతో కలెక్టర్ సంగీత వారిని బయటే నిలబెట్టారు. ఇలాంటి అధికారులకు ఇదే సరైన శిక్ష అంటూ అక్కడికి వచ్చిన వారు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ చర్యను ప్రశంసించారు.

టూత్ పేస్ట్ అనుకుని ఎలుకల మందుతో..

–వృద్ధురాలి మృతి

అన్నానగర్: తిరుపుల్లాణిలో ఓ వృద్ధురాలు టూత్ పేస్ట్ అనుకుని ఎలుకల మందుతో పళ్లు తోమడంతో మృత్యువాతపడింది. వివరాలు.. రామనాథపురం జిల్లా తిరుపుల్లని సమీపంలోని రేగునాథపురానికి చెందిన దైవచిలై భార్య మైథిలి (69) ఆదివారం పొద్దున్నే పళ్లు తోముకోవడానికి బాత్‌రూం వెళ్లింది. అక్కడ టూత్ పేస్టు అనుకుని ఎలుకల పేస్టుతో పళ్లు తోముకుంది. దీంతో స్పృహతప్పి పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నెల్‌లై ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. అల్లుడు శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపుల్లని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

• ఆకట్టుకున్న ఫ్యాషన్ షో


చెన్నైలోని విజయామాల్‌లో మ్యాక్స్ ఫ్యాషన్ సంస్థ ఆధ్వర్యంలో ఫ్యాషన్ షోను నిర్వహించారు. ఇందులో ప్రముఖ సినీనటి వాణీ భోజన్ పాల్గొని అభిమానుల సందడి చేసింది. ప్రముఖ మోడల్స్ సరికొత్త మ్యాక్స్ ఫ్యాషన్ దుస్తులను ధరించిన చేసిన క్యాట్‌వాక్ ఆకట్టుకుంది. – సాక్షి, చెన్నై

పాఠశాలలో వాటర్‌ప్లాంట్

పళ్లిపట్టు: విద్యార్థులకు శుద్ధనీరు అందించాలనే ఉద్దేశంతో పళ్లిపట్టు ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే చంద్రన్ సోమవారం ప్రారంభించారు. ఈ పాఠశాలలో 470 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. పాఠశాలలో తాగునీటి సమస్యతో పాటు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందిపడేవారు. పాఠశాల పీటీఏ కమిటీ కోరిక మేరకు పళ్లిపట్టుకు చెందిన రైతు, లయన్స్‌క్లబ్ కోశాధికారి వేలు రూ. లక్ష వ్యయంతో పాఠశాలలో తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేసి కుళాయిల ద్వారా విద్యార్థినులకు శుద్ధనీరు సరఫరాకు ఏర్పాట్లు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చంద్రన్ హాజరై ప్రారంభించారు. వేలు చొరవను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల పీటీఏ అధ్యక్షుడు, టౌన్ పంచాయతీ వైస్ చైర్మన్ జ్యోతికుమార్, టౌన్ పంచాయతీ చైర్‌పర్సన్ మణిమేఘలై, లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ వాసు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగనన్న ఆరోగ్య సురక్ష




కృష్ణాజిల్లా మద్దూరులో దివ్యాంగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


ప్రకాశం జిల్లా నేకునాంబాద్ గ్రామంలోని శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు


తూర్పు గోదావరి జిల్లా మధురపూడిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు


శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

జగనన్న ఆరోగ్య సురక్ష — 12 వ రోజు



ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన క్యాంప్‌ల సంఖ్య **6,428**

వైద్య సేవలు పొందిన ప్రజలు **23,53,545**

పట్టణాల్లో నిర్వహించిన క్యాంప్‌లసంఖ్య **433**

వైద్య సేవలు పొందిన ప్రజలు **2,44,942**

మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫర్ చేసినవారి సంఖ్య **56,296**


ఎన్టీఆర్ జిల్లా విజయవాడ శిబిరంలో వైద్యసేవలను పరిశీలిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు


పల్నాడు జిల్లా కండ్లకుంట శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రేగడిచెలికలో అవ్వకు కంటి అద్దాలు పెట్టిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


అనంతపురంలోని శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు


చిత్తూరు జిల్లా ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం.


విశాఖ జిల్లా భీమిలి మండలం దాకమర్రిలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది


విజయనగరం జిల్లా తెర్లాం మండలం ఉద్దవోలులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి హాజరైన రోగులు, ప్రజలు


కర్నూలు జిల్లా వెల్దుర్తిలో నిర్వహించిన శిబిరంలో ఓపీ సేవలందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

క్లుప్తంగా...

'ఈశాన్య' ఆగమనం మరింత ఆలస్యం!

సాక్షి, విశాఖపట్నం: నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ఆలస్యంగా మొదలు కావడం, ఆపై నెమ్మదిగా ఉపసంహరించుకోవడంతో ఈ ఏడాది ఈశాన్య రుతుపవనాల ఆగమనం మరింత ఆలస్యం కానుంది. ఏటా సెప్టెంబర్ 17న రాజస్థాన్ నుంచి ఈ రుతుపవనాల ఉపసంహరణ ప్రారంభం కావాల్సి ఉండగా.. ఈసారి వారం రోజులు ఆలస్యంగా సెప్టెంబర్ 25న వీటి ఉపసంహరణ ప్రక్రియ మొదలయ్యింది. ప్రస్తుతం ఈ రుతుపవనాల ఉపసంహరణ రేఖ ఆంధ్రప్రదేశ్ మీదుగా విశాఖపట్నాన్ని తాకుతూ పయనిస్తోంది. వాస్తవానికి అక్టోబర్ 15 నాటికల్లా దేశం నుంచి పూర్తిగా నిష్క్రమించాల్సి ఉండగా.. ఇందుకు మరికొన్నాళ్లు పట్టే అవకాశం ఉంది. సాధారణంగా ఈశాన్య రుతుపవనాలు అక్టోబర్ 18–22 తేదీల మధ్య తమిళనాడులోకి, ఆ వెనువెంటనే దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తాయి. కానీ ఐఎండీ తాజా నివేదిక ప్రకారం తమిళనాడులో ఈనెల 23–25 తేదీల మధ్య ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. దీనిని బట్టి ఆంధ్రప్రదేశ్‌లో వీటి ఆగమనానికి వారం రోజుల సమయం పడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

శస్త్రచికిత్సల్లో అనస్థీషియా వైద్యుల పాత్ర కీలకం

డీఎంఈ డాక్టర్ నరసింహం

సాక్షి, అమరావతి: రోగులకు శస్త్రచికిత్సల్లో అనస్థీషియా(మత్తు) వైద్యుల పాత్ర ఎంతో కీలకమని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ నరసింహం అన్నారు. సోమవారం ప్రపంచ అనస్థీషియా దినోత్సవం సందర్భంగా డీఎంఈ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ నరసింహం మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా బోధనాస్పత్రుల్లో పూర్తి స్థాయిలో అనస్థీషియా వైద్యులు సమకూరారని చెప్పారు. రోగుల తాకిడి, సర్జరీలకు అనుగుణంగా అదనపు విభాగాలు ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. అనస్థీషియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా దేశవ్యాప్తంగా సమాజానికి మేలు చేసే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్ అధ్యక్షుడు డాక్టర్ భీమేశ్వర్ చెప్పారు. ఈ ఏడాది స్కూళ్లు, కాలేజీలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో 'బేసిక్ లైఫ్ సపోర్ట్'పై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏడీఎంఈలు డాక్టర్ సూర్యశ్రీ, డాక్టర్ రఘునందన్, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన లేళ్ల అప్పిరెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పిరెడ్డి

పట్నంబజారు: శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి.. సముచిత స్థానం కల్పించడంలో వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ముందుంటుందన్నారు.

కరువు మండలాలను ప్రకటించాలి : సీపీఎం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కరువు మండలాలను వెంటనే ప్రకటించి తక్షణం కరువు సహాయ చర్యల్ని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశం తీర్మానించింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం జరిగింది. పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పాల్గొన్నారు.

సీఎం జగన్ లక్ష్యం.. ఆరోగ్యాంధ్రప్రదేశ్

రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

కొమ్మాది(విశాఖపట్నం): రాష్ట్రంలో ప్రతి గడపకు వైద్య సేవలందించి.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని అన్నారు. కొమ్మాది అమరావతినగర్‌లో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలసి ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం పేద, మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షగా ఉండేదని.. కానీ నేడు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఇంటికీ వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య సురక్షకు లభిస్తున్న స్పందన నేపథ్యంలో సీఎం జగన్ ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి సచివాలయం పరిధిలో ఈ శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఏడు రకాల జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి.. ఉచితంగా మందులు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం గర్భిణులకు మంత్రి సామూహిక సీమంతాలు నిర్వహించారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు పాల్గొన్నారు.


గర్భిణులకు సీమంతం చేస్తున్న మంత్రి విడదల రజిని

ఊపిరి పోసిన జగనన్న ఆరోగ్య సురక్ష

సీపీఆర్‌తో యువకుడిని కాపాడిన వైద్య బృందం

తుని రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య బృందం అందించిన అత్యవసర వైద్య సేవలు ఓ యువకుడి ప్రాణాలు నిలబెట్టాయి. కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు టి.వెంకటాపురంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. హెచ్.కొత్తూరుకి చెందిన మలగంటి లోకేష్ ఉన్నట్టుండి ఆయాసంతో కుప్పకూలిపోయాడు. అతడికి మెరుగైన వైద్యం అందించాలంటే 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుని పట్టణానికి తీసుకువెళ్లాలి. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న టి.వెంకటాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతోందని తెలుసుకున్న లోకేష్ బంధువులు వెంటనే అక్కడికి తీసుకువెళ్లారు. వైద్య బృందం 104లో ఉంచి సీపీఆర్ పరికరంతో హృదయ స్పందన, శ్వాస తిరిగి ప్రారంభమయ్యేలా ప్రయత్నం చేశారు. వారి కృషి ఫలించడంతో కొంతసేపటికి హృదయ స్పందన తిరిగి ప్రారంభమై లోకేష్ కళ్లు తెరిచాడు. వెంటనే ఎర్రకోనేరు గ్రామం వరకూ 104లో, అక్కడి నుంచి 108లో తుని ఆస్పత్రికి తరలించారు. గోల్డెన్ సెక్షన్స్‌లో సీపీఆర్ సేవలు అందించడం సత్ఫలితాన్ని ఇచ్చిందని వైద్యులు చెప్పారు.


సీపీఆర్‌తో లోకేష్‌ను బతికించేందుకు ప్రయత్నిస్తున్న డాక్టర్ సౌమ్య, వైద్య బృందం

'ఆరోగ్యశ్రీ' అమలు భేష్

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అమలు బాగుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.రవికృష్ణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలోనే ఐఎంఏ అనేది అతిపెద్ద సంఘమని దీనికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 1,750 శాఖల్లో 4,000 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ఏపీలోని 98 శాఖల్లో 20,000కు పైగా సభ్యులున్నారని చెప్పారు. ఇటీవల కాలంలో వైద్యులపైన దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని నివారించి స్వేచ్ఛాయుత వాతావరణంలో వైద్యులు సేవలందించేలా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్ 2008లో వైద్యులపైన, ఆస్పత్రులపై దాడుల నిరోధానికి చట్టం తీసుకువచ్చారని, తర్వాత 16 రాష్ట్రాలు ఇదే విధమైన చట్టాలు తెచ్చాయని గుర్తు చేశారు. దీనిని మరింత పటిష్టం చేయాలని కోరారు. 20 పడకలు ఉన్న ఆస్పత్రులకూ ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలన్నారు.

'ఒక జిల్లా–ఒక ఉత్పత్తి'లో చేనేత హవా

రాష్ట్రం నుంచి ఎంపికైన 14 ఉత్పత్తుల్లో 8 చేనేత ఉత్పత్తులే

- తుది దశలో జాతీయ అవార్డుల పరిశీలన
- నేటితో పూర్తికానున్న ఇన్వెస్ట్ ఇండియా బృందం పర్యటన

సాక్షి, అమరావతి: దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఒక ఉత్పత్తిని గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఒక జిల్లా–ఒక ఉత్పత్తి (ఓడీఓపీ) జాతీయ అవార్డుల ప్రక్రియ తుది దశకు చేరింది. ఓడీఓపీ జాతీయ అవార్డు–2023కు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఇటీవల దరఖాస్తులను స్వీకరించారు. ఈ ఏడాది జూన్ 25నుంచి జూలై 31 మధ్య దేశంలోని 751 జిల్లాల నుంచి 1,102 రకాల స్థానిక ప్రత్యేక నైపుణ్యాన్ని ప్రతిబింబించే హస్తకళా ఉత్పత్తుల ప్రతిపాదనలు వచ్చాయి. వడపోత అనంతరం దేశంలో మొత్తం 63 ఉత్పత్తులను పరిశీలనకు తీసుకున్నారు. వాటిలో ఏపీ నుంచి 14 ఉత్పత్తులకుచోటు లభించింది. వీటిని ఇన్వెస్ట్ ఇండియా బృందం (జాతీయ స్థాయి టీమ్) క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టింది. ఈ నెల 10న మొదలైన ఈ బృందం పర్యటన ఈ నెల 17వ తేదీతో ముగియనుంది.

14 ఉత్పత్తులు ఇవే..

రాష్ట్రం నుంచి పరిశీలనకు ఎంపికైన ఉత్పత్తులలో పొందూరు ఖద్దరు (శ్రీకాకుళం), బొబ్బిలి వీణ (విజయనగరం), అరకు కాఫీ (ఏఎస్ఆర్), సముద్ర రొయ్యలు (విశాఖ), పులగుర్త చొక్కాలు, చీరలు (తూర్పుగోదావరి), ఉప్పాడ జాందానీ చీరలు (కాకినాడ), కొబ్బరి, కొబ్బరి పీచు (అంబేడ్కర్ కోనసీమ), మంగళగిరి చేనేత చీరలు (గుంటూరు), పెద్ద రొయ్యలు (బాపట్ల), ఉదయగిరి చెక్క కత్తిపీట (నెల్లూరు), చేనేత సిల్క్ చీరలు (కర్నూలు), మదనపల్లె సిల్క్ చీరలు (అన్నమయ్య), సిల్క్ చీరలు (శ్రీ సత్యసాయి), వెంకటగిరి చీరలు (తిరుపతి) ఉన్నాయి. ఇన్వెస్ట్ ఇండియా తరఫున ఆరాధన, హరిప్రీత్‌సింగ్, నమీర అహ్మద్, రాబిన్ ఆర్ చెరియన్, సోనియా, ఆకాంక్ష, జిగిషా తివారీ బృందం వేర్వేరుగా 8 రోజులపాటు వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అవార్డుకు ఎంపికైతే మంచి మార్కెటింగ్

వ్యవసాయ, హస్తకళా ఉత్పత్తుల ప్రతిభను వెలికితీసి వాటికి జాతీయ, అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఓడీఓపీ కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లాల వారీగా ప్రత్యేక నైపుణ్య ఉత్పత్తులను గుర్తించి ప్రోత్సహించేలా అవార్డులు ఇస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 24 జిల్లాల్లో ప్రత్యేకత సంతరించుకున్న 38 రకాల ఉత్పత్తులను ఎంపిక చేసి ఓడీఓపీ జాతీయ అవార్డుకు దరఖాస్తు చేశాం. ఏపీ నుంచి 14 ఉత్పత్తులను తుది పరిశీలనకు ఎంపిక చేయగా.. వాటిలో 8 చేనేత వస్త్రాల ఉత్పత్తులు ఉండటం గొప్ప విషయం. జాతీయ అవార్డుకు ఎంపికైన వాటికి మార్కెటింగ్ రంగంలో మంచి గుర్తింపు లభించి ఆయా జిల్లాల్లో సామాజిక–ఆర్థిక అభివృద్ధికి ఊతం లభిస్తుంది.
– కె.సునీత, ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర చేనేత జౌళి శాఖ

రక్తహీనత, బాల్య వివాహాలపై చర్చించండి

పొదుపు సంఘాల మహిళలకు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

సాక్షి, అమరావతి: స్వయం సహాయక పొదుపు సంఘాల కార్యక్రమాల్లో భాగంగా మహిళలు తమ సంఘాల వారీగా ప్రతినెలా నిర్వహించుకునే సమావేశాల్లో పిల్లలు, గర్భిణుల్లో రక్తహీనత సమస్య, బాల్య వివాహాల నివారణ, పిల్లలందరికీ విద్య వంటి అంశాలను అజెండాగా చేర్చి తప్పనిసరిగా చర్చ నిర్వహించాలని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ సూచించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కైలాష్ సత్యార్థి ఫౌండేషన్, బచపన్ బచావో ఆందోళన్, వాసవ్య మహిళా మండలి భాగస్వామ్యంతో విజయవాడలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్‌తోపాటు వివిధ జిల్లాల డీఆర్‌డీఏ పీడీలు, రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు ఎందుకు చేయకూడదో సాంకేతికపరమైన అంశాలపై చర్చించుకుని, తమ ప్రాంతంలో ఏవైనా ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు పిల్లలను, పెద్దలకు అర్థం అయ్యేలా కౌన్సెలింగ్ చేయాలని మహిళలకు సూచించారు. తమ ప్రాంతాల్లో ఒక్క బాల్య వివాహం కూడా జరుగకుండా మహిళా సంఘాలు బాధ్యత తీసుకుని పనిచేయాలన్నారు. చిన్నారులు గర్భిణుల్లో రక్తహీనత సమస్య తదితర సామాజికపరమైన అంశాలలో కీలకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పొదుపు సంఘాల మహిళలతో తమ ప్రాంతంలో బాల్య వివాహాల నివారణకు కృషి చేస్తామంటూ ప్రమాణం చేయించారు.


ప్రమాణం చేయిస్తున్న ఉన్నతాధికారులు

టెన్నిస్ క్రీడాకారిణి జెఫ్రీన్‌కు సత్కారం

సెర్ప్ కార్యాలయంలో జరిగిన మరో కార్యక్రమంలో టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జఫ్రీన్‌ను సెర్ప్ సీఈవో ఇంతియాజ్ సత్కరించారు. తనకున్న లోపాన్ని కూడా అధిగమించి జెఫ్రీన్ ఎన్నో మెడల్స్ సాధించారని, ఒలింపిక్స్‌లో సత్తా చాటారంటూ ఇంతియాజ్ కొనియాడారు.

విశాఖలోనూ విద్యుత్ నియంత్రణ మండలి

- ఉత్తరాంధ్ర, కోస్తా ప్రజలు, పారిశ్రామిక, వ్యాపార వేత్తలకు అందుబాటులో ఉండేలా కార్యకలాపాలు
- నవంబర్ 4న క్యాంపు కార్యాలయంలో ఒకే రోజు తొమ్మిది పిటిషన్లపై బహిరంగ విచారణ
- 1999లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఏర్పడ్డ విద్యుత్ నియంత్రణ మండలి
- రాష్ట్ర విభజన తర్వాత అమరావతికి తరలిస్తూ ఆదేశాలిచ్చినా హైదరాబాద్ కేంద్రంగానే విధులు
- ఇటీవల ప్రారంభించిన క్యాంపు కార్యాలయం నుంచి ఇకపై ప్రైవేటు కేసులపైనా విచారణ

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి దిశగా మరో అడుగు ముందుకు పడుతోంది. అక్కడి ప్రజలకు, పారిశ్రామిక, వ్యాపార వేత్తలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్‌సీ) త్వరలో అందుబాటులోకి వస్తోంది. కొన్ని విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, కేసులను విశాఖ నుంచే ఏపీ ఈఆర్‌సీ పరిష్కరించనుంది. గుంటూరు నుంచి శ్రీకాకుళం వరకూ ఉన్న వినియోగదారులకు హైదరాబాద్‌కు, భవిష్యత్‌లో కర్నూలుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా విశాఖలోనూ కార్యకలాపాలు మొదలుపెడుతోంది.

హైదరాబాద్ నుంచి ఆంధ్రాకు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కోసం హైదరాబాద్ కేంద్రంగా 1999 మార్చిలో ఏపీ ఈఆర్సీ ఏర్పడింది. రాష్ట్ర విభజన తరువాత అమరావతి ప్రాంతానికి తరలిస్తూ 2014 ఆగస్టులో ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే.. విద్యుత్ నియంత్రణ మండలి మాత్రం హైదరాబాద్ కేంద్రంగానే పనిచేస్తూ వస్తోంది. ప్రస్తుతం అనేక కేసుల్లో వాయిదాలకు హాజరయ్యేందుకు విద్యుత్ సంస్థల అధికారులు, ముఖ్యంగా విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీలు తరచూ హైదరాబాద్‌లోని ఏపీ ఈఆర్సీ ప్రధాన కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. కనీసం రెండు, మూడు రోజులు ఏపీ ఈఆర్‌సీ అధికారులు రాష్ట్రంలో అందుబాటులో ఉండటం లేదు. 24 గంటలూ పనిచేయాల్సిన అత్యవసర విభాగాల్లో విద్యుత్ శాఖ ప్రధానమైనది కావడంతో ప్రజలకు కూడా దీనివల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇకపై ఈ పరిస్థితిలో చాలా వరకూ మార్పు రానుంది. కర్నూలులో ఏపీ ఈఆర్‌సీ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడి నుంచే విధులు నిర్వర్తించాలని ఈ ఏడాది ఏప్రిల్ 25న రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు అక్కడ భవన నిర్మాణం జరుగుతోంది.

షెడ్యూల్ నోటిఫికేషన్ విడుదల

కొన్నేళ్లుగా వార్షిక టారిఫ్ ఆర్డర్ (విద్యుత్ చార్జీల సవరణ)పై ప్రజాభిప్రాయ సేకరణ, ఆర్డర్ విడుదల వంటి కార్యకలాపాలను మాత్రమే విశాఖపట్నం నుంచి నియంత్రణ మండలి నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఆగస్టు 18న ఏపీ ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఆవరణలో ఏపీ ఈఆర్సీ క్యాంపు కార్యాలయం ప్రారంభమైంది. ఆ మరుసటి రోజే రాష్ట్ర విద్యుత్ సంస్థలు తయారు చేసిన ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ప్లాన్‌పై ఏపీ ఈఆర్సీ బహిరంగ విచారణ చేపట్టింది. ఎప్పుడూ హైదరాబాద్‌లోని కమిషన్ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ విచారణ విశాఖలో కొత్తగా ప్రారంభించిన క్యాంపు కార్యాలయంలో జరిగింది. అయితే.. ఇది ఏపీ ట్రాన్స్‌కో, విద్యుత్ పంపిణీ సంస్థలు ఇచ్చిన నివేదికలపై జరిగిన విచారణ. ఇదే కాకుండా ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు వేసిన పిటిషన్లపై కూడా కమిషన్ విచారణ చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. నవంబర్ 4న క్యాంపు కార్యాలయంలో ఒకేరోజు 9 పిటిషన్లపై బహిరంగ విచారణ చేపట్టనుంది. షెడ్యూల్ నోటిఫికేషన్‌ను ఏపీఈఆర్సీ తాజాగా విడుదల చేసింది.

కౌలు రైతులకు తీపికబురు

కౌలుదారులకు నూరు శాతం రుణ పరపతి

- లోన్‌చార్జ్ మాడ్యూల్‌లో ఇప్పటివరకు భూ యజమానుల వివరాలే
- వెబ్‌ల్యాండ్ పోర్టల్‌తో సీసీఆర్సీ పోర్టల్ అనుసంధానం
- ఇకనుంచి భూ యజమానులతో పాటు కౌలుదారుల వివరాలు లభ్యం
- రుణాల మంజూరులో బ్యాంకర్లకు మరింత వెసులుబాటు
- ఈ సీజన్‌లో రూ.4 వేల కోట్ల రుణాల మంజూరు లక్ష్యం



సాక్షి, అమరావతి: కౌలు రైతులకు మరింత అండగా నిలవాలని ప్రభుత్వం సంకల్పించింది. గడచిన నాలుగేళ్ల కంటే మిన్నగా ఈ ఏడాది పంట హక్కు సాగు పత్రాలు (కౌలు కార్డులు) జారీ చేసిన ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పంట రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం తొలిసారిగా సీసీఎల్ఏ వెబ్‌ల్యాండ్ పోర్టల్‌తో సీసీఆర్సీ వెబ్‌పోర్టల్‌ను అనుసంధానించింది. ఫలితంగా బ్యాంక్ లోన్‌చార్జ్ మాడ్యూల్‌లో భూ యజమానులతోపాటు కౌలుదారుల వివరాలను సైతం బ్యాంకర్లు ఖరారు చేసుకుని సాధ్యమైనంత ఎక్కువ మంది కౌలుదారులకు పంట రుణాలు మంజూరు చేసే అవకాశం కల్పించింది. సాధారణంగా సీసీఎల్ఏ వెబ్‌ల్యాండ్ పోర్టల్ బ్యాంకుల లోన్‌చార్జ్ మాడ్యూల్‌లో అనుసంధానమై ఉంటుంది. లోన్‌చార్జి మాడ్యూల్‌లో సర్వే నంబర్ లేదా ఆధార్ నంబర్ నమోదు చేయగానే భూ యజమానుల పేర్లు మాత్రమే కన్పించేవి. దీంతో కౌలుదారులకు రుణాల మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ఏదో సాకుతో వెనుకడుగు వేస్తుండేవారు. రబీ సీజన్‌లో మరింత ఎక్కువ మంది కౌలుదారులకు రుణాలు మంజూరు చేయడమే లక్ష్యంతో సీసీఎల్ఏ వెబ్‌ల్యాండ్ పోర్టల్‌ను సీసీఆర్సీ వెబ్ పోర్టల్‌తో ప్రభుత్వం అనుసంధానించింది. లోన్‌చార్జ్ మాడ్యూల్‌తో సీసీఎల్ఏ వెబ్‌ల్యాంబ్ పోర్టల్ అనుసంధానించి ఉండడంతో ఆటోమేటిక్‌గా లోన్‌చార్జి మాడ్యుల్‌లో భూ యజమానుల వివరాలతో పాటు కౌలుదారుల వివరాలు కూడా బ్యాంకర్లకు కనిపిస్తాయి.

భూ యజమానులను ఒప్పించి..

భూ యజమానుల వివరాలతో పాటు కౌలు రైతుల వివరాలను ఖరారు చేసుకుని బ్యాంకర్లు వారికి రుణాలు మంజూరు చేస్తారు. ఒకవేళ కౌలుకు ఇచ్చిన భూమిపై భూ యజమాని కనుక పంట రుణం తీసుకుని ఉంటే కౌలుదారులకు పంట రుణం మంజూరు చేయరు. అయితే, సాగు చేయక పోయినప్పటికీ వరుసగా రెండు సీజన్‌లలో భూ యజమాని కనుక పంట రుణం పొంది ఉంటే, అటువంటి వారిని గుర్తించి ఆర్బీకే స్థాయిలో అవగాహన కల్పిస్తారు. తమ భూమి కౌలుకు తీసుకున్న వాస్తవ సాగుదారులకు చేయూతనిచ్చేలా సహకరించాలని సూచిస్తారు. ఫలితంగా భూ యజమానుల స్థానంలో కౌలుదారులు పంట రుణాలు పొందే అవకాశం ఏర్పడుతుంది.

నూరు శాతం రుణాలు మంజూరే లక్ష్యం

మరింత ఎక్కువ మంది కౌలుదారులకు పంట రుణాలు మంజూరు చేయడమే లక్ష్యంగా సీసీఎల్ఏ వెబ్‌ల్యాండ్ పోర్టల్‌తో సీసీఆర్సీ పోర్టల్‌ను అనుసంధానం చేశాం. ఫలితంగా కౌలుదారులకు రుణాల మంజూరు విషయంలో బ్యాంకర్లకు మరింత వెసులుబాటు కలుగుతుంది. జేఎల్‌జీ గ్రూపులతో పాటు వ్యక్తిగతంగా కూడా కౌలుదారులు పంట రుణాలు మంజూరు చేయడమే లక్ష్యంగా ఈ మార్పు చేశాం.
– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయ శాఖ

నాలుగేళ్లలో రూ.6,906 కోట్ల పంట రుణాలు..

రాష్ట్రంలో 16 లక్షల మంది కౌలుదారులు ఉంటారని అంచనా. వీరికి ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ.1.60 లక్షల వరకు పంట రుణం అందించే అవకాశం ఉన్నా.. ఆంక్షల పేరిట బ్యాంకులు మోకాలడ్డేవి. ప్రస్తుతం ఏటా 11 నెలల కాల పరిమితితో జారీ చేస్తున్న కౌలు కార్డుల ఆధారంగా పంట రుణాలతో పాటు సంక్షేమ ఫలాలు అందిస్తోంది. నాలుగేళ్లలో 17.61 లక్షల మందికి సీసీఆర్సీలు జారీ చేయగా.. వీరిలో 9.83 లక్షల మందికి రూ.6,905.76 కోట్ల పంట రుణాలు మంజూరు చేశారు. 2023–24 సీజన్‌లో 8.89 లక్షల మంది కౌలుదారులకు సీసీఆర్సీల జారీ లక్ష్యం కాగా.. ఇప్పటికే 8.19 లక్షల మందికి సీసీఆర్సీలు జారీ చేశారు. వీరికి కనీసం రూ.4 వేల కోట్ల పంట రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటికే 3.33 లక్షల మందికి రూ.1,085.42 కోట్ల పంట రుణాలు మంజూరు చేశారు.



సంకల్పమే సగం బలం

● డాక్టర్ విజయ శారదారెడ్డి

చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్య చట్టం ఊగిసలాడుతున్న సమయం అది. శాసన నిర్మాణంలో మహిళల భాగస్వామ్యం అవసరాన్ని గుర్తించారామె. 'ఐ విల్' (ఇండియన్ ఉమెన్ ఇన్ లీడర్‌షిప్) కోర్సు చేశారు. మహిళల జ్ఞానం... విజ్ఞత పరిపూర్ణమైనదని గ్రామీణమహిళలను చైతన్యవంతం చేశారు. బ్యూటీ కాంటెస్ట్ కూడా సామాజిక చైతన్యానికి ఒక మాధ్యమం అని గుర్తించారు. ఇప్పుడు ఆ కిరీటాన్ని కూడా గెలుచుకుని... తెలుగు రాష్ట్రాల్లో విజేతగా నిలిచారు. మిసెస్ ఇండియా పోటీలలో తనను తాను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నారు.

డాక్టర్ విజయ శారదారెడ్డి... విద్యాసంస్థలను నిర్వహించిన దిట్ట. చదువు చెప్పాలన్నా, చదువు చెప్పించాలన్నా తాను అంతకంటే పెద్ద చదువులు చదివి ఉండాలనేది ఆమె నమ్మకం. అందుకే ఎం.ఎ హిస్టరీ, ఎంఈడీ చేశారు. ఎంబీఏ, ఎం.ఎస్‌సీ. సైకాలజీ, ఎం.ఫిల్, పీహెచ్‌డీ చేశారు. గౌరవపూర్వకంగా మరో డాక్టరేట్ అందుకున్నారు. సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ పొందారు. పదివేల మందికి పైగా సాఫ్ట్‌స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించారు. యూఎస్, యూకేల్లో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులు చేశారు. బెంగళూరు ఐఐఎమ్ నుంచి 'ఐ విల్' కోర్సు చేశారు. "పెళ్లినాటికి నేను చదివింది బీఎస్సీనే. పై చదువులన్నీ పెళ్లి తర్వాతనే. పెళ్లి అనేది మహిళ అభివృద్ధికి దోహదం చేయాలి తప్ప, మహిళ ఎదుగుదలకు అవరోధం కాకూడదని, సంకల్ప బలం, భాగస్వామి సహకారం ఉంటే ఏదైనా సాధించగలమనే వాస్తవాన్ని సాటి మహిళలకు తెలియచెప్పడానికి ఇన్నేళ్లుగా నా వంతు ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఇప్పుడు మిసెస్ ఇండియా పోటీల్లో పాల్గొనడంలో ఉద్దేశం కూడా అదే. ఈ పోటీల్లో అరవై ఏళ్లు నిండిన వయసు మహిళల విభాగం 'సూపర్ క్లాసిక్'లో పాల్గొని 'మిసెస్ తెలంగాణ- ఆంధ్రప్రదేశ్' విజేతనయ్యాను'' అన్నారామె.



ప్రతి రోజూ అమూల్యమే!

సౌందర్యమంటే బాహ్యసౌందర్యమే అయితే నా ఎత్తు, నా మేనిఛాయ అందాల పోటీలకు సరిపోవు. ప్రకటన చూసిన వెంటనే ఫోన్ చేసి మాట్లాడాను. 'బ్యూటీ' అనే పదం పరిధిని విస్తరించడంతోపాటు బ్యూటీ అంటే దేహసౌందర్యమనే అపోహను తొలగించడం, అందం అంటే కొలతలకు లోబడి ఉండడం కాదని తెలియచేయడంతోపాటు 'ఇన్నర్ బ్యూటీ' ప్రాధాన్యతను సమాజానికి తెలియచెప్పడానికే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళ జీవితం పెళ్లికి ముందు - పెళ్లి తర్వాత అనే వర్గీకరణ చట్రంలో ఉండిపోతోంది. ఆ చట్రంలో ఉండిపోయిన చాలామంది మహిళల్లో తమను తాము కోల్పోయిన భావన కలుగుతుంటుంది. మన జీవితంలో ప్రతి రోజూ అమూల్యమైనదేనని మహిళలకు తెలియచెప్పడానికి నేను ఈ పోటీలో పాల్గొన్నాను.

– డాక్టర్ విజయ శారదారెడ్డి
మిసెస్ తెలంగాణ- ఆంధ్రప్రదేశ్

ఉన్నది ఒకటే ఆప్షన్!

మిసెస్ ఇండియా పోటీల్లో భాగంగా 'తెలంగాణ- ఆంధ్రప్రదేశ్' సూపర్ క్లాసిక్ ఫైనల్స్ హైదరాబాద్‌లో సెప్టెంబర్ 24వ తేదీన జరిగాయి. ఎనిమిది నెలల నుంచి దశల వారీగా జరిగిన పోటీలవి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దాదాపు ఇరవై సెషన్స్ జరిగాయి. పోటీలో ఎవరెవరున్నారో కూడా తెలియదు. ఒక్కో సెషన్స్‌లో పాల్గొంటూ మాకిచ్చిన టాస్క్‌ను ఒక నిమిషం వీడియో ద్వారా ప్రెజెంట్ చేస్తూ వచ్చాం. ఈ పోటీల ద్వారా నాకు ఓ కొత్త ప్రపంచం గురించి తెలిసింది. మేధోపరమైన జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, మానసిక పరిణతి- పరిపక్వత, సమయానుకూలంగా స్పందించడం, సమాజాన్ని అర్థం చేసుకునే కోణం వంటివన్నీ ఉన్నాయి. నా పోటీదారుల బలాలేమిటో నాకు తెలియదు. నాకున్న ఆయుధం 'నేను గెలిచి తీరాలి' అనే పట్టుదల మాత్రమే. పోటీల్లో పాల్గొనప్పుడు మనకుండేది గెలవాలనే ఆప్షన్ ఒక్కటే. ప్లాన్ బీ ఉండకూడదు. ఏ అవకాశాన్నీ తేలిగ్గా తీసుకోలేదు. ప్రతి రౌండ్‌లో ప్రజెంటేషన్స్ చాలా థియరిటికల్‌గా ఇచ్చాను. ఫైనల్ రౌండ్‌లో విజేతలను ప్రకటించేటప్పుడు కూడా 'నేను రన్నర్ అప్ కాదు' అనుకుంటూ ఆత్మస్థయిర్యంతో ఉండగలిగాను.

ఇవే విజేతను చేశాయి!

మన సమాజంలో... అరవై ఏళ్లు వచ్చాయంటే 'ఒక చోట కూర్చుని కృష్ణా! రామా! అనుకునే సమయం, అనే భావనను మహిళలు కూడా ఒంటబట్టించుకున్నారు. నిజానికి భగవంతుడిని తలుచుకోవడానికి వార్ధక్యం రానవసరం లేదు. నా దైనందిన జీవితంలో ఎప్పుడూ దైవపూజ కూడా ఒక భాగంగా ఉండేది. ఉదయం మూడున్నరకు రోజు మొదలయ్యేది. వంట, పూజ, ఇంటి పనులన్నీ ముగించుకుని ఏడున్నరకంతా స్కూల్లో ఉండేదాన్ని. అప్పట్లో రోజుకు పద్దెనిమిది గంటలు పని చేయాల్సిన అవసరమే నన్ను ప్రత్యేకమైన వ్యక్తిగా తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా నేను చెప్పేదేమిటంటే... అరవై నిండాయని మనతెలివితేటలు, అనుభవాలను అటకెక్కించాల్సిన అవసరం లేదు. కుటుంబం కోసం పని చేయాల్సిన అవసరం లేకపోతే సమాజం కోసం పని చేద్దాం. చిన్నప్పుడు మనకు తీరకుండా ఉండిపోయిన సరదాలను తీర్చుకుందాం. నాకు బొమ్మలేయడం ఇష్టం. ఇప్పుడు ప్రశాంతంగా బొమ్మలు వేసుకుంటున్నాను.

మహిళలు సాధించలేనిది లేదు!

చంద్రయాన్ ప్రాజెక్టులో తమను తాము నిరూపించుకున్నా, రాకెట్‌తో సమానంగా దూసుకుపోతున్నా సరే మహిళలు సమానత్వ సాధన కోసం పోరాడాల్సిన దుస్థితి ఇంకా పోలేదు. మహిళలను అణచి వేసింది సమాజమే, ప్రోత్సహించాల్సింది కూడా సమాజమే. ప్రభుత్వాలు చట్టం చేసి సరిపుచ్చకుండా వాటి అమలుతోపాటు మహిళలకు ప్రోత్సాహం కల్పించాలి. 'ఐ విల్' కోర్సు చెప్పేది కూడా అదే. ప్రతి మహిళలో నాయకత్వ లక్షణాలు అంతర్లీనంగా ఉంటాయి. అవి బహిర్గతమయ్యే అవకాశం ఆమెకివ్వాలి. నేను గమనించినంత వరకు ఆర్థికంగా మెరుగ్గా ఉన్న మహిళలకు తమ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇబ్బందులు ఉండడం లేదు. మధ్యతరగతి మహిళలు ఉన్నత చదువుల ఆకాంక్షను బ్యాంకు లోన్‌ల సహకారంతో సాధించుకుంటున్నారు. ఇక అల్పాదాయ వర్గాల మహిళలు మాత్రం ఎటువంటి అవకాశం లేక ఆశలను చిదిమేసుకుంటున్నారు. ఈ గ్యాప్‌ని స్టూడెంట్ ఎక్స్‌ఛేంజ్ వంటి ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రభుత్వాలు భర్తీ చేయగలిగితే వారి జీవితాలు కూడా కాంతులీనుతాయి. నా వంతుగా మహిళలను చైతన్యవంతం చేయడానికి ప్రతి మాధ్యమాన్ని ఉపయోగించుకుంటున్నాను'' అన్నారామె పరిపూర్ణంగా నవ్వుతూ.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: నోముల రాజేశ్ రెడ్డి

స్ఫూర్తి

ఇష్టమైన కళ తీరిన వేళ


● సునిత

'అయ్యో' అనుకుంటే ఎదురుగుండా కనిపించే దారిలో అన్నీ అవరోధాలే కనిపిస్తాయి. 'అయినా సరే' అనుకుంటే మనసు ఎన్నో మార్గాలు చూపుతుంది. కేరళలోని కన్నూర్‌కు చెందిన సునితకు బొమ్మలు వేయడం అంటే ప్రాణం. అయితే చేతులు పటుత్వం కోల్పోవడంతో కుంచెకు దూరం అయింది. 'ఇష్టమైన కళ ఇక కలగానే మిగలనుందా?' అనుకునే నిరాశామయ సమయంలో మనసు మార్గం చూపించింది. మౌత్ ఆర్టిస్ట్‌గా గొప్ప పేరు తెచ్చుకుంది...

పోలియో బాధితురాలైన సునిత త్రిప్పనిక్కర అయిదు సంవత్సరాల వయసు నుంచి బొమ్మలు వేయడం ప్రారంభించింది. సునిత మొదట్లో చేతులతోనే బొమ్మలు వేసేది. అయితే డిగ్రీ చదివే రోజుల్లో చేతుల్లో పటుత్వం కోల్పోయింది. బ్రష్ పట్టుకోవడం కష్టంగా మారింది. ఆ సమయంలో తన సోదరుడిని స్ఫూర్తిగా తీసుకుని మౌత్ ఆర్టిస్ట్‌గా మారింది. దివ్యాంగుడైన ఆమె సోదరుడు నోటితో కుంచె పట్టుకుని బొమ్మలు వేస్తాడు.

సునిత ఇప్పటివరకు అయిదు వేలకు పైగా పెయింటింగ్స్ వేసింది.

ఆమె ఆర్ట్‌వర్క్స్ సొంత రాష్ట్రం కేరళతో పాటు సింగపూర్‌లోనూ ప్రదర్శితమయ్యాయి.

ప్రకృతి సంబంధిత చిత్రాలు వేయడం అంటే సునితకు ఇష్టం. విన్సెంట్ వాన్ గో ఆమెకు ఇష్టమైన చిత్రకారుడు.

'ప్రయాణాలు చేయడం, కొత్త విషయాలు నేర్చుకోవడం అంటే ఇష్టం. ఇక రంగులు అనేవి నన్ను ఎప్పుడూ అబ్బురపరిచే అద్భుతాలు. సంప్రదాయంతో పాటు ఆధునిక చిత్రధోరణులు అంటే కూడా ఇష్టం. మొదట్లో పళ్ల మధ్య కుంచె పట్టుకుని చిత్రాలు వేయడం చాలా కష్టంగా అనిపించింది. సాధన చేస్తూ చేస్తూ కష్టం అనిపించకుండా చేసుకున్నాను' అంటుంది సునిత.

సునిత చేసే ప్రయాణాలలో కనిపించే సుందర దృశ్యాలు కాన్వాస్‌పైకి రావడానికి ఎంతోకాలం పట్టదు.

'బాధితులకు ఓదార్పును ఇచ్చే శక్తి చిత్రకళకు ఉంది' అంటాడు వ్యాన్ గో. ఆ మాట సునిత విషయంలో అక్షరాలా నిజం అయింది. క్యాన్వాస్ దగ్గర ఉన్న ప్రతిసారీ తనకు వందమంది స్నేహితుల మధ్య సందడిగా ఉన్నట్లుగా ఉంటుంది. ధైర్యం చెప్పే గురువు దగ్గర ఉన్నట్లు అనిపిస్తుంది. ఆత్మీయతను పంచే అమ్మ దగ్గర ఉన్నట్లుగా ఉంటుంది. 'నా జీవితంలోకి చిత్రకళ రాకుండా ఉండి ఉంటే పరిస్థితి ఊహకు అందనంత విషాదంగా ఉండేది' అంటుంది సునిత.

బెంగళూరు నుంచి సింగపూర్ వరకు సునిత ఆర్ట్ ఎగ్జిబిషన్స్ జరిగాయి. అక్కడికి వచ్చే వారు ఆర్టిస్ట్‌గా ఆమె ప్రతిభ గురించి మాత్రమే మాట్లాడడానికి పరిమితం కాలేదు. స్ఫూర్తిదాయకమైన ఆమె సంకల్పబలాన్ని వేనోళ్లా పొగిడారు. 'మౌత్ అండ్ ఫుట్ పెయింటింగ్ ఆర్టిస్ట్స్' సంస్థలో సభ్యురాలైన సునిత దివ్యాంగులైన ఆర్టిస్ట్‌లకు సహకారం అందించే ఎన్నో సంస్థలతో కలిసి పనిచేస్తోంది. వీల్‌చైర్‌కే పరిమితమైన వారిలో విల్‌పవర్ పెంపొందించేలా సోదరుడు గణేష్‌తో కలిసి 'ఫ్లై' అనే సంస్థను ప్రారంభించింది. 'చిరకు' పేరుతో ఒక పత్రికను నిర్వహిస్తోంది.

కాలి వేళ్లే కుంచెలై...



● సరస్వతి శర్మ

రెండు చేతులు లేకపోతేనేం సరస్వతీ శర్మకు సునితలాగే అంతులేని ఆత్మబలం ఉంది. సునిత నోటితో చిత్రాలు వేస్తే రాజస్థాన్‌కు చెందిన సరస్వతీ శర్మ కాలివేళ్లను ఉపయోగించి చిత్రాలు వేస్తుంది. ఇంగ్లీష్ సాహిత్యంలో మాస్టర్స్ చేసింది. ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లొమా చేసింది. ఎడమ కాలితో నోట్స్ రాసుకునేది. 'మొదట్లో ఆర్ట్ అనేది ఒక హాబీగానే నాకు పరిచయం అయింది. అయితే అది హాబీ కాదని, అంతులేని శక్తి అని ఆ తరువాత అర్థమైంది' అంటుంది సరస్వతీ శర్మ. కోచిలోని 'మౌత్ అండ్ ఫుట్ ఆర్టిస్ట్స్' ఆర్ట్ గ్యాలరీలో సునిత చిత్రాలతో పాటు సరస్వతి చిత్రాలను ప్రదర్శించారు. ఒకవైపు నోటితో చిత్రాలు వేస్తున్న సునిత మరోవైపు కాలివేళ్లతో చిత్రాలు వేస్తున్న సరస్వతిలను చూస్తుంటే ప్రేక్షకులకు ఆత్మబలానికి నిలువెత్తు రూపాలను చూసినట్లుగా అనిపించింది.

- ● రసాయనిక సేద్యం భూముల్ని బీళ్లుగా మార్చుతుంటే.. ప్రకృతి సేద్యం బీళ్లను సాగులోకి తెస్తుంది
- ● ప్రకృతి సేద్యంలో రైతుల ఆదాయం అధికం
- ● ప్రకృతి సేద్యంతో 2050 నాటికి నిరుద్యోగం రేటు 31 నుంచి 7 శాతానికి తగ్గుతుంది.
- ● ప్రకృతి విపత్తులను దీటుగా తట్టుకోవడం ప్రకృతి సేద్యంతోనే సాధ్యం
- ● ఎఫ్ఎఓ, సిఐఆర్ఎడి, ఆర్‌వైఎస్ సంయుక్త అధ్యయన నివేదిక వెల్లడి

ప్రకృతి సేద్యమే రక్ష!

జలమే జీవం జలమే ఆహారం.. అనే నినాదంతో ఎఫ్ఏఓ ప్రపంచ ఆహార దినోత్సవం సోమవారం నిర్వహించింది. ఈ సందర్భంగా వెలువడిన ఓ తాజా నివేదిక ఆసక్తిని కలిగిస్తోంది. ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2031 నాటికి పొలాలన్నిటినీ పూర్తిగా ప్రకృతి సేద్యంలోకి మార్చాలన్నది సంకల్పం. అయితే, ప్రకృతి వ్యవసాయ ప్రభావం 2050 నాటికి ఎలా ఉంటుంది? రసాయనిక వ్యవసాయంలో కొనసాగితే ఆ ప్రభావం ఏ విధంగా ఉంటుంది? ఇవి ఆసక్తికరమైన ప్రశ్నలు. ఈ అంశాలను లోతుగా శోధిస్తూ క్షేత్రస్థాయి ప్రకృతి సేద్య ఫలితాల ఆధారంగా 'ఆగ్రోఎకో 2050 ఫోర్‌సైట్ ప్రాజెక్టు'లో భాగంగా మూడేళ్ల పాటు విస్తృతంగా అధ్యయనం చేశారు.



● పారిశ్రామిక వ్యవసాయాన్ని కొనసాగిస్తే ఎడారీకరణే గతి..
● ప్రకృతిసేద్యం వల్ల దేశం ఇలా సుభిక్షంగా మారుతుంది

ఫ్రెంచ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్మెంట్ (సిఐఆర్ఎడి)కు చెందిన సీనియర్ ఆర్థికవేత్త బ్రూనో డోరిన్, ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) వ్యవసాయ శాస్త్రవేత్త అన్నే సోఫి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ శాఖకు చెందిన రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్) ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి. విజయకుమార్ పలువురు శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి 2019 నుంచి 2022 వరకు అధ్యయనం చేశారు. అంతర్జాతీయ శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ నివేదికను రూపొందించటం విశేషం. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర శాఖల ఉన్నతాధికారులతో చర్చించిన తదనంతరం 'ఆగ్రోఎకో 2050: ఆంధ్రప్రదేశ్‌లో ఆహార వ్యవస్థలపై పునరాలోచన- ప్రకృతి వ్యవసాయం భవిష్యత్తులో ఆహార సమృద్ధిని ఎలా సాధిస్తుంది' అనే శీర్షికన అధ్యయన నివేదిక సిద్ధమైంది. నీతి ఆయోగ్ సభ్యులు (వ్యవసాయం) ప్రొఫెసర్ రమేశ్ చంద్ దీన్ని న్యూఢిల్లీలో ఇటీవల విడుదల చేశారు.



పారిశ్రామిక (రసాయనిక) వ్యవసాయాన్ని, ప్రకృతి వ్యవసాయాన్ని పోల్చుతూ రెండు విభిన్న పరిస్థితుల్లో 2050 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయం, ఆహారం, పర్యావరణం, ఉపాధి, సంక్షేమం తదితర రంగాల్లో ఎలా ఉండబోతోంది అనే విషయంపై విశ్లేషణను ఈ నివేదిక వెల్లడిస్తోంది. రాష్ట్రంలో విస్తృతంగా అమలవుతున్న ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం సరికొత్త ఆహార వ్యవస్థల స్థాపనలో ఎలాంటి అవకాశాలను కలిగిస్తుంది అనే కోణంలో శోధించారు. ఆంధ్రప్రదేశ్‌లో 2020-21 నాటికి 7 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. 2031 నాటికి ఈ రైతుల సంఖ్య 60 లక్షలకు చేరుకోవాలన్నది లక్ష్యం. ఆర్థిక, పర్యావరణ, పోషకాహార, సామాజిక సవాళ్లను సమీకృత పద్ధతిలో పరిష్కరించే హరిత వ్యవసాయానికి ఏపీ రాష్ట్రం నాయకత్వం వహిస్తుందనేది అధ్యయన బృందం అభిప్రాయం.

విభిన్న సాగు పద్ధతుల్లో వ్యత్యాసాలు

జనాభా పెరుగుదల- ఉపాధి అవకాశాలు, ఆర్థిక పురోగతి- అసమానతలు, నేల వినియోగం, దిగుబడి - ఆహార ఉత్పత్తి తదితర కోణాల్లో రెండు విభిన్న సాగు పద్ధతుల్లో పొందే ఫలితాల్లో వ్యత్యాసాలను అధ్యయనం చేసి ఈ నివేదికలో పొందుపరిచారు:

● రసాయనాలతో కూడిన పారిశ్రామిక వ్యవసాయం ఇలాగే కొనసాగితే 2050 నాటికి రైతుల సంఖ్య సగానికి తగ్గుతుంది. నిరుద్యోగం రేటు 31 శాతం నుంచి 30 శాతానికి తగ్గుతుంది. అయితే, పూర్తిగా ప్రకృతి వ్యవసాయం చేపడితే రైతుల సంఖ్య కోటికి పెరుగుతుంది. నిరుద్యోగం రేటు 7 శాతానికి తగ్గుతుంది.

● ప్రకృతి వ్యవసాయం ద్వారా బంజరు భూములు కూడా సాగులోకి వస్తాయి. అధిక విస్తీర్ణం సాగులోకి వచ్చి అత్యధిక మంది రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అవుతారు. తక్కువ పెట్టుబడితో ఏడాది పొడవునా రసాయన రహిత సురక్షిత పంటలు పండిస్తారు. అందువల్ల అధిక మార్కెట్ ధర పొందుతారు.

● ప్రకృతి వ్యవసాయ విధానంలో విత్తనాలు, నీటి వినియోగం, రసాయనాలు, ఇంధనం, అప్పులు, భారీ యంత్ర సామగ్రి తదితర ఖర్చుల విషయంలో రైతులకు ఎంతో డబ్బు ఆదా అవుతుంది. ఈ రైతులు పంట ఉత్పత్తులను విలువ జోడించి అమ్ముతారు కాబట్టి అధికాదాయం వస్తుంది.

● ప్రకృతి వ్యవసాయంలో నిరుద్యోగం తగ్గి, వ్యవసాయ-వ్యవసాయేతర వేతనాల్లో అంతరం తగ్గటం కారణంగా ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారు. ఆర్థిక వృద్ధి 6.5%కి చేరుకుంటుంది.

● రసాయనిక వ్యవసాయం కొనసాగిస్తే 2050 నాటికి ఇది 6.1 పైసలు మాత్రమే ఉంటుంది. ప్రకృతి వ్యవసాయంలో ప్రతి రైతు ఉత్పత్తి చేసిన ప్రతి కిలో కేలరీల ఆహారానికి 10.3 పైసల ఆదాయం పొందుతారు.

● రసాయనిక వ్యవసాయం కొనసాగిస్తే 2019లో 62 లక్షల హెక్టార్లున్న సాగు భూమి విస్తీర్ణం 2050 నాటికి 55 లక్షల హెక్టార్లకు తగ్గుతుంది. కొన్ని పంటలపై మాత్రమే దృష్టి కేంద్రీకరించే పారిశ్రామిక వ్యవసాయ విధానంలో బీడు భూముల విస్తీర్ణం 2019లో 24 లక్షల హెక్టార్ల నుంచి 2050 నాటికి 30 లక్షల హెక్టార్లకు పెరిగే ప్రమాదం ఉంది.

● ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బీడు భూములు కూడా సాగులోకి వచ్చి 2019లో 62 లక్షల హెక్టార్లున్న సాగు భూమి 2050 నాటికి 80 లక్షల హెక్టార్లకు పెరుగుతుంది. పంట ఉత్పత్తి గణనీయంగా పెరిగి ప్రస్తుత సవాళ్లను అధిగమించవచ్చు.

● రసాయన సేద్యంలో మొత్తం మీద తక్కువ భూమి, తక్కువ మంది రైతులు, అధిక సాగు ఖర్చులు, అధిక నిరుద్యోగ రేటుతో కలిపి వ్యవసాయ జీవీఏ పెరుగుదల రేటు సగటున సంవత్సరానికి 4% నుంచి 3.5%కి తగ్గుతుంది.

● ప్రకృతి వ్యవసాయం నేల ఆరోగ్యాన్ని పెంపొందించి సారవంతమైన భూములను అందిస్తుంది. అనేక రకాల పంటలతో అధిక పంట సాంద్రత ఏర్పడుతుంది.

● ప్రకృతి వ్యవసాయం అనుసరిస్తున్న రైతులు దిగుబడిలో ఎలాంటి తగ్గుదల లేకపోవడమే కాకుండా, అధిక దిగుబడిని కూడా సాధిస్తున్నారు. వర్షాధార వ్యవసాయ భూముల్లోనూ పలు రకాల పంటల సాంద్రత వల్ల మరింత దిగుబడిని సాధిస్తున్నారు. మొత్తానికి ప్రకృతి వ్యవసాయంలో రైతులు 2019లో హెక్టారుకు రోజుకు 31,000 కిలో కేలరీల ఆహారాన్ని ఉత్పత్తి చేశారు. 2050 నాటికి అది 36,000 కిలో కేలరీలకు పెరుగుతుంది.


● రసాయనిక వ్యవసాయంలో 2050 నాటికి రైతులు రోజుకు హెక్టార్‌కు దాదాపు 44,000 కిలో కేలరీలు ఉత్పత్తి చేసినా.. ప్రకృతి సేద్యంలో పండే పంట ఉత్పత్తులు స్థూల,సూక్ష్మ పోషకాలు, పీచు పదార్థంతో కూడిన బలవర్ధకమైన, సమతుల్యమైన ఆహారాన్ని అందిస్తాయి.

● రెండు విభిన్న పద్ధతుల్లో ఆహారోత్పత్తి, సాగు విస్తీర్ణం, వార్షిక దిగుబడులను అంచనా వేసి చూస్తే.. 2050లో ప్రతి వ్యక్తికి అందుబాటులో ఉండే ఆహారం రసాయనిక వ్యవసాయం (4050 కిలో కేలరీలు/తలసరి/రోజు)లో కంటే ప్రకృతి వ్యవసాయం (5000 కిలో కేలరీలు/తలసరి/రోజు)లో గణనీయంగా పెరుగుతుంది. అంతేగాక ప్రకృతి సేద్యంలో పండించిన పంట ఉత్పత్తులు రసాయనిక ఉత్పత్తుల కంటే మరింత సమతుల్యంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

● ప్రతికూల వాతావరణ పరిస్థితులకు తట్టుకొనే విధంగా వ్యవసాయ పంటల జీవ వైవిధ్యం పెరుగుతుంది. సేంద్రియ కర్బనం నేలల్లో వృద్ధి చెందుతుంది. తద్వారా వాతావరణ మార్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

● అధిక ఉష్ణోగ్రతలు, కరువు, తుపాన్లు, వరదలు వంటి వాతావరణ విపత్తులను తట్టుకోవడం రసాయనిక సేద్యంతో సాధ్యం కాదని నివేదిక స్పష్టం చేస్తోంది. పెట్టుబడి తగ్గటం, సురక్షిత నీటితోపాటు విస్తృత స్థాయిలో పోషకాహారం అందించడం, పర్యావరణ పరిరక్షణ వల్ల రాష్ట్రం 'రైతు అభివృద్ధి'కి దిక్సూచిగా మారుతుంది.

'ప్రకృతి' నేర్పుతున్న అసాధారణ నీటి పాఠాలు!



ప్రకృతి వ్యవసాయం సాగు నీటి వినియోగ పద్ధతిని సమూలంగా మార్చివేస్తుంది. ప్రకృతి సేద్యంలో సాగయ్యే పంటలు నీటిని వినియోగించుకోవటం మాత్రమే కాదు, నీటిని ఉత్పత్తి చేసుకుంటాయి కూడా! నదుల్లో ఉండే నీటికి పది రెట్లు నీరు గాలిలో ఉంది. గాలి నుంచి నీటిని సంగ్రహించి ఉపయోగించుకోవడం ప్రకృతి వ్యవసాయంలోనే సాధ్యమవుతుంది. 365 రోజులు ఆకుపచ్చగా పంటలతో పొలాన్ని కప్పి ఉంచటం, అవశేషాలతో ఆచ్ఛాదన కల్పించటం వల్ల నేలలో నుంచి తేమ ఆవిరి కావటం తగ్గుతుంది. నేలలో సేంద్రియ పదార్థం, సేంద్రియ కర్బనం పెరుగుతుంది కాబట్టి నీటిని గాలి నుంచి గ్రహించి పట్టి ఉంచుకునే శక్తి ఈ పంటలకు సమకూరుతోంది. కురిసిన 100 చుక్కల్లో 50 చుక్కలు వాగుల్లోకి పోతున్నాయి లేదా ఆవిరవుతున్నాయి. ప్రకృతి సేద్యంలో ఈ నష్టం బాగా తగ్గి, భూమిలోకి నీరు ఎక్కువగా ఇంకుతుంది. నీటిని భౌతికశాస్త్ర కోణం నుంచి అర్థం చేసుకోవటమే ఇప్పటి వరకు చేశాం. ప్రకృతి వ్యవసాయం జీవశాస్త్ర కోణం నుంచి నీటిని చూడటం నేర్పుతోంది. ఈ అసాధారణ పాఠాలు మేం నేర్చుకుంటూ నరికొత్త పద్ధతులను అమల్లోకి తెస్తున్నాం. వర్షం కురవక ముందే విత్తనాలను గుళికలుగా మార్చి విత్తుతున్నాం. నెల తర్వాత కొద్ది పాటి జల్లులు పడినా పంటలు మొలకెత్తుతున్నాయి. ఒకటికి పది పంటలు వత్తుగా వేయటం వల్ల రైతులకు చాలా లాభాలు చేకూరుతున్నాయి. బంజరు భూములను దున్నే పని లేకుండా సాగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. పాదులు చేస్తూ ఒక్కో పాదులో ఐదారు రకాల విత్తనాలు వేస్తూ బంజరు భూములను సైతం రైతులు సాగులోకి తెస్తున్నారు. మన రైతుల అనుభవాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

- టి. విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్,
ఏపీ రైతు సాధికార సంస్థ



వరికి బలం.. జిల్లేడు ద్రావణం..

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగయ్యే వరి పొలాల్లో పిలక, చిరు పొట్ట దశలో ఏర్పడే సూక్ష్మ పోషకాలు/ పొటాష్ లోపాలతో పాటు రసంపీల్చే పురుగుల నివారణకు జిల్లేడు ఆకుల ద్రావణం సమర్థవంతంగా పనిచేస్తోందని రైతులు చెబుతున్నారు. గత రెండేళ్లుగా ప్రకృతి వ్యవసాయదారులు జిల్లేడు ద్రావణాన్ని విస్తృతంగా వాడుతూ ప్రయోజనం పొందుతున్నారు.



జిల్లేడు ద్రావణం తయారీకి కావాల్సిన పదార్థాలు: 200 లీటర్ల నీరు, 20 కేజీల జిల్లేడు ఆకులు, 10 లీటర్ల నాటు ఆవు మూత్రం.

తయారీ విధానం: 200 లీటర్ల నీటిలో 20 కేజీల జిల్లేడు ఆకులు వేసి 10 లీటర్ల ఆవు మూత్రం కలపాలి. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం కలపాలి. 3 రోజుల తరువాత వాడకానికి సిద్ధమవుతుంది.

మోతాదు: 100 లీటర్ల నీటిలో 10 లీటర్ల జిల్లేడు ద్రావణం కలిపి పిచికారీ చెయ్యాలి.

నిల్వ : 7 రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది.

వివరాలకు: రైతు సాధికార సంస్థ ఉత్తరాంధ్ర సాంకేతిక అధికారి హేమసుందర్:80743 20481


తిలక్ వర్మ

హైదరాబాద్ శుభారంభం

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో మేఘాలయ జట్టుతో సోమవారం జైపూర్‌లో జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచింది. మొదట మేఘాలయ జట్టు 6 వికెట్లకు 119 పరుగులు సాధించింది. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ 16 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. హైదరాబాద్ 13.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 120 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (31 బంతుల్లో 41 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), తన్మయ్ అగర్వాల్ (33 బంతుల్లో 46 నాటౌట్; 6 ఫోర్లు) రాణించారు.

గోవా చేతిలో ఆంధ్ర జట్టు ఓటమి

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో గోవా జట్టుతో రాంచీలో సోమవారం జరిగిన గ్రూప్ 'సి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 31 పరుగుల తేడాతో ఓడిపోయింది. మొదట గోవా జట్టు 6 వికెట్లకు 232 పరుగులు చేసింది. అనంతరం ఆంధ్ర జట్టు 18.3 ఓవర్లలో 201 పరుగుల వద్ద ఆలౌటైంది. హనుమ విహారి (33 బంతుల్లో 58; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), షేక్ రషీద్ (14 బంతుల్లో 27; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు గెలిపించలేకపోయాయి.


విహారి

ఆసీస్ బోణీ

- స్పిన్ వలలో లంక విలవిల
- 125/0 నుంచి 209 ఆలౌట్
- నాలుగు వికెట్లతో తిప్పేసిన జంపా
- రాణించిన మార్ష్, ఇంగ్లిస్


లక్నో: ఐదుసార్లు విశ్వవిజేత ఆస్ట్రేలియా ఎట్టకేలకు ఈ వన్డే వరల్డ్‌కప్‌లో బోణీ కొట్టింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఆసీస్ మూడో మ్యాచ్‌లో శ్రీలంకపై ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆడమ్ జంపా స్పిన్, బ్యాటర్ల సమష్టి బాధ్యత 'కంగారూ' జట్టును గెలిపించాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 43.3 ఓవర్లలో 209 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు కుశాల్ పెరీరా (82 బంతుల్లో 78; 12 ఫోర్లు), నిసాంక (67 బంతుల్లో 61; 8 ఫోర్లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జంపా (4/47) తిప్పేయగా, పేసర్ స్టార్క్ 2 వికెట్లు తీశాడు. తర్వాత ఆసీస్ 35.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసి నెగ్గింది. మిచెల్ మార్ష్ (51బంతుల్లో 52; 9 ఫోర్లు), జోష్ ఇంగ్లిస్ (59 బంతుల్లో 58; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో రాణించారు. మదుషంకకు 3 వికెట్లు దక్కాయి.

శుభారంభానికి స్పిన్‌తో చెక్

లంక ఓపెనర్లు ఆడిన ఆట, చేసిన పరుగులు, జత కూడిన భాగస్వామ్యం చూస్తే భారీస్కోరు గ్యారంటీ అనిపించింది! దీంతో ఒకదశలో ఆసీస్‌కు మళ్లీ ఓటమి కంగారూ తప్పదేమో అనిపించింది. అంతలా నిసాంక, కుశాల్ పెరీరా ఓపెనింగ్ జోడీ 21 ఓవర్లదాకా అర్ధసెంచరీలతో పరుగుల్ని పోగేసింది. అయితే కమిన్స్ పేస్ ఇద్దరిని స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు పంపించింది. దీంతో 125 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడ్డాక... స్పిన్ వైపు పిచ్ మళ్లింది. ఇదే అదనుగా జంపా... కెప్టెన్ కుశాల్ మెండిస్ (9), సమరవిక్రమ (8)లను అవుట్ చేశాడు. మరో స్పిన్నర్ మ్యాక్స్‌వెల్ అసలంక (25) వికెట్ తీయగా ఆ తర్వాత ఎవరూ పది పరుగులైనా చేయనీకుండా జంపా స్పిన్ ఉచ్చు, స్టార్క్ నిప్పులు చెరిగే బౌలింగ్ లంకను ఉక్కిరిబిక్కిరి చేసింది. 157 వద్ద రెండో వికెట్ పడిన లంక అనూహ్యంగా 209 పరుగులకే కుప్పకూలింది. కేవలం 52 పరుగుల వ్యవధిలోనే 8 వికెట్లను కోల్పోయింది.

తడబడినా...

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆసీస్ మళ్లీ తడబడింది. వార్నర్ (11; 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (0)లను మదుషంక ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చడంతో కంగారూ శిబిరం ఆత్మరక్షణలో పడినట్లయింది. అయితే మరో ఓపెనర్ మార్ష్, లబుషేన్ (60 బంతుల్లో 40; 2 ఫోర్లు) కుదురుగా ఆడి ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు.


ఆడమ్ జంపా

ధాటిగా ఆడిన మార్ష్ అర్ధసెంచరీ పూర్తయ్యాక రనౌట్ కాగా... తర్వాత వచ్చిన ఇంగ్లిస్, లబుషేన్ గట్టెక్కించే భాగస్వామ్యం నమోదు చేశారు. నాలుగో వికెట్‌కు 77 పరుగులు జతయ్యాక లబుషేన్ పెవిలియన్ చేరాడు. ఫిఫ్టీ అనంతరం జట్టు విజయానికి చేరువ చేసి ఇంగ్లిస్ నిష్క్రమించాడు. మ్యాక్స్‌వెల్ (21 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టొయినిస్ (10 బంతుల్లో 20 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడి ముగించారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) వార్నర్ (బి) కమిన్స్ 61; కుశాల్ పెరీరా (బి) కమిన్స్ 78; మెండిస్ (సి) వార్నర్ (బి) జంపా 9; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 8; అసలంక (సి) లబుషేన్ (బి) మ్యాక్స్‌వెల్ 25; ధనంజయ (బి) స్టార్క్ 7; వెల్లలాగె (రనౌట్) 2; కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 2; తీక్షణ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 0; లహిరు (బి) స్టార్క్ 4; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (43.3 ఓవర్లలో ఆలౌట్) 209. వికెట్ల పతనం:** 1-125, 2-157, 3-165, 4-166, 5-178, 6-184, 7-196, 8-199, 9-204, 10-209. **బౌలింగ్:** స్టార్క్ 10-0-43-2, హాజిల్‌వుడ్ 7-1-36-0, కమిన్స్ 7-0-32-2, మ్యాక్స్‌వెల్ 9.3-0-36-1, జంపా 8-1-47-4, స్టొయినిస్ 2-0-11-0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మార్ష్ (రనౌట్) 52; వార్నర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 11; స్మిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 0; లబుషేన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 40; ఇంగ్లిస్ (సి) తీక్షణ (బి) వెల్లలాగె 58; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 31; స్టొయినిస్ (నాటౌట్) 20; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (35.2 ఓవర్లలో 5 వికెట్లకు) 215. వికెట్ల పతనం:** 1-24, 2-24, 3-81, 4-158, 5-192. **బౌలింగ్:** లహిరు 4-0-47-0, మదుషంక 9-2-38-3, తీక్షణ 7-0-49-0, వెల్లలాగె 9.2-0-53-1, కరుణరత్నే 3-0-15-0, ధనంజయ 3-0-13-0.

ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X నెదర్లాండ్స్
వేదిక: ధర్మశాల
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	3	3	0	6	1.821
న్యూజిలాండ్	3	3	0	6	1.604
దక్షిణాఫ్రికా	2	2	0	4	2.360
పాకిస్తాన్	3	2	1	4	-0.137
ఇంగ్లండ్	3	1	2	2	-0.084
అఫ్గానిస్తాన్	3	1	2	2	-0.652
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
ఆస్ట్రేలియా	3	1	2	2	-0.734
శ్రీలంక	3	0	3	0	-1.532
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఈదురు గాలులతో వర్షం, ఊడిపడిన హోర్డింగ్స్

బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షంతో మ్యాచ్‌కు అంతరాయం ఏర్పడింది. గాలి బలంగా వీయడంతో స్టేడియంలోని కొన్నిచోట్ల హోర్డింగులన్నీ ఊడిపడ్డాయి. అదృష్టవశాత్తు ప్రేక్షకుల హాజరు పలుచగా ఉండటం... ఊడిపడిన చోట జనం లేకపోవడంతో ఎలాంటి నష్టం జరగలేదు.

ఒలింపిక్స్‌లో క్రికెట్


కోహ్లి

లాస్ ఏంజెలిస్-2028 విశ్వ క్రీడల్లో పునరాగమనం

- టి20 ఫార్మాట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో నిర్వహణ
- స్క్వాష్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ క్రీడాంశాలకు తొలిసారి చోటు
- మళ్లీ బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, లాక్రాస్ క్రీడాంశాలకు స్థానం
- ఐఓసీ సెషన్స్‌లో ఆమోద ముద్ర

ముంబై: లాంఛనం ముగిసింది. ఎట్టకేలకు క్రికెట్ ఒలింపిక్స్ క్రీడల్లో పునరాగమనం చేయనుంది. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్‌తో పాటు స్క్వాష్, బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, లాక్రాస్ (సిక్స్-ఎ-సైడ్), ఫ్లాగ్ ఫుట్‌బాల్ క్రీడాంశాలను కొత్తగా చేర్చారు. ఐదు కొత్త క్రీడాంశాలకు లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో అనుమతి ఇవ్వాలని ఎగ్జిక్యూటివ్ బోర్డు చేసిన ప్రతిపాదనలకు సోమవారం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సభ్యులు ఓటింగ్ ద్వారా ఆమోదం తెలిపినట్లు ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాక్ ప్రకటించారు. 99 మంది ఐఓసీ సభ్యుల్లో ఇద్దరు మాత్రమే ఈ ఐదు క్రీడాంశాల ప్రతిపాదనను వ్యతిరేకించగా... 97 మంది సమ్మతించారు. లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ ఈవెంట్‌ను టి20 ఫార్మాట్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరు జట్ల మధ్య నిర్వహిస్తారు. ఆతిథ్య దేశం హోదాలో అమెరికా జట్లకు నేరుగా ఎంట్రీ లభిస్తుంది. ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా మిగతా ఐదు జట్లను నిర్ణయించే అవకాశముంది.

- 1877లో క్రికెట్‌లో తొలి టెస్టు మ్యాచ్ జరిగింది. 1900 పారిస్ ఒలింపిక్స్‌లో ఒకే ఒకసారి క్రికెట్ మెడల్ ఈవెంట్‌గా ఉంది. పారిస్ గేమ్స్‌లో కేవలం ఫ్రాన్స్, బ్రిటన్ జట్లు మాత్రమే పాల్గొన్నాయి. బ్రిటన్ జట్టుకు స్వర్ణం, ఫ్రాన్స్ జట్టుకు రజతం లభించాయి. ఆ తర్వాత క్రికెట్ విశ్వ క్రీడల జాబితాలో చోటు కోల్పోయింది. టెస్టు, వన్డే ఫార్మాట్‌ల బదులు మూడు, నాలుగు గంటల్లో ఫలితం వచ్చే టి20 ఫార్మాట్ రాకతో క్రికెట్ స్వరూపమే మారిపోయింది. విశ్వవ్యాప్తంగా జరుగుతున్న టి20 లీగ్‌లు ఎంతో మంది క్రికెటర్లకు కొత్తగా అవకాశాలు కల్పిస్తుండటంతోపాటు ఆర్థికంగా వారిని ఆదుకుంటున్నాయి. ప్రస్తుతం ఫుట్‌బాల్ తర్వాత ప్రపంచంలో అత్యధిక ఆదరణ కలిగిన క్రీడగా క్రికెట్‌కు గుర్తింపు వచ్చింది. ఫలితంగా 128 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు క్రికెట్ ఒలింపిక్స్‌లో పునరాగమనం చేయనుంది.
- ప్రస్తుతానికి క్రికెట్‌తోపాటు మిగతా నాలుగు కొత్త క్రీడాంశాలు లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ వరకే పరిమితం కానున్నాయి. తదుపరి ఒలింపిక్స్ క్రీడల్లోనూ క్రికెట్ కొనసాగడమనేది ఆయా దేశాల కార్యనిర్వాహక కమిటీల ఆసక్తిపై ఆధారపడి ఉంది. ఐఓసీ నిబంధనల ప్రకారం ఒలింపిక్స్ క్రీడల ఆతిథ్య దేశానికి తమకు నచ్చిన కొన్ని క్రీడాంశాలను అదనంగా చేర్చే వెసులుబాటు ఉంది. 2032 ఒలింపిక్స్ ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్ నగరంలో జరుగుతాయి. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి భారత్ ఆసక్తి కనబరుస్తోంది. ఆస్ట్రేలియా, భారత్‌లో క్రికెట్‌కు విపరీతమైన ఆదరణ ఉండటంతో 2032, 2036 ఒలింపిక్స్‌ల్లోనూ క్రికెట్ కొనసాగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.
- 'విశ్వవ్యాప్తంగా 2.5 బిలియన్ అభిమానులు కలిగిన ప్రపంచంలోని రెండో అత్యధిక ఆదరణ కలిగిన క్రికెట్ క్రీడను ఒలింపిక్స్‌లోకి స్వాగతం పలుకుతున్నాం. అమెరికాలోనూ మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీ ద్వారా ఈ ఆటకు ఆదరణ పెరుగుతోంది. వచ్చే ఏడాది అమెరికా-వెస్టిండీస్ సంయుక్తంగా టి20 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. నా మిత్రుడు విరాట్ కోహ్లికి సామాజిక మాధ్యమాల్లో ప్రపంచ వ్యాప్తంగా 340 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. బాస్కెట్‌బాల్ దిగ్గజం లేబ్రాన్ జేమ్స్, అమెరికన్ ఫుట్‌బాల్ స్టార్ టామ్ బ్రేడీ, గోల్ఫ్ స్టార్ టైగర్ వుడ్స్‌కంటే ఎక్కువ మంది ఫాలోవర్లు కోహ్లికి ఉన్నారు. అందుకే క్రికెట్ కేవలం కొన్ని దేశాలకే పరిమితం కాకుండా విశ్వవ్యాప్తంగా ఆదరణ పొందాలనే ఉద్దేశంతో ఒలింపిక్స్‌లో చోటు కల్పిస్తున్నాం' అని లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ స్పోర్ట్స్ డైరెక్టర్, ఒలింపిక్ చాంపియన్ షూటర్ నికోలో కాంప్రియాని వ్యాఖ్యానించాడు. ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్‌కు చోటు లభించడంపట్ల ఐఓసీ సభ్యురాలు, ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీ యజమాని నీతా అంబానీ హర్షం వ్యక్తం చేశారు. ఒలింపిక్స్‌లో క్రికెట్ శాశ్వతంగా కొనసాగేందుకు తమవంతుగా అన్ని చర్యలు తీసుకుంటామని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చైర్మన్ గ్రెగ్ బార్క్లే తెలిపారు.
- రగ్బీ తరహాలో ఆడే ఫ్లాగ్ ఫుట్‌బాల్‌కు... స్క్వాష్‌కు ఒలింపిక్స్‌లో తొలిసారి స్థానం దక్కింది. బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్‌కు వచ్చే ఏడాది పారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లో చోటు దక్కకపోయినా... అమెరికాలో ఎంతో ప్రాచుర్యం ఉండటంతో బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్ లాస్ ఏంజెలిస్‌లో మళ్లీ కనిపిస్తాయి.
- హాకీ తరహాలో ఆడే లాక్రాస్ క్రీడాంశం 1904 సెయింట్ లూయిస్ ఒలింపిక్స్‌లో, 1908 లండన్ ఒలింపిక్స్‌లో మెడల్ ఈవెంట్‌గా ఉంది. ఆ తర్వాత 1928 ఆమ్‌స్టర్‌డామ్, 1932 లాస్ ఏంజెలిస్, 1948 లండన్ ఒలింపిక్స్‌లో ప్రదర్శన క్రీడగా కొనసాగి ఆ తర్వాత చోటు కోల్పోయింది.


లాక్రాస్


బేస్‌బాల్


ఫ్లాగ్ ఫుట్‌బాల్


స్క్వాష్

సినిమా


శైలేష్ కొలను, నవాజుద్దీన్ సిద్దిఖీ, వెంకటేశ్, వెంకట్ బోయనపల్లి

వారివల్లే ఈ ప్రయాణం సాధ్యమైంది - వెంకటేశ్

''నా మొదటి సినిమా (కలియుగ పాండవులు) నుంచి ఇప్పుడు 75వ సినిమా 'సైంధవ్' వరకూ నన్ను ఎంతగానో ప్రేమించి, ఆదరించి, అభిమానిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీ ప్రేమ, అభిమానం, ఆప్యాయత వల్లే ఈ ప్రయాణం సాధ్యపడింది. ఇందుకు ప్రేక్షకులకు, నా అభిమానులకు, చిత్ర పరిశ్రమకు ధన్యవాదాలు'' అని హీరో వెంకటేశ్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా, సారా కీలక పాత్రల్లో నటించారు. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మించిన 'సైంధవ్' తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో జనవరి 13న విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ లాంచ్ వేడుకలో వెంకటేశ్ మాట్లాడుతూ–

''బలమైన భావోద్వేగాలు, యాక్షన్‌కి అవకాశం ఉన్న కథ 'సైంధవ్'. కుటుంబ ప్రేక్షకులందరికీ సినిమా నచ్చుతుంది. ఇందులో నన్ను కొత్తగా చూస్తారు. గతంలో నా సినిమాలు 'చంటి, కలిసుందాం రా, లక్ష్మి' సంక్రాంతికి వచ్చి, హిట్ అయ్యాయి. ఇప్పుడు 'సైంధవ్' వస్తోంది. సంక్రాంతి రోజు ప్రేక్షకులు ఒక మంచి సినిమా చూడబోతున్నారు'' అన్నారు. ''ఈ మూవీ అందరికీ నచ్చుతుంది'' అన్నారు నవాజుద్దీన్ సిద్దిఖీ. ''వెంకటేశ్‌గారి ప్రతిష్టాత్మక 75వ చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశం నాకు ఇచ్చినందుకు ఆయనకు కృతజ్ఞతలు'' అన్నారు శైలేష్ కొలను. ''వెంకటేశ్‌గారితో సినిమా చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు వెంకట్ బోయనపల్లి.

ప్రేమ..స్నేహం

'తెలుసు కదా' అంటున్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ సినిమాకి 'తెలుసు కదా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డ హీరో, రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించనున్నారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మించనున్నారు. సోమవారం ఈ సినిమా అనౌన్స్‌మెంట్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. ''సామాజిక అంశాలు, అనుబంధాల నేపథ్యంలో సాగే ఈ సోల్‌ఫుల్ లవ్‌స్టోరీలో సిద్ధు కొత్త అవతారంలో కనిపిస్తారు. ఓ అమ్మాయి, అబ్బాయిల మధ్య సాగే ఓ కథతో పాటు స్నేహం, కుటుంబం, త్యాగం, సెల్ఫ్ లవ్ అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: తమన్, కెమెరా: కె.యువరాజ్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.


సిద్ధు జొన్నలగడ్డ


లావణ్య, వరుణ్ తేజ్, అల్లు అర్జున్

హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్యా త్రిపాఠిల వివాహం నవంబరు 1న జరగనున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఓ వైపు ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్, మరోవైపు పెళ్లి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల చిరంజీవి ఇంట్లో ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ జరిగాయి. తాజాగా హీరో అల్లు అర్జున్, కుటుంబ సభ్యులు ప్రీ వెడ్డింగ్ పార్టీని ఏర్పాటు చేశారు. నిర్మాత అల్లు అరవింద్, హీరోలు చిరంజీవి, అల్లు అర్జున్, సాయిధరమ్ తేజ్, వైష్ణవ్ తేజ్, అల్లు శిరీష్, నితిన్, హీరోయిన్ రీతూవర్మతో పాటు మెగా, అల్లు కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఈ పార్టీలో సందడి చేశారు. ఈ ఫొటోలను వరుణ్ తేజ్, అల్లు శిరీష్ షేర్ చేశారు.

నువ్వు మొదలుపెట్టావ్.. నేను ముగిస్తాను!

'దేశంలోని శాంతికి, దేశంలోని శత్రువులకు మధ్య ఎంత దూరం ఉంటుంది. కేవలం ఒక మనిషంత' అంటూ మొదలవుతుంది 'టైగర్ 3' తెలుగు ట్రైలర్. సల్మాన్‌ఖాన్, కత్రినా కైఫ్, ఇమ్రాన్ హాష్మి ప్రధాన పాత్రధారులుగా మనీష్‌శర్మ దర్శకత్వంలో ఆదిత్యా చోప్రా నిర్మించిన స్పై ఫిల్మ్ 'టైగర్ 3'. యశ్‌రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లోని 'టైగర్ జిందా హై', 'వార్', 'పఠాన్' చిత్రాల్లోని ఘటనలకు కొనసాగింపుగా 'టైగర్ 3' ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. తాజాగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో 'టైగర్ 3' ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమాను నవంబరు 12న విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ వెల్లడించింది. 'టపాసులు కాల్చడం నువ్వు మొదలు పెట్టావ్.. నేను ముగిస్తాను', 'టైగర్‌కు శ్వాస ఉన్నంత వరకు, ఈ టైగర్ ఓటమిని ఒప్పుకోడు' అంటూ సల్మాన్‌ఖాన్ చెప్పే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. 'ఏక్తా టైగర్', 'టైగర్ జిందాహై' చిత్రాల తర్వాత 'టైగర్' ఫ్రాంచైజీలో వస్తున్న మూడో సినిమా 'టైగర్ 3'.


'టైగర్ 3' పోస్టర్


అనన్య నాగళ్ల, వరలక్ష్మి, విజయ్ ధరణ్

అన్వేషి విజువల్స్ బాగున్నాయి - వరలక్ష్మి

''అన్వేషి' ట్రైలర్, విజువల్స్ చాలా బాగున్నాయి. సంగీతం, నేపథ్య సంగీతం కూడా చక్కగా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి. చిత్ర యూనిట్‌కి అభినందనలు'' అని నటి వరలక్ష్మీ శరత్ కుమార్ అన్నారు. విజయ్ ధరణ్ దాట్ల, సిమ్రాన్ గుప్తా, అనన్య నాగళ్ల హీరో హీరోయిన్లుగా వీజే ఖన్నా దర్శకత్వం వహించిన చిత్రం 'అన్వేషి'. టి.గణపతి రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబరు రెండో వారంలో విడుదలకి సన్నాహాలు చేస్తున్నారు. గణపతి రెడ్డి పుట్టినరోజు (సోమవారం) సందర్భంగా 'అన్వేషి' మూవీ ట్రైలర్‌ను వరలక్ష్మి విడుదల చేశారు. టి.గణపతి రెడ్డి మాట్లాడుతూ– ''నిర్మాతగా 'అన్వేషి' నా తొలి చిత్రం. సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు. ''మంచి కథాంశంతో రూపొందిన మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు వీజే ఖన్నా, విజయ్ ధరణ్ దాట్ల, సిమ్రాన్ గుప్తా, అనన్య. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్, సహ నిర్మాతలు హరీష్ రాజు, శివన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ దుర్గేష్ మాట్లాడారు.

సస్పెన్స్ థ్రిల్లర్

సీనియర్ హిందీ నటుడు మిథున్ చక్రవర్తి కుమారుడు మిమో చక్రవర్తి హీరోగా పరిచయం అవుతున్న సినిమా 'నేనెక్కడున్నా'. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ సినిమాకు మాధవ్ కోదాడ దర్శకత్వం వహించగా, సశా చైత్రి హీరోయిన్. కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 17న విడుదల కానుంది. మాధవ్ కోదాడ మాట్లాడుతూ– ''పాలిటిక్స్ అండ్ జర్నలిజం నేపథ్యంలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. హీరో హీరోయిన్లు జర్నలిస్ట్ పాత్రల్లో కనిపిస్తారు. జర్నలిజంపై రాజకీయ ప్రభావం ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూపించాం'' అన్నారు. ''సినిమా సెన్సార్ పూర్తయింది'' అన్నారు నిర్మాత మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి. ఈ సినిమాకు సంగీతం: శేఖర్ చంద్ర, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ : రాజేష్ ఎస్ఎస్.


మిమో చక్రవర్తి



ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సలార్'. ఈ చిత్రం తొలిపార్టు 'సలార్: సీజ్‌ఫైర్' లో వరదరాజ్ మన్నార్ పాత్రలో మలయాళ నటుడు– దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. సోమవారం ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా 'సలార్: సీజ్ ఫైర్' నుంచి పృథ్వీరాజ్ కొత్తపోస్టర్‌ను రిలీజ్ చేశారు. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 22న విడుదల కానుంది.

ఎక్స్‌ట్రాలోకి స్వాగతం

ఎన్నో విలక్షణమైన పాత్రలతో అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించి, వారి హృదయాల్లో తనదైన స్థానం సొంతం చేసుకున్న హీరో రాజశేఖర్ 'ఎక్స్ ట్రా– ఆర్డినరీ మేన్' చిత్రంలో ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఆయన సెట్స్‌లోకి అడుగుపెట్టారు. నితిన్, శ్రీలీల జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో 'ఎక్స్‌ట్రా: ఆర్డినరీ మేన్' చిత్రం తెరకెక్కుతోంది. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్మెంట్, రుచిర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ కీలక పాత్రలో రాజశేఖర్ నటిస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ మేరకు ఆయన సెట్స్‌లోకి అడుగు పెట్టగా, మేకర్స్ స్వాగతం పలికారు. ''ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా 'ఎక్స్‌ట్రా' రూపొందుతోంది. ఇప్పటి వరకు తన కెరీర్‌లో చేయని పాత్రను నితిన్ ఈ సినిమాలో చేస్తున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ మూవీ డిసెంబరు 8న విడుదలకానుంది.


వక్కంతం వంశీ, సుధాకర్ రెడ్డి, రాజశేఖర్

నవంబరులో దీపావళి

ప్రముఖ నిర్మాత 'స్రవంతి' రవి కిశోర్ నిర్మించిన తొలి తమిళ సినిమా 'కిడ'. ఆర్ఏ వెంకట్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పూ రాముస్, కాశీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని తెలుగులో 'దీపావళి'గా అనువదిస్తున్నారు. నవంబరు 11న తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమాని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ– ''వెంకట్‌కి ఇది తొలి సినిమా అయినా బాగా తీయగలడనే నమ్మకంతో పూర్తి స్వేచ్ఛ ఇచ్చాను. కథని అనుకున్నట్లు తెరపైకి తీసుకొచ్చాడు'' అన్నారు. ''తాతయ్య, మనవడు, ఓ మేకపిల్ల... ఈ మూడు పాత్రల మధ్య భావోద్వేగాలు 'దీపావళి'లో ప్రధానాంశం. ఆంధ్ర, తమిళనాడు సరిహద్దుల్లోని చిత్తూరు జిల్లాలోని ఓ గ్రామంలో ఈ చిత్ర కథ జరుగుతుంది'' అన్నారు ఆర్ఏ వెంకట్. ఈ చిత్రానికి సంగీతం: థీసన్, కెమెరా: ఎం. జయప్రకాశ్, సమర్పణ: కృష్ణ చైతన్య.


కాశీ వెంకట్

నవాబ్ యాక్షన్

ముఖేష్ గుప్తా, అనన్య నాగళ్ల జంటగా రవి చరణ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'నవాబ్'. ఆర్ఎమ్ నిర్మిస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''థ్రిల్లింగ్ అండ్ ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఓ డంప్ యార్డ్ చుట్టూ అల్లుకున్న కథగా 'నవాబ్' చిత్రం సాగుతుంది. త్వరలోనే షూటింగ్ పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌ను స్టార్ట్ చేస్తాం. వీలైనంత త్వరగా సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: పీఆర్, కెమెరా: రమేష్ కేఆర్.


ముఖేష్ గుప్తా

సాక్షి బిజినెస్
మంగళవారం
17-10-2023

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్‌ ▽	115	66,167
నిఫ్టీ ▽	19	19,732

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్‌	13,565	△ 158
డోజోన్స్‌	34,031	△ 360
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,631	△ 31
డాక్స్‌	15,238	△ 51
షాంఘై	3,074	▽ 14
నికాయ్‌	31,659	▽ 657

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

బులియన్‌ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	58,312
బంగారం (99.5 స్వచ్ఛత)	58,153
వెండి (కేజీ)	69,456

ఫారెక్స్‌ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	82.50	84.17
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	99.61	102.95
€	యూరో	ఎస్‌బీఐ	86.16	89.23
¥	జపాన్‌ ఎన్‌ (100)	ఎస్‌బీఐ	54.89	56.59
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	51.56	53.88
S$	సింగపూర్‌ డాలర్‌	ఎస్‌బీఐ	59.88	61.81
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	21.25	22.88
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	21.78	23.57
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	10.27	12.34

సెలెక్ట్‌ మొబైల్స్‌ 'గ్రేట్‌ ఫెస్టివల్‌ డేస్‌'



హైదరాబాద్‌: సెలెక్ట్‌ మొబైల్స్‌ దసరా పండుగ సందర్భంగా గ్రేట్‌ ఫెస్టివల్‌ డేస్‌ ఆఫర్‌ ప్రకటించింది. స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుపై ఆన్‌లైన్‌ కంటే రూ.5000 వరకు తగ్గింపు అందిస్తోంది. స్మార్ట్‌ టీవీ, ల్యాప్‌టాప్, ఇతర యాక్సెసరీస్‌పై ప్రత్యేక ఆఫర్లు ప్రవేశపెట్టింది. పనిచేయని/పాత ఎలక్ట్రానిక్స్‌ను సెలెక్ట్‌ స్టోర్లలోని ఈ–వేస్ట్‌ బాక్స్‌లో వేసి రూ.10,000 వరకు డిస్కౌంట్‌ పొందవచ్చు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ ఈజీఈఎంఐపై 10% తక్షణ తగ్గింపు, ఐసీఐసీఐ ఫైనాన్స్‌పై రూ.10 వేల వరకు, బజాజ్‌ ఫిన్‌సర్వ్‌పై రూ.9 వేల వరకు క్యాష్‌బ్యాక్, ఎస్‌బీఐ క్రెడిట్, డెబిట్‌ కార్డులపై 5%, క్లైవర్‌పే పై 15% వరకు క్యాష్‌బ్యాక్‌ పొందవచ్చని సంస్థ సీఎండీ వై.గురు తెలిపారు.

బజాజ్‌ ఎలక్ట్రానిక్స్‌ భారీ ఆఫర్‌



హైదరాబాద్‌: బజాజ్‌ ఎలక్ట్రానిక్స్‌ రూ.1 కోటి నగదు, మారుతీ సుజుకీ 30 ఆల్టో కే10 కార్లతో భారత్‌లో అతిపెద్ద పండుగ బంపర్‌ డ్రా ఆఫర్‌ ప్రకటించింది. నటి అషూరెడ్డి, సోషల్‌ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌ లాంఛనప్రాయంగా ప్రారంభించారు. ఈ ఆఫర్‌ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని బజాజ్‌ ఎలక్ట్రానిక్స్‌ స్టోర్లలో 2024 జనవరి 3 వరకు అందుబాటులో ఉంటుంది. 'ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, గ్యాడ్జెట్లు, మొబైల్స్‌ ఇష్టపడే వారికి బజాజ్‌ ఎలక్ట్రానిక్స్‌ తొలి ప్రాధాన్యతగా ఉంటుంది. కస్టమర్లకు కృతజ్ఞతలు తెలిపేందుకు, వారితో సత్సంబంధాలు కొనసాగించేందుకు బంపర్‌ డ్రా ఆఫర్‌ ఒక ప్రధాన మార్గం' అని సంస్థ సీఈవో కిరణ్‌ బజాజ్‌ తెలిపారు.

మైనస్‌లోనే టోకు ధరలు..

- సెప్టెంబర్‌లో డబ్ల్యూపీఐ మైనస్‌ 0.26%
- ఈ తరహా ధోరణి వరుసగా ఆరవ నెల



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2023 సెప్టెంబర్‌లో అసలు పెరక్కపోగా (2022 ఇదే నెలతో పోల్చి) మైనస్‌ (-) 0.26 శాతంగా నమోదయ్యింది. టోకు ధరల సూచీ మైనస్‌లోనే కొనసాగడం ఇది వరుసగా ఆరవ నెల. ఏప్రిల్‌ నుంచీ నెలకొన్న ఈ తరహా ధోరణిని ప్రతి ద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు.

ఎందుకంటే..: ప్రతి ద్రవ్యోల్బణానికి రసాయనాలు, రసాయన ఉత్పత్తులు, మినరల్‌ ఆయిల్స్, టెక్స్‌టైల్స్, బేసిక్‌ మెటల్స్, ఫుడ్‌ ప్రొడక్ట్స్‌ ధరలు తాజా సమీక్షా నెల్లో (2022 సెప్టెంబర్‌ ధరలతో పోల్చితే) తగ్గడమే కారణమని వాణిజ్య, పరిశ్రమ మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది.

విభాగాల వారీగా చూస్తే...

ఫుడ్‌ ఆర్టికల్స్‌: ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 3.35 శాతానికి తగ్గింది. అంతక్రితం రెండు నెలలూ ఈ విభాగంలో ద్రవ్యోల్బణం రెండంకెల్లో కొనసాగింది. ఆగస్టులో 10.60 శాతంగా ఉంది. తాజా సమీక్షా నెల్లో కూరగాయల ధరలు 15 శాతం తగ్గాయి. ఆగస్టులో వీటి పెరుగుదల రేటు 48.39 శాతంగా ఉంది. ఆలూ ధరలు 25.24 శాతం తగ్గాయి. అయితే పప్పులు (17.69%), ఉల్లి (55.05%) ధరలు సెప్టెంబర్‌లో పెరిగాయి. రిటైల్‌ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 3 నెలల కనిష్ట స్థాయిలో 5.02 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే.

ఫ్యూయెల్‌ అండ్‌ పవర్‌: ఈ రంగంలో ప్రతి ద్రవ్యోల్బణం 3.35 శాతంగా ఉంది.

తయారీ: మొత్తం సూచీలో మెజారిటీ వాటా గత ఈ రంగంలో ధరల తగ్గుదల 1.35%గా నమోదైంది.

ఇక పెరిగే అవకాశం..

సెప్టెంబర్‌ వరకూ టోకు ధరల సూచీలో తగ్గుదల నమోదయినప్పటికీ, ఇకపై పెరిగే అవకాశమే ఉందన్నది నిపుణుల వాదన. అంతర్జాతీయంగా పెరుగుతున్న క్రూడ్‌ ధరలు, వర్షాభావం ఖరీఫ్‌ పంటపై అనిశ్చితి ధోరణి ఇందుకు కారణం కావచ్చని కేర్‌ఎడ్జ్‌ చీఫ్‌ ఎకనమిస్ట్‌ రజనీ సిన్హా పేర్కొన్నారు.

జియో ఫైనాన్షియల్‌ లాభం రెట్టింపు

క్యూ2లో రూ. 668 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్‌ దిగ్గజం రిలయన్స్‌ ఇండస్ట్రీస్‌ నుంచి విడివడిన జియో ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ తొలిసారి త్రైమాసిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికం(క్యూ2)లో కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన నికర లాభం రెట్టింపై రూ. 668 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలం (జులై–సెప్టెంబర్‌)లో కేవలం రూ. 332 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 47 శాతం జంప్‌చేసి రూ. 608 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 414 కోట్ల టర్నోవర్‌ మాత్రమే సాధించింది. అయితే ఇందుకు రూ. 217 కోట్ల డివిడెండ్‌ ఆదాయం జత కలిసింది. ఇంతక్రితం ఐసీఐసీఐ బ్యాంక్‌ (సైబర్‌సెక్యూరిటీ) సీఐఎస్‌వోగా పనిచేసిన ఏఆర్‌ గణేశ్‌ను గ్రూప్‌ టెక్నాలజీ ఆఫీసర్‌గా ఎంపిక చేసినట్లు కంపెనీ ఈ సందర్భంగా పేర్కొంది.

మూడో రోజూ నష్టాలు

- అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం
- ఐటీ, ఫార్మా షేర్లలో అమ్మకాలు
- సెన్సెక్స్‌ నష్టం 115 పాయింట్లు
- 19,750 దిగువకు నిఫ్టీ



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాలు, క్రూడాయిల్‌ ధరల పెరుగుదల ప్రభావాలతో స్టాక్‌ సూచీలు మూడోరోజూ నష్టాలు చవిచూశాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్‌ 115 పాయింట్లు నష్టపోయి 66,167 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 19 పాయింట్లు పతనమై 19,732 వద్ద నిలిచింది. ప్రతికూల అంతర్జాతీయ సంకేతాల ప్రభావంతో ఉదయం సూచీలు మిశ్రమంగా మొదలయ్యాయి. రోజంతా పరిమిత శ్రేణిలో లాభ, నష్టాల మధ్య ఊగిసలాడాయి. ప్రథమార్థంలో బ్యాంకింగ్, రియల్టీ, ఐటీ స్టాకుల్లో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఒక దశలో సెన్సెక్స్‌ 244 పాయింట్లు క్షీణించి 66,039 వద్ద, నిఫ్టీ 59 పాయింట్లు పతనమై 19,692 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే ద్వితీయార్థంలో మెటల్, ఆటో, కన్జూమర్‌ డ్యూరబుల్స్‌ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నష్టాలు కొంతమేర తగ్గాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 594 కోట్ల షేర్లు విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,184 కోట్ల షేర్లు కొన్నారు. పాలస్తీనా–ఇజ్రాయెల్‌ సంక్షోభం, అమెరికా ద్రవ్యోల్బణ పెరుగుదల భయాలతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

ఫెడరల్‌ బ్యాంక్‌ క్యూ2 రికార్డ్‌

నికర లాభం రూ. 994 కోట్లు



ముంబై: ప్రయివేట్‌ రంగ సంస్థ ఫెడరల్‌ బ్యాంక్‌ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్‌ (క్యూ2)లో నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 994 కోట్లను తాకింది. ఒక త్రైమాసికానికి బ్యాంక్‌ చరిత్రలోనే ఇది అత్యధికంకాగా.. స్టాండెలోన్‌ లాభం సైతం 36 శాతం అధికంగా రూ. 954 కోట్లకు చేరింది. ప్రొవిజన్లు భారీగా తగ్గడం ఇందుకు సహకరించింది. నికర వడ్డీ ఆదాయం 17 శాతం ఎగసి రూ. 2,056 కోట్లను తాకింది. అడ్వాన్సులు 20 శాతం మెరుగుపడటంతో నికర వడ్డీ మార్జిన్లు స్వల్పంగా బలపడి 3.16 శాతానికి చేరాయి. ఇతర ఆదాయం రూ. 610 కోట్ల నుంచి రూ. 730 కోట్లకు వృద్ధి చూపింది.

ఎన్‌పీఏలు తగ్గాయ్‌

ప్రస్తుత సమీక్షా కాలంలో ఫెడరల్‌ బ్యాంక్‌ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.46 శాతం నుంచి 2.26 శాతానికి తగ్గాయి. గత 8–9 ఏళ్లలో అత్యుత్తమ రుణ నాణ్యత నమోదైనట్లు బ్యాంక్‌ సీఈవో, ఎండీ శ్యామ్‌ శ్రీనివాసన్‌ పేర్కొన్నారు. స్లిప్పేజీలు రూ. 375 కోట్ల నుంచి రూ. 365 కోట్లకు తగ్గిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇటీవల పెట్టుబడులను సమీకరించిన నేపథ్యంలో బ్యాంక్‌ కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్‌) 15.5 శాతానికి చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఫెడరల్‌ బ్యాంక్‌ షేరు 0.7% నీరసించి రూ. 148.5 వద్ద ముగిసింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ జోరు

- క్యూ2 నికర లాభం రూ. 16,811 కోట్లు
- నికర వడ్డీ ఆదాయం రూ. 27,385 కోట్లు



ముంబై: మార్టిగేజ్‌ దిగ్గజం, మాతృ సంస్థ.. హెచ్‌డీఎఫ్‌సీ విలీనం తదుపరి ప్రయివేట్‌ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర పనితీరు చూపింది. కన్సాలిడేటెడ్‌ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్‌ (క్యూ2)లో రూ. 16,811 కోట్ల నికర లాభం ఆర్జించింది. స్టాండెలోన్‌ నికర లాభం రూ. 15,976 కోట్లకు చేరింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో విలీన సంస్థ నికర లాభం రూ. 11,162 కోట్లుగా మదింపు వేసింది. ఇక గత క్యూ2 స్టాండెలోన్‌ లాభం రూ. 10,606 కోట్లుగా లెక్కకట్టింది.

మార్జిన్లు డీలా

గతంలో 4 శాతానికిపైగా నికర వడ్డీ మార్జిన్లు సాధిస్తూ వచ్చిన నంబర్‌ వన్‌ ప్రైవేట్‌ రంగ బ్యాంక్‌.. హెచ్‌డీఎఫ్‌సీ ప్రస్తుత సమీక్షా కాలంలో 3.4 శాతం మార్జిన్లు ప్రకటించింది. ఇందుకు విలీనం తదుపరి బ్యాలన్స్‌షీట్‌లో తక్కువ ఈల్డ్స్‌ ఆర్జించే సెక్యూర్డ్‌ ఆస్తులు(రుణాలు) పెరగడం ప్రభావం చూపింది. అంతేకాకుండా విలీనానికి మార్కెట్‌ రుణ సమీకరణ వ్యయాలు సైతం పెరిగాయి. అయితే నికర వడ్డీ మార్జిన్లు పుంజుకోనున్నట్లు బ్యాంక్‌ సీఎఫ్‌వో శ్రీనివాసన్‌ వైద్యనాథన్‌ పేర్కొన్నారు. అధిక ఈల్డ్స్‌ అందించే ఆస్తులు పెరగడం, చౌకగా సమీకరించిన డిపాజిట్లతో మార్కెట్‌ రుణాలను రీప్లేస్‌ చేసిన తదుపరి మార్జిన్లు మెరుగుపడనున్నట్లు వివరించారు.

30 శాతం అప్‌

ఈ ఏడాది క్యూ2లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ నికర వడ్డీ ఆదాయం 30 శాతం జంప్‌చేసి రూ. 27,385 కోట్లను తాకింది. గతేడాది క్యూ2లో రూ. 21,021 కోట్ల వడ్డీ ఆదాయాన్ని సాధించాయి. ఇక ఇతర ఆదాయం రూ. 7,596 కోట్ల నుంచి రూ. 10,708 కోట్లకు జంప్‌ చేసింది. అటు డిపాజిట్లు, ఇటు అడ్వాన్సులు(రుణాలు).. రూ. లక్ష కోట్ల చొప్పున నమోదయ్యాయి. డిపాజిట్లు 5.3 శాతం, అడ్వాన్సులు 4.9 శాతం చొప్పున వృద్ధి చూపాయి. స్థూల మొండిబకాయిలు 1.41 శాతం నుంచి 1.34 శాతానికి తగ్గాయి. మొత్తం ప్రొవిజన్లు రూ. 3,240 కోట్ల నుంచి రూ. 2,903 కోట్లకు వెనకడుగు వేశాయి. ఎడ్యుకేషన్‌ రుణాలందించే క్రెడిలా విక్రయాన్ని పూర్తి చేయవలసి ఉన్నట్లు వైద్యనాథన్‌ పేర్కొన్నారు. ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌ లిస్టింగ్‌ ప్రణాళికలేవీ లేవని స్పష్టం చేశారు. నికరంగా 16,000 మంది ఉద్యోగులను తీసుకోవడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 1.98 లక్షలకు చేరినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం క్షీణించి రూ. 1,530 వద్ద ముగిసింది.

కేశ సంరక్షణకు లీ 'నేచురల్‌ కేర్‌'



హైదరాబాద్, బిజినెస్‌ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న లీ హెల్త్‌ డొమెయిన్‌.. జుట్టు, చర్మం, గోర్ల సహజ పునరుజ్జీవనం కోసం నేచురల్‌ కేర్‌ పేరుతో హెయిర్‌ ఆయిల్, షాంపూ, సాఫ్ట్‌ జెల్‌ క్యాప్సూల్స్‌తో కూడిన కిట్‌ను విడుదల చేసింది. మందార, ఉల్లి, కలబంద, భృంగరాజ్, ఉసిరి, అరుదైన ఔషధాలు, కొల్లాజెన్, స్పిరులినా వంటి అధిక శక్తివంతమైన బయోప్రొటీన్‌ సమ్మేళనాలతో వీటిని అభివృద్ధి చేశారు. నేచురల్‌ కేర్‌ కిట్‌ చుండ్రు, జుట్టు రాలడాన్ని నియంత్రిస్తుందని, కమిలిన చర్మాన్ని పునరుజ్జీవింపజేస్తుందని, పెళుసైన గోళ్లను మెరుగుపరచడంలో సాయపడుతుందని కంపెనీ డైరెక్టర్‌ ఆళ్ల లీలా రాణి తెలిపారు. లీ హెల్త్‌ తయారీ న్యూట్రాస్యూటికల్‌ ఉత్పత్తులు విదేశాల్లోనూ వినియోగదార్ల ఆదరణను అందుకున్నాయని ఆమె చెప్పారు.

కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్‌తో ఎంపీ విజయసాయిరెడ్డి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి హర్దీప్‌ సింగ్‌ పురితో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయి రెడ్డి భేటీ అయ్యారు. సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసిన విజయసాయిరెడ్డి ఏపీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన, బెనిఫిషియరీ–లెడ్‌ ఇండివిడ్యువల్‌ హౌస్‌ కన్‌స్ట్రక్షన్‌/ఎన్‌హాన్స్‌మెంట్‌ (బీఎల్‌సీ), అఫర్డబుల్‌ హౌసింగ్‌ ఇన్‌ పార్ట్‌నర్‌షిప్‌ (ఏహెచ్‌పీ) పథకాల అమలుపై చర్చించారు. ఈ పథకాల అమలుపై కేంద్రం మరింత చొరవ చూపించాలని ఎంపీ విజయసాయిరెడ్డి కేంద్ర మంత్రిని కోరారు.

ఇన్నర్‌'లో బాబు ముందస్తు బెయిల్‌పై విచారణ 18కి వాయిదా

సాక్షి,అమరావతి: ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు అలైన్‌మెంట్‌ మార్పులో జరిగిన అక్రమాలు, క్విడ్‌ ప్రో కోపై సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్‌ మంజూరు చేయాలంటూ మాజీ సీఎం చంద్రబాబునాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ బుధవారానికి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు రాగా, సీఐడీ స్పెషల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ దుష్యంత్‌ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ కేసులో తాము పూర్తి వివరాలతో కౌంటర్‌ దాఖలు చేశామని చెప్పారు. తదుపరి విచారణ గురువారానికి వాయిదా వేయాలని కోరారు. ఈ సమయంలో చంద్రబాబు తరపు సీనియర్‌ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్‌ విచారణ బుధవారానికి వాయిదా వేయాలని కోరారు. దీంతో న్యాయమూర్తి విచారణను బుధవారానికి వాయిదావేస్తూ.. పీటీ వారెంట్‌ విషయంలో ముందుకెళ్లొద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు.

సీఐడీ ముందుకు 'కిలారు'..

ఎట్టకేలకు విచారణకు హాజరైన లోకేశ్‌ బినామీ



సాక్షి, అమరావతి : చంద్రబాబు అక్రమాలు, అవినీతి కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు, షెల్‌ కంపెనీల ద్వారా అక్రమ నిధులు చేరవేయడంలో కీలక పాత్రధారి అయిన కిలారు రాజేశ్‌ సీఐడీ విచారణకు హాజరయ్యారు. స్కిల్‌ స్కాంలో చంద్రబాబు అరెస్టు అయినప్పటి నుంచి పరారీలో ఉన్న ఆయన అని వార్యంగా సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్‌) అధికారుల విచారణకు సోమవారం వచ్చారు. దీంతో తాడేపల్లిలోని సిట్‌ కార్యాలయంలో సీఐడీ అధికారులు ఆయన్ని దాదాపు ఆరుగంటలపాటు విచారించారు. స్కిల్‌ స్కాం, అసైన్డ్‌ భూముల దోపిడీ, అమరావతిలో తాత్కాలిక రాజధాని భవనాల కాంట్రాక్టుల కేటాయింపు, ఇన్నర్‌ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ కుంభకోణం, ఫైబర్‌నెట్‌ కాంట్రాక్టుల ఖరారు.. ఇలా చంద్రబాబు, లోకేశ్‌ సూత్రధారులుగా సాగిన అన్ని కుంభకోణాల అక్రమ నిధుల తరలింపులో కిలారు రాజేశ్‌ పాత్రకు సంబంధించి దర్యాప్తులో వెలుగు చూసిన కీలక ఆధారాలతో ఆయన్ని విచారించి ఉక్కిరిబిక్కిరి చేశారు.

కాగా తాను పరారు కాలేదని సీఐడీ దర్యాప్తునకు సహకరిస్తానని కిలారు రాజేశ్‌ చెప్పారు. అనంతరం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. తాను ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నానని.. తనకు సీఐడీ నోటీసులు ఇవ్వడంతో విచారణకు హాజరయ్యానన్నారు. ఎన్నిసార్లు పిలిచినా వచ్చి విచారణకు సహకరిస్తానన్నారు.

విభిన్న కోణాల్లో సిట్‌ విచారణ..

కిలారు రాజేశ్‌ను సీఐడీ అధికారులు విభిన్న కోణాల్లో విచారించినట్లు విశ్వసనీయ సమాచారం. స్కిల్‌ స్కాం దర్యాప్తులో షెల్‌ కంపెనీల ద్వారా ఆర్థిక లావాదేవీల్లో కిలారు రాజేశ్‌ పేరు ప్రముఖంగా బయటపడింది. ఆ ఆధారాలతో రూపొందించిన ప్రశ్నావళి నుంచి సీఐడీ అధికారులు ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. అవి..

- స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ (ఏపీఎస్‌ఎస్‌డీసీ) ప్రాజెక్టు వ్యవహారాల్లో ఎలాంటి పాత్ర పోషించారని సిట్‌ అధికారులు ప్రశ్నించగా.. తనకు ఆ ప్రాజెక్టుతో సంబంధం లేదని చెప్పేందుకు యత్నించారు. మరి ఎలాంటి పాత్ర లేనప్పుడు చంద్రబాబు అరెస్టు తరువాత ఎక్కడికి వెళ్లారు.. ఎందుకు వెళ్లారని రాజేశ్‌ను సిట్‌ అధికారులు నిలదీశారు. తాను ఎక్కడికీ పరారు కాలేదని.. ఏపీలోనే ఉన్నానని చెప్పారు. దీంతో.. ఏపీలో ఎక్కడున్నారని సిట్‌ అధికారులు సూటిగా ప్రశ్నించేసరికి సమాధానం చెప్పకుండా దాటవేసేందుకు యత్నించారు.
- చంద్రబాబు పీఎస్‌ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్‌ పార్థసానిలతోపాటు షెల్‌ కంపెనీల ద్వారా కిలారు రాజేశ్‌ జరిపిన ఆర్థిక లావాదేవీలపైనా అధికారులు ఆయన్ని ప్రశ్నించారు. తానెలాంటి లావాదేవీలు నిర్వహించలేదని రాజేశ్‌ బదులిచ్చారు. కీలకమైన బ్యాంకు ఖాతాలను ముందుంచి ప్రశ్నించడంతో ఆయన ఖంగుతిన్నట్లు సమాచారం. షెల్‌ కంపెనీల నుంచి వసూలుచేసిన నగదును ఎక్కడికి చేర్చారని సిట్‌ అధికారుల ప్రశ్నలతో రాజేశ్‌ తడబాటుకు గురయ్యారు. ఆ విషయంపై సమాధానం చెప్పకుండా మౌనం వహించినట్లు తెలిసింది.
- లోకేశ్‌తో ఉన్న సన్నిహిత సంబంధాలపై సిట్‌ అధికారుల ప్రశ్నలతో కిలారు రాజేశ్‌ తీవ్ర తడబాటుకు గురయ్యారు. షెల్‌ కంపెనీలతో ఈ–మెయిల్స్‌ సమాచారాన్ని లోకేశ్, పెండ్యాల శ్రీనివాస్‌లతో ఎందుకు పంచుకున్నారని ప్రశ్నించడంతో షాక్‌ కు గురయ్యారు. తానెలాంటి ఈ–మెయిల్స్‌ పంపలేదని బుకాయించేందుకు యత్నించగా సిట్‌ అధి కారులు సంబంధిత ఈ–మెయిల్స్‌ కొన్ని చూపించినట్లు తెలుస్తోంది. ఇక లోకేశ్, పెండ్యాల శ్రీని వాస్, మనోజ్‌ పార్థసాని, షెల్‌ కంపెనీల ప్రతినిధులతో జరిపిన ఫోన్‌కాల్, వాట్సాప్‌ డేటాను కూడా చూపిస్తూ సిట్‌ అధికారులు విభిన్న కోణాల్లో కిలారును ప్రశ్నించడంతో మౌనమే సమాధానమైంది. స్కిల్, అమరావతిలో తాత్కాలిక భవనాల నిర్మాణ కాంట్రాక్టుల ఖరారు, అసైన్డ్‌ భూముల అన్యాక్రాంతం, ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు అలైన్‌మెంట్, ఫైబర్‌నెట్‌ టెండర్ల ఖరారు ఇలా అన్ని కుంభకోణాల్లోనూ ఆయన పాత్ర ఉండటంపై సిట్‌ అధికారులు నిలదీశారు. అప్పటివరకు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన కిలారు రాజేశ్‌ కాస్త మెత్తబడి తనకెలాంటి ప్రమేయంలేదని చెబుతూ ప్రాధేయపడినట్లు తెలుస్తోంది. సీఐడీ దర్యాప్తునకు సహకరిస్తానని ఎన్నిసార్లు పిలిచినా విచారణకు హాజరవుతానని చెప్పారని సమాచారం. విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని మంగళవారం కూడా విచారణకు పిలిచారు.

వారి విషయంలో చట్ట ప్రకారం నడుచుకుంటాం..

హైకోర్టుకు నివేదించిన సీఐడీ స్పెషల్‌ పీపీ

సాక్షి, అమరావతి : ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు అలైన్‌మెంట్‌ మార్పులో జరిగిన అక్రమాలు, క్విడ్‌ ప్రో కోపై నమోదు చేసిన కేసులో నిందితులు గా ఉన్న మాజీ మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, బావమరిది రాపూరు సాంబశివరావు, నారాయణ బినామీ పొత్తూ రు ప్రమీల విషయంలో సీఆర్‌పీసీ సెక్షన్‌41(ఏ)ను అనుసరిస్తామని సీఐడీ సోమవారం హైకోర్టుకు నివేదించింది. చట్ట ప్రకారం వారికి నోటీసులు జారీ చేస్తామని, వారిని న్యాయవాది సమక్షంలో విచారిస్తామని సీఐడీ స్పెషల్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ దుష్యంత్‌రెడ్డి వివరించారు. దీంతో న్యాయస్థానం ఈ వ్యాజ్యాల్లో తదుపరి ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదని స్పష్టం చేసింది. పిటిషన్లను మూసివేస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు కేసులో రమాదేవి, సాంబశివరావు, ప్రమీలను సీఐడీ ఇటీవల నిందితులుగా చేర్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారు తమకు ముందస్తు బెయిల్‌ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్‌ సురేష్‌రెడ్డి విచారణ జరిపారు.

కౌలు చెల్లించాల్సింది సీఆర్‌డీఏ..

రాష్ట్ర ప్రభుత్వం కాదు

రాజధాని రైతుల కౌలు వ్యవహారంలో హైకోర్టులో కీలక పరిణామం

- కౌలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదని న్యాయవాది ఇంప్లీడ్‌ పిటిషన్‌
- రాజధాని కోసం రూ.1000 కోట్లతో ఫండ్‌ ఏర్పాటు చేశారు
- ఆ ఫండ్‌ నుంచే సీఆర్‌డీఏ కౌలు చెల్లించాలి
- ఇంప్లీడ్‌ పిటిషన్‌ను అనుమతించిన హైకోర్టు
- తీవ్ర అభ్యంతరం తెలిపిన రాజధాని పిటిషనర్లు
- విచారణ ఈ నెల 30కి వాయిదా

సాక్షి, అమరావతి : రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు చెల్లింపు విషయంలో హైకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. భూములిచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం వార్షిక కౌలు చెల్లించడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది బైరెడ్డి సాయి ఈశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన ఇంప్లీడ్‌ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. దీనిపై కౌంటర్లు దాఖలు చేయాలని భూములిచ్చిన పిటిషనర్లను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ బొప్పూడి కృష్ణమోహన్‌ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంప్లీడ్‌ పిటిషన్‌ను అనుమతించినందుకు 'మీరు పిటిషనర్ల పట్ల ప్రతికూల అభిప్రాయంతో ఉన్నారం'టూ న్యాయమూర్తిపై రాజధాని రైతుల తరపు సీనియర్‌ న్యాయవాది ఉన్నం మురళీధరరావు తీవ్ర ఆరోపణ చేశారు. రాజధానికి భూములిచ్చినందుకు మే లో చెల్లించాల్సిన వార్షిక కౌలు ఇప్పటివరకు చెల్లించలేదంటూ అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య, రాజధాని రైతు పరిరక్షణ సమితితో సహా పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్‌ కృష్ణమోహన్‌ సోమవారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా బైరెడ్డి సాయి ఈశ్వరరెడ్డి తరపున న్యాయవాది వివేకానంద విరూపాక్ష వాదనలు వినిపిస్తూ.. రాజధానికి భూములిచ్చిన వారికి రాష్ట్ర ప్రభుత్వం కౌలు చెల్లించడాన్ని సవాలు చేస్తూ ఇంప్లీడ్‌ పిటిషన్‌ దాఖలు చేశామని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. రాజధాని కోసం సేకరించిన భూముల కోసం రూ.1,000 కోట్లతో డెవలప్‌మెంట్‌ ఫండ్‌ ఏర్పాటు చేశారని, ఇది సీఆర్‌డీఏ వద్ద ఉంటుందని తెలిపారు. ఈ ఫండ్‌ నుంచి సీఆర్‌డీఏనే కౌలు చెల్లించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా 2015 నుంచి రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోందని, ఇది చట్ట విరుద్ధమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ లోటు కారణంగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నట్లు పత్రికల్లో రోజూ కథనాలు వస్తున్నాయని, ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో కోట్ల రూపాయలను రాజధానికి భూములిచ్చారన్న పేరుతో కేవలం ఓ ప్రాంతానికి చెందిన వ్యక్తులకే చెల్లించడం సరి కాదని అన్నారు. సీఆర్‌డీఏ చట్టంలోని సెక్షన్‌ 25 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి విరుద్ధంగా ఎలాంటి క్లెయిమ్స్‌ లేవనెత్తడానికి వీల్లేదన్నారు. సీఆర్‌డీఏ కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు కోరడానికి వీల్లేదని, రాజధాని విషయంలో నిధులను సమకూర్చుకోవాల్సిన బాధ్యత సీఆర్‌డీఏపై ఉందని చెప్పారు. వాదనలు వినిపించేందుకు తమను ఇంప్లీడ్‌ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌ను అనుమతిస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్‌ కృష్ణమోహన్‌ తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టేందుకే...

ఇంప్లీడ్‌ పిటిషన్‌ను అనుమతించడంపై రైతుల తరపు సీనియర్‌ న్యాయవాది ఉన్నం మురళీధరరావు తీవ్ర అభ్యంతరం తెలిపారు. తాము ఎప్పుడో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు వినకుండా ఇంప్లీడ్‌ పిటిషన్‌ను అనుమతించడం సరికాదన్నారు. రైతులకు కౌలు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులను ఇబ్బంది పెడుతున్నారని, ఇందులో భాగంగానే ఇంప్లీడ్‌ పిటిషన్‌ దాఖలైందని తెలిపారు. మీరు (జస్టిస్‌ కృష్ణమోహన్‌) తమ పట్ల ప్రతికూల అభిప్రాయం (ప్రిజుడీస్‌) కలిగి ఉన్నారని ఆరోపించారు. రాజకీయ కారణాలతో ఇంప్లీడ్‌ పిటిషన్‌ దాఖలు చేశారన్నారు. రాజకీయాలతో ఈ పిటిషన్‌కు సంబంధం లేదని, పిటిషనర్‌ న్యాయవాది అని వివేకానంద వివరించారు. ఇంప్లీడ్‌ పిటిషన్‌ను అనుమతించిన నేపథ్యంలో కౌంటర్‌ దాఖలు చేయాలని పిటిషనర్లకు న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఆ తరువాత పూర్తి విచారణ జరిపి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పారు. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేశారు.

రాజధాని భూముల వెనుక చీకటి బాగోతం

అసైన్డ్‌ భూముల వ్యవహారంలో కీలక వివరాలు లభించాయన్న సీఐడీ

- వాటిని కోర్టు ముందుంచుతున్నామని.. పరిగణనలోకి తీసుకోవాలని నివేదన
- చంద్రబాబు, నారాయణ వ్యాజ్యాల్లో అవి ఎంతో కీలకమని వెల్లడి
- నవంబర్‌ 1వ తేదీకి వాయిదా

సాక్షి, అమరావతి: అమరావతి రాజధాని భూముల వ్యవహారం వెనుక చీకటి బాగోతాలు నడిచినట్టు సీఐడీ నిగ్గు తేల్చింది. అసైన్డ్‌ భూముల కొనుగోలు, బదలాయింపులో చోటుచేసుకున్న భారీ అక్రమాలపై మరిన్ని కీలక వివరాలు లభించాయని సీఐడీ విభాగం సోమవారం హైకోర్టుకు నివేదించింది. ఆ వివరాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఐడీ తరఫున అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ ఎస్‌.దుష్యంత్‌రెడ్డి హైకోర్టును కోరారు. అందుకు సంబధించిన ఆడియో క్లిప్పులను కోర్టు ముందు ఉంచుతున్నామని తెలిపారు. ఆడియో క్లిప్పులకు సంబంధించిన సంభాషణలను రాతపూర్వకంగా కూడా కోర్టు ముందు ఉంచామని తెలిపారు. వీడియో క్లిప్పింగులను కూడా మంగళవారం కోర్టు ముందు ఉంచుతామని వివరించారు.

కేసులో కీలక ఆధారాలివి

తాజాగా తమకు లభ్యమైన ఆధారాలు ఈ కేసును తేల్చడానికి అత్యంత కీలకమని దుష్యంత్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రి నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యాల్లో తిరిగి విచారణ చేపట్టాలని కోర్టును కోరారు. ఆ వ్యాజ్యాల్లో తీర్పును రిజర్వ్‌ చేసినందున, వాటిని తిరిగి తెరవాలని అభ్యర్థించారు. ఈ మేరకు తాము అనుబంధ పిటిషన్లు వేశామని చెప్పారు. దీనిపై చంద్రబాబు, నారాయణ తరపు సీనియర్‌ న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. సీఐడీ దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాల విచారణార్హతపై తేల్చాలన్నారు. తమ అభ్యంతరాలను కోర్టు ముందుంచేందుకు కొంత గడువు ఇవ్వాలని కోర్టును కోరారు. ఇందుకు న్యాయస్థానం అంగీకరిస్తూ.. తదుపరి విచారణను నవంబర్‌ 1వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్‌ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కృష్ణప్రియ చెప్పిన వివరాలు కోర్టుకు సమర్పణ

రాజధాని అసైన్డ్‌ భూముల కొనుగోలు, బదలాయింపు వ్యవహారంలో భారీ అక్రమాలు జరిగాయంటూ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ 2021లో కేసు నమోదు చేసింది. దీనిని కొట్టేయాలంటూ చంద్రబాబు, నారాయణ అదే ఏడాది హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు వేసి సీఐడీ దర్యాప్తుపై స్టే పొందారు. ఆ తరువాత ఈ వ్యాజ్యాలపై ఈ ఏడాది ఆగస్టులో న్యాయమూర్తి జస్టిస్‌ కృపాసాగర్‌ విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఆగస్టు 30న తీర్పు రిజర్వ్‌ చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాల్లో న్యాయస్థానం తీర్పు వెలువరించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో సీఐడీ తాజాగా అనుబంధ పిటిషన్లు దాఖలు చేసింది. ఈ వ్యాజ్యాల్లో రాజధాని భూముల కొనుగోళ్ల గురించి నారాయణ మరదలు కృష్ణప్రియ చెప్పిన వివరాలను పొందుపరిచింది. నారాయణ వియ్యంకుడు గంటా శ్రీనివాసరావు, ఆయన భార్య శారద, వారి సమీప బంధువులు, నారాయణ ఇతర బంధువుల పేర్ల మీద ఉన్న భూముల గురించి ఆమె చెప్పిన విషయాలను అందులో ప్రస్తావించారు.

క్లుప్తంగా

బాబు అండ్‌కో దోచుకున్నదంతా కక్కించాలి

1,114వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

తాడికొండ: పూలింగ్ పేరుతో అమరావతి రైతులను నిలువునా ముంచి.. తాత్కాలిక నిర్మాణాల పేరుతో కాంట్రాక్టర్ల వద్ద నుంచి బాబు అండ్ కో దోచుకున్నదంతా నయాపైసా తోసహా కక్కించాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు న్యాయస్థానాలకు విజ్ఞప్తి చేశారు. రాజధాని పేరుతో అమరావతి ప్రాంతంలో దోచుకొని దొరకకుండా తిరుగుతున్న మిగిలిన బాబు బినామీ దొంగలందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,114వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. అధికారం అడ్డుపెట్టుకొని గజదొంగలా దోచుకుతిన్న బాబును అమాయకుడు, నీతివంతుడు అని సృష్టించేందుకు కులవాదులు, ఎల్లో మీడియా పడుతున్న పాట్లు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నాయకులు గురునాథం, సాంబయ్య, ఆదాం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేవు

ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేవని ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై ఇంధన శాఖ అధికారులతో సోమవారం మంత్రి పెద్దిరెడ్డి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ కోతలంటూ ఈనాడు పత్రిక, ఈటీవీ తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎల్లోమీడియా చేసే దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆశించిన మేరకు హైడల్, సోలార్ ప్లాంట్ల నుంచి విద్యుత్ ఉత్పత్తి లేకపోయినా.. బయటి నుంచి కొనుగోలు చేస్తూ వ్యవసాయ, గృహ అవసరాలు, పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా సమర్థంగా విద్యుత్ సరఫరా అందిస్తున్నామని వివరించారు.

షేర్ల కోసం.. తుపాకీతో రామోజీ బెదిరింపు

▶ మొదటి పేజీ తరువాయి

మరికొన్ని ఫోర్జరీ సంతకాలు, నకిలీ డాక్యుమెంట్లతో తతంగం కానిచ్చేశారు. ఆ విధంగా 2016 నాటికి రూ.1,59,69,600 మూలధన విలువ ఉన్న 288 షేర్లను అక్రమంగా కై వసం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఇటీవల గుర్తించిన బాధితుడు యూరి రెడ్డి ఏపీ సీఐడీకి ఈనెల 13న ఫిర్యాదు చేయడంతో రామోజీరావు అక్రమాల బండారం బట్టబయలైంది. జీజే రెడ్డి పెద్ద కుమారుడు మార్టిన్‌రెడ్డి ప్రస్తుతం విదేశాల్లో ఉండగా.. భారత్‌లో నివసిస్తూ తన కుటుంబ ఆస్తి వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న ఆయన రెండో కుమారుడు యూరి రెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేశారు. ప్రాథమిక ఆధారాలు ఉండటంతో రామోజీరావు, శైలజాకిరణ్‌లపై సీఐడీ కేసు నమోదు చేసింది. సెక్షన్లు 420, 467, 120–బి రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఏ–1గా రామోజీరావు, ఏ–2గా శైలజ కిరణ్‌లను నిందితులుగా చేర్చింది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ సంచలనాత్మక కేసు వివరాలివీ..

ఆదరించిన చేయినే కాటేసిన రామోజీ..

కృష్ణాజిల్లా జొన్నలపాడుకు చెందిన జీజే రెడ్డి చెకోస్లోవేకియాలో ఉన్నత విద్య పూర్తిచేసిన అనంతరం ఢిల్లీలో నవభారత్ ఎంటర్‌ప్రైజెస్ అనే కంపెనీని ఏర్పాటుచేశారు. 1960లో కమ్యూనిస్ట్ పార్టీ నేత కొండపల్లి సీతారామయ్య సిఫార్సుతో తన జిల్లాలోని పెదపారుపూడికి చెందిన రామోజీరావుకు తన కంపెనీలో టైపిస్ట్‌గా ఉద్యోగం ఇచ్చారు. అనంతరం జీజే రెడ్డి ఆర్థిక సహకారంతో రామోజీరావు మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను 1962లో నెలకొల్పారు. ఆ కంపెనీలో జీజే రెడ్డికి 288 షేర్లు ఉన్నాయి. జీజే రెడ్డి 1985లో చెకోస్లోవేకియాలో చనిపోయారు. ఆయన భార్య కూడా 1986లో మరణించారు. ఆ తర్వాత.. జీజే రెడ్డి ఇద్దరు కుమారులు మార్టిన్, యూరి రెడ్డి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో తమ తండ్రి వాటా షేర్ల కోసం రామోజీరావును చాలాసార్లు సంప్రదించినప్పటికీ ఆయనేమీ చెప్పలేదు.

పత్రికల ద్వారా తెలుసుకుని సంప్రదిస్తే..

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో షేర్ల వివరాలను 2014లో పత్రికల్లో వచ్చిన వార్తల ద్వారా మార్టిన్‌రెడ్డి, యూరి రెడ్డి తెలుసుకున్నారు. అప్పటి నుంచి రెండేళ్లపాటు ప్రయత్నించిన తరువాత 2016, సెప్టెంబరు 29న రామోజీరావు తనను కలిసేందుకు ఆ సోదరులు ఇద్దరికీ అపాయింట్‌మెంట్ ఇచ్చారు. తమ షేర్లకు సంబంధించి షేర్ సర్టిఫికెట్ ఇవ్వాలని మార్టిన్‌రెడ్డి రామోజీని కోరారు. అప్పుడు 2007–08 వార్షిక సంవత్సరానికి సంబంధించి షేర్లపై డివిడెండ్ కింద రూ.39,74,400 విలువైన యూనియన్ బ్యాంక్ చెక్ (నంబరు 137991)ను ఆయన వారికిచ్చారు. మిగిలిన ఏళ్లకు సంబంధించిన డివిడెండ్ మొత్తాన్ని కూడా చెల్లించాలని యూరి రెడ్డి కోరారు. అవన్నీ సెటిల్ చేస్తానని చెప్పి రామోజీరావు వెళ్లిపోయారు.



రామోజీ, శైలజాకిరణ్‌లపై నమోదైన ఎఫ్ఐఆర్

తుపాకి పెట్టి బెదిరించి మరీ..

అనంతరం.. రామోజీరావు సిబ్బంది మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డిలను ఓ గదిలో కూర్చోమని చెప్పి వెళ్లారు. కాసేపటికి రామోజీ ఆ గదిలోకొచ్చి ఓ రూ.100 విలువైన స్టాంపు పేపర్‌పై రాసిన అఫిడవిట్ మీద మార్టిన్‌రెడ్డిని సంతకం చేయమన్నారు. తన వాటా షేర్లను తన సోదరుడు యూరి రెడ్డి పేరిట మార్చేందుకు ఎలాంటి అభ్యంతరంలేదని అందులో రాసి ఉంది. అదే సమయంలో 2016, అక్టోబరు 5వ తేదీతో ఉన్న రూ.2,88,000 పోస్ట్ డేటెడ్ చెక్ (నంబరు 296460)ను యూరి రెడ్డికి ఇచ్చి తేదీలేని ఫామ్ ఎస్‌హెచ్–4పై సంతకం చేయమని రామోజీరావు చెప్పారు. కానీ, దీనిపై సంతకం చేసేందుకు యూరి రెడ్డి నిరాకరించారు. వెంటనే రామోజీరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. తుపాకీ తీసి అన్నదమ్ములు మార్టిన్ రెడ్డి, యూరి రెడ్డిల తలకు గురిపెట్టారు. 'మిమ్మల్ని కాపాడటానికి ఇక్కడ ఎవరూ లేరు' అని బెదిరించారు. దీంతో ప్రాణభయంతో ఆ ఫామ్‌పై యూరి రెడ్డి సంతకం చేశారు. తమ షేర్లను ఎవరి పేరిట బదిలీ చేస్తోందనిగానీ, తేదీగానీ ఆ ఫామ్‌పై లేవు. రామోజీరావు తుపాకితో బెదిరించడంతో కేవలం ప్రాణభయంతోనే ఆ ఫామ్‌పై సంతకాలు చేసి వారు బయటకొచ్చారు.

ఫోర్జరీ సంతకాలతో అక్రమంగా బదిలీ..

మరోవైపు.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలపై ఇటీవల ఏపీ సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో వాటాదారు అయిన యూరి రెడ్డి తన షేర్ల గురించి తెలుసుకోవాలని భావించారు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయంలో పరిశీలించగా ఆయన పేరిట ఒక్క షేర్ కూడా లేదని తెలుసుకుని ఆశ్చర్యపోయారు. ఆయన పేరిట ఉన్న 288 షేర్లను 2016లోనే శైలజాకిరణ్ పేరిట బదిలీ చేసినట్లు గుర్తించారు. తాను సంతకాలు చేయకుండా ఎలా బదిలీ చేశారా అని పరిశీలిస్తే రామోజీరావు కుతంత్రం బయటపడింది. యూరి రెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసి మరీ ఆయన వాటా షేర్లను శైలజాకిరణ్ పేరిట అక్రమంగా బదిలీ చేసేశారన్నది వెల్లడైంది. షేర్ల బదిలీకి కంపెనీల చట్టంలో నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించకుండానే ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాలతో కథ నడిపించేశారు.

చెక్కు మార్చలేదు.. షేర్ల బదిలీకి అంగీకరించలేదు..

మరోవైపు.. ప్రాణభయంతో ఆ ఫామ్‌పై సంతకం చేసినప్పటికీ.. తమకు రామోజీరావు ఇచ్చిన చెక్కును మాత్రం వారు నగదుగా మార్చుకోలేదు. ఎందుకంటే షేర్లు బదిలీ చేయడం సమ్మతం కాదు కాబట్టి. నిజానికి.. షేర్లు బదిలీ చేయాలంటే ఒక్క పత్రంపై సంతకంచేస్తే సరిపోదు. అందుకు సంబంధించిన చాలా పత్రాలపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. చిట్‌ఫండ్స్ చట్టం, కంపెనీల చట్టం ప్రకారం నిర్దేశించిన అన్ని పత్రాలపై తాను సంతకాలు చేయలేదు కాబట్టి తాను షేర్లు బదిలీ చేసినట్లు కాదని యూరి రెడ్డి ధీమాగా ఉన్నారు. అలాగే, రామోజీరావు ఇచ్చిన చెక్కును నగదుగా మార్చుకోలేదు కాబట్టి తాను షేర్లు బదిలీకి అంగీకరించలేదనడానికి బలమైన సాక్ష్యంగా ఉందని ఆయన భావించారు. కానీ, ప్రాణభయంతో మరోసారి రామోజీని సంప్రదించేందుకు సాహసించలేదు. తమ షేర్లపై రావల్సిన డివిడెండ్‌ను కూడా అడగలేకపోయారు. దీంతో.. 2016 నాటికి ఒక్కోటి రూ.55,450 విలువ చేసే 288 షేర్లు అంటే రూ.1,59,69,600 మూలధన విలువైన షేర్లు ఆయన పేరిట ఉన్నాయి.

మూలధన నిధి సేకరించింది ఏపీలోనే కాబట్టి

తన షేర్లను అక్రమంగా శైలజాకిరణ్ పేరిట బదిలీ చేయడంపై యూరి రెడ్డి ఏపీ సీఐడీకి ఫిర్యాదు చేశారు. కృష్ణా జిల్లాలోని తమ స్వగ్రామంలోని ఆస్తుల నుంచి సేకరించిన నిధులనే తన తండ్రి జీజే రెడ్డి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టారు. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్‌లో 37 బ్రాంచి కార్యాలయాల ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కాబట్టి తన షేర్ల అక్రమ బదిలీపై యూరి రెడ్డి ఏపీ సీఐడీకి ఫిర్యాదు చేశారు. న్యాయ నిపుణులను సంప్రదించిన తరువాతే ఆయన నిబంధనల మేరకు ఫిర్యాదు చేశారు. యూరి రెడ్డి ఫిర్యాదును పరిశీలించి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నిర్ధారించుకున్న తరువాత సీఐడీ విభాగం కేసు నమోదు చేసింది. ఏ–1గా చెరుకూరి రామోజీరావు, ఏ–2గా చెరుకూరి శైలజాకిరణ్‌లను పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా

ఉత్తమ పథకం

- యూనివర్సల్ హెల్త్ కవరేజ్‌లో ఏపీ ముందడుగు
- రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలన్నింటికీ వర్తింపు
- ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులు భేష్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పేద ప్రజలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా అత్యాధునిక కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే కాకుండా, శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఆర్థిక తోడ్పాటునందించడానికి ప్రవేశ పెట్టిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం జాతీయ స్థాయిలో ప్రశంసలందుకుంటోంది. డా. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ఉత్తమ పథకమని, దాని అమలు సాహసోపేతమైన చర్య అని ఏకంగా నేషనల్ హెల్త్ అథారిటీనే అభివర్ణించింది. ఈ పథకం శస్త్ర చికిత్స చేయించుకుని, విశ్రాంతి తీసుకునే సమయంలో పేదల జీవనోపాధికి పెద్ద భరోసా ఇస్తోందని తెలిపింది. ప్రజారోగ్య రంగంలో ఉత్తమ పద్ధతులు, ఆవిష్కరణలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోందని నేషనల్ హెల్త్ అథారిటీ కితాబునిచ్చింది. వివిధ రాష్ట్రాల్లో ఆరోగ్య బీమాలో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసిన అథారిటీ.. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకంపై ప్రశంసలు కురిపించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం పేద కుటుంబాల్లోని వారు శస్త్ర చికిత్సలు చేయించుకున్న అనంతరం విశ్రాంతి సమయంలో గృహ ఖర్చులకు రక్షణ కవచంగా నిలుస్తోందని పేర్కొంది. ఇది చాలా పెద్ద కార్యక్రమమైనప్పటికీ, వైఎస్ జగన్ ప్రభుత్వం విజయవంతంగా కొనసాగిస్తోందని తెలిపింది. 'శస్త్ర చికిత్స చేయించుకునే రోగులకు కోలుకోవడానికి కొన్ని రోజులు విశ్రాంతి అవసరం. ఆ సమయంలో రోగి జీవనోపాధిని కోల్పోయి, ఆర్థికంగా నష్టపోతారు. విశ్రాంతి సమయంలో రోజువారి వేతనాలు రాకపోవడంతో ఆ కుటుంబాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంటుంది. కుటుంబాల నిర్వహణ కష్టమవుతుంది. ఇదే సమయంలో ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా వారి గృహ ఖర్చులకు రక్షణ కల్పిస్తోంది' అని అథారిటీ తెలిపింది. శస్త్ర చికిత్స చేయించుకుని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన 48 గంటల్లోనే ఆ పేద కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల్లో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా భత్యం జమ అవుతోందని పేర్కొంది. విశ్రాంతి సమయంలో రోజుకు రూ.225 చొప్పున గరిష్ఠంగా రూ. 5,000 వరకు పేద కుటుంబాల ఖాతాల్లో జమ చేస్తున్నారని, మరే ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి పథకం లేదని అథారిటీ తెలిపింది.

యూనివర్సల్ హెల్త్ కవరేజీలో ఏపీ ముందడుగు

యూనివర్సల్ హెల్త్ కవరేజీని సాధించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందడుగు వేసిందని అథారిటీ తెలిపింది. రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న పేద కుటుంబాలను రేషన్ కార్డుతో సంబంధం లేకుండా నవశకం కార్యక్రమం కింద గుర్తించి ఆ కుటుంబాలకు డా.వైఎస్సార్ ఆరోగ్య శ్రీ స్మార్ట్ హెల్త్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపింది. క్యూఆర్ కోడ్, యూనిక్ ఐడీ నెంబర్లతో కూడిన ఈ స్మార్ట్ హెల్త్ కార్డులతో లబ్ధిదారుల వైద్య రికార్డుల నిర్వహణ మెరుగుపడిందని పేర్కొంది. అంతే కాకుండా రోగి వివరాల గోప్యతకు, భద్రతకు ఈ కార్డులు రక్షణ కల్పిస్తున్నాయని చెప్పింది. కుటుంబ యజమాని, సభ్యులందరి వివరాలను, గ్రామ, వార్డు సచివాలయాల వివరాలను కూడా కార్డుల్లో పొందుపరిచారని పేర్కొంది. ఆరోగ్య శ్రీ స్మార్ట్ హెల్త్ కార్డులు చాలా నాణ్యతతో ఉన్నాయని, పదేళ్లకుపైగా మన్నిక ఉంటుందని తెలిపింది.

2019 జూన్ నుంచి ఈ ఏడాది ఆగస్టు నెలాఖరు వరకు డా.వైఎస్సార్ ఆరోగ్య ఆసరా ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు..

వర్గం	లబ్ధిదారుల సంఖ్య	ఆర్థిక ప్రయోజనం (రూ.కోట్లలో)
బీసీలు	8,53,111	522.03
ఎస్సీలు	2,86,977	170.93
ఎస్టీలు	64,457	34.70
మైనారిటీలు	85,427	65.99
కాపులు	28,638	45.11
ఇతరులు	2,46,387	132.52
మొత్తం	15,64,997	971.28

పంచతంత్రం

రాజస్తాన్‌లో అధికారం నిలబెట్టుకుంటే..

2024లో పగ్గాలు మాకే: ఖర్గే

జైపూర్: రాజస్తాన్‌లో మరోసారి అధికారంలోకి వస్తే, 2024 ఎన్నికల తర్వాత కేంద్రంలో ఏర్పడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. రాజస్తాన్‌లోని బరన్ జిల్లాలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం అశోక్ గెహ్లాత్ ప్రభుత్వం పాల్పడిన అవకతవకలకు సంబంధించిన వివరాలన్నీ 'రెడ్ డైరీ'లో ఉన్నాయంటూ ఇటీవల ప్రధాని మోదీ పదేపదే చేస్తున్న ఆరోపణలపై ఖర్గే స్పందిస్తూ.. రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని కూడా అదే 'రెడ్ డైరీ'లో రాసి ఉందంటూ వ్యాఖ్యానించారు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటైన పక్షంలో 2024లో కేంద్రంలో తమ పార్టీయే అధికారంలోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలు 25 మంది బీజేపీలను ఎన్నుకున్నప్పటికీ వారు రాష్ట్రానికి నిధులు గానీ నీళ్ల గానీ తేలేకపోయారని ఆరోపించారు.

ప్రజలు మళ్లీ మాకే అధికారమిస్తారు: సీఎం గెహ్లోత్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కాంగ్రెస్‌కే అధికారమిచ్చేందుకు ప్రజలు సిద్ధమయ్యారని రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోత్ చెప్పారు. కోవిడ్ మహమ్మారి వంటి సవాళ్లున్నా, ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు కుట్రలు జరిగినప్పటికీ సుపరిపాలన అందించిన కాంగ్రెస్‌నే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రజల్లో బీజేపీ పట్ల ఇప్పటికీ ఆగ్రహం ఉందని, ఆ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తమ ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాల్లో ఎన్నో కొత్త పథకాలను ప్రజల కోసం తీసుకువచ్చిందని వివరించారు. రాజస్తాన్‌లో నవంబర్ 25న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది.

మిజోరంలో 39 మందితో కాంగ్రెస్ జాబితా విడుదల

ఐజ్వాల్: మిజోరం అసెంబ్లీ ఎన్నికలకు గాను సోమవారం కాంగ్రెస్ పార్టీ 39 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను విడుదల చేసింది. ఇందులో నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు చోటు దక్కింది. మిజోరం పీసీసీ చీఫ్ లాల్‌సౌటా ఐజ్వాల్ వెస్ట్–3 స్థానం నుంచి, పార్టీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లాల్‌థంజారా ఐజ్వాల్ నార్త్–3 నుంచి బరిలోకి దిగనున్నారు. మంగళవారం జరిగే కార్యక్రమంలో ఈ జాబితాను అధికారికంగా ప్రకటిస్తామని కాంగ్రెస్ మీడియా విభాగం అధ్యక్షుడు లాల్‌రెమ్‌రువాటా చెప్పారు. త్వరలోనే తాము కూడా అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని ప్రతిపక్ష బీజేపీ తెలిపింది.

పార్టీలన్నింటికీ... నవంబర్ పరీక్ష..!

కీలకంగా మారిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు | సర్వశక్తులూ ఒడ్డుతున్న బీజేపీ, కాంగ్రెస్, స్థానిక పార్టీలు

- లోక్‌సభ ఎన్నికలకు దిశానిర్దేశం చేయనున్న ఫలితాలు!
- బీజేపీకి, ఇండియా కూటమికి అక్షరాలా అగ్నిపరీక్షే

ఐదు రాష్ట్రాలు. వాటిలో నాలుగు కీలక రాష్ట్రాలు. మొత్తం 16 కోట్ల పై చిలుకు ఓటర్లు. దాదాపు 650 పై చిలుకు అసెంబ్లీ స్థానాలు. ఎంతోమంది వెటరన్ నాయకులకు కీలక పరీక్ష. కీలకమైన లోక్‌సభ ఎన్నికల ముంగిట మోదీ సారథ్యంలోని బీజేపీకి, దాని ఓటమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో పుట్టుకొచ్చిన విపక్ష ఇండియా కూటమి సత్తాకూ అగ్నిపరీక్ష! ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికలు ఇలా ఎన్నో రకాలుగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వాటి ఫలితాలపైనా సర్వత్రా అంతే ఆసక్తి వ్యక్తమవుతోంది. దేశ రాజకీయ భవిష్యత్తును నిర్దేశించడంలో వచ్చే నవంబర్ కీలకంగా మారనుంది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు జరుగుతున్న ఎన్నికలు వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలకు రంగం సిద్ధం చేయనున్నాయి. అందుకే వీటి ఫలితాలను తమకు అనువుగా మార్చుకోవాలని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, విపక్ష ఇండియా కూటమి పట్టుదలగా ఉన్నాయి. అందుకోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు ఆ తర్వాత వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయాలని ఏమీ లేదు. ఉదాహరణకు 2018లో ఇలాగే రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. మూడింట్లోనూ కాంగ్రెస్సే నెగ్గింది. కానీ 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆ మూడు రాష్ట్రాల్లోని 65 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ నెగ్గింది కేవలం మూడంటే మూడు! ఈసారి మాత్రం జాతీయ స్థాయిలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఐదు రాష్ట్రాల ఎన్నికలు కచ్చితంగా 2024 లోక్‌సభ ఎన్నికలకు మూడ్ సెట్ చేస్తాయని భావిస్తున్నారు.

ఈ సీనియర్లకు పెను పరీక్ష

తాజా అసెంబ్లీ ఎన్నికలు ఎంతోమంది వెటరన్ నాయకుల భవితవ్యాన్ని తేల్చేయనున్నాయి. బీజేపీ నుంచి మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, రాజస్తాన్‌లో వసుంధర రాజె, ఛత్తీస్‌గఢ్‌లో రమణ్‌సింగ్‌తో పాటు కాంగ్రెస్ నుంచి రాజస్తాన్ సీఎం అశోక్ గహ్లోత్, మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు. అలాగే తెలంగాణలో భారాస అధినేత కేసీఆర్, మిజోరంలో సీఎం జోరాంతంగా ముక్కోణపు పోటీ ఎదుర్కొంటున్నారు. ఇటీవలే పుట్టుకొచ్చిన ఇండియా కూటమికి ఈ ఎన్నికలు తొలి అగ్నిపరీక్ష కానున్నాయి. కాంగ్రెస్‌తో పాటు పలు ఇండియా కూటమి పార్టీలు జపిస్తున్న కులగణన మంత్రం ఏ మేరకు ఫలిస్తుందో ఈ ఎన్నికలు తేల్చనున్నాయి.

ఎవరి ప్రయత్నాల్లో వారు...

కాంగ్రెస్

- కర్ణాటకలో మాదిరిగా రాష్ట్రాలవారీగా సామాజిక, ఆర్థిక, సంక్షేమ పథకాల ప్రకటన...
- ఓబీసీలను బీజేపీకి దూరం చేసేందుకు జాతీయ స్థాయిలో కులగణనకు డిమాండ్
- స్థానికాంశాలకు ప్రాధాన్యం. ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపికల్లో వీలైనంత వరకు స్థానిక ముఖ్య నేతలకు నిర్ణయాధికారం.

బీజేపీ

- నరేంద్ర మోదీ ఛరిష్మాను ఓట్లుగా మార్చుకునేలా ప్రచారం...
- కేంద్ర మంత్రులతో పాటు పేరున్న సీనియర్ ఎంపీలకు అసెంబ్లీ టికెట్లు
- జీ20 సదస్సు ఘనవిజయం, మహిళా బిల్లు, ఎల్పీజీ సిలిండర్ ధర తగ్గింపు వంటి ప్రచారాలు

2018లో 5 రాష్ట్రాల్లో పార్టీలవారీ ప్రదర్శన

పార్టీ	స్థానాలు	ఓట్ల శాతం
కాంగ్రెస్	306	45
బీజేపీ	199	29
ఇతరులు	174	26

అంకెల్లో ఎన్నికలు...

- అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరంల్లో మొత్తం లోక్‌సభ స్థానాలు **83**
- మొత్తం అసెంబ్లీ స్థానాలు **679**
- మొత్తం ఓటర్లు **16.1** కోట్లు
- మహిళా ఓటర్లు **7.8** కోట్లు
- తొలిసారి ఓటర్లు **62** లక్షలు

– సాక్షి, నేషనల్ డెస్క్

మణిపూర్‌ను కాదని ఇజ్రాయెల్‌పై ఆసక్తి ఎందుకు?

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీరు సిగ్గుచేటు

- 'భారత్' భావనపై కాషాయ పార్టీ దాడి చేస్తోంది
- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపాటు

మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో రాహుల్ పాదయాత్ర

ఐజ్వాల్: మణిపూర్ మంటల్లో కాలిపోతున్నా ఏమాత్రం పట్టించుకోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పరిణామాలపై మాత్రం ఎనలేని ఆసక్తి చూపుతున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. మోదీ తీరు సిగ్గుచేటు అని దుయ్యబట్టారు. మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ సోమవారం 2 కిలోమీటర్ల మేర పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పొరుగు రాష్ట్రం మణిపూర్ ఇప్పుడు ఒకే ఉమ్మడి రాష్ట్రంగా లేదని, తెగల మధ్య ఘర్షణలతో రెండుగా విడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 1986లో శాంతి ఒప్పందంతో మణిపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశాంత వాతావరణం నెలకొల్పిందని గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రం రావణకాష్టంగా మారిందన్నారు. మణిపూర్‌లో పరిస్థితులను చక్కదిద్దడంపై దృష్టి పెట్టకుండా ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంపై ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతుండడం తనకు ఎంతో ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. మణిపూర్‌లో ఘర్షణ మొదలైన తర్వాత మన దేశ పాలకుడు ఇప్పటికీ అక్కడ పర్యటించకపోవడం నిజంగా సిగ్గుచేటు అని రాహుల్ ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సుపరిపాలన

మణిపూర్‌లో నెలకొన్న సమస్యలే దేశంలో ఇతర ప్రాంతాల్లోనూ కనిపిస్తున్నాయని, మైనార్టీలు, గిరిజనులు, దళితులు సౌకర్యవంతంగా లేరని, ఒత్తిళ్లకు గురవుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దేశ ప్రజలపై అణచివేత చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. భారత్ అనే భావనపై కాషాయ పార్టీ దాడి చేస్తోందని పరోక్షంగా అధికార బీజేపీపై ధ్వజమెత్తారు. ఆ పార్టీ వేర్వేరు వర్గాలు, మతాలు, భాషలను లక్ష్యంగా చేసుకుందని అన్నారు. బీజేపీ నాయకులు దేశంలో విద్వేషం, హింసను ప్రేరేపిస్తున్నారని విమర్శించారు.

పాదయాత్రకు విశేష స్పందన

ఇదిలా ఉండగా, ఐజ్వాల్‌లో రాహుల్ పాదయాత్రకు విశేష స్పందన లభించింది. ఇరువైపులా బారులు తీరిన వేలాది మంది ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన ముందుకు సాగారు. కొందరితో కరచాలనం చేశారు. పాదయాత్రలో ప్రజలు ఆయనతో ఉత్సాహంగా సెల్ఫీలు తీసుకున్నారు.

మిజోరంలో ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, మతంపై బీజేపీ దాడులు చేస్తోందని, రాష్ట్రంలోని అధికార మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్) అందుకు వత్తాసు పలుకుతోందని రాహుల్ ఆక్షేపించారు. ఎంఎన్ఎఫ్ పాలనలో మిజోరంలో మాదకద్రవ్యాల బెడద పెరిగిపోయిందని, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. డ్రగ్స్ వల్ల మిజోరంలో 250 మంది యువకులు చనిపోయారని తెలిపారు. మిజోరం పాలకులు ఢిల్లీ పాలకులు తొత్తులుగా మారారని రాహుల్ గాంధీ ఘాటుగా విమర్శించారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లో సుపరిపాలన అందిస్తున్నామని గుర్తుచేశారు. మిజోరం ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, మత విశ్వాసాలను కాపాడడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.



సోమవారం ఐజ్వాల్‌లో పాదయాత్రలో పాల్గొన్న రాహుల్ గాంధీ

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai - 600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943